అపరాధ పరిశోధన

రూ. 6 | మార్చి '85



Blank Page

సంపుటి: 40 ఫోన్ నెం:
సంచిక: 2 64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 72 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

మార్చి, 1985

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-200

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1-00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరవాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-3-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు మే '85 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. న్యూఢిల్లీ రహస్య సమాచార కుంభకోణం కేసులో ఇటీవల పట్టుబడ్డ గూఢచారి ముఠాకు ప్రధాన సూత్రధారి—?
   (కుమార్ నారాయణ్, టి.ఎన్. ఖేర్.)
2. ప్రస్తుత పార్లమెంట్‌లో ఇదియే ప్రధాన ప్రతిపక్షం—?
   (తెలుగుదేశం, మార్క్సిస్ట్ పార్టీ.)
3. ఆడవాళ్ళ జన్మహక్కు ఇది—?
   (అలుక, ఏడుపు.)
4. రాష్ట్రంలో వీటి బెడద తీరేనా—?
   (దోమలు, దోపిడీలు.)
5. పిల్లలకు ఇది చూడాలంటే ఎంతో ఇష్టం—?
   (సర్కస్, జూ.)

ఈ నెలలో...

కథలు(మాస పత్రిక)

4. మా ఊరి మంత్రగాడు—చంద్రశేఖర అజాద్
21. నరభక్షకుడు—కె. వి. రమణ
50. కరాటే దొంగలు—'విపంచి'
65. కిడ్నాపర్—ఎమ్. వి. వి. సత్యనారాయణ
84. నేరకళానైపుణ్యం—చంద్రశేఖర్ అజాద్
97. మంత్రికి మరణం తప్పదు—టెంపోరావ్
111. స్కల్ స్టార్స్—స్వరూప్
135. ఆటో డ్రైవర్—బి. రాజేశ్వరి
152. వీడని జంట—వసుంధర
172. దొంగల పెళ్ళి—కాశీభట్ల భానుమూర్తి

నవలలు (సప్లిమెంట్)

3. రాధ సాహసం—టెంపోరావ్
40. లవర్స్ సెంట్—వసుంధర
83. మిస్‌జాలీ కథ—మిస్ కె. మధుబాల
121. నల్లత్రాచు—చంద్రశేఖర్ అజాద్
154. అగ్ని కిరీటం (సీరియల్)—ప్రతాప రవిశంకర్

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

మాఊరి మంత్రగాడు

—చంద్రశేఖర అజాద్

"ఏం చేయమంటావురా" దాదాపు ఏడుస్తూ అన్నాడు సింహం.

వాడి పేరు నరసింహమూర్తి. లావుగానే ఉంటాడు. మొఖంలో ముందుగా కనిపించేది మీసాలే. అయినా వాడిలో సింహం తాలూకు లక్షణాలు మాత్రం లేవు. పైపెచ్చు

వాడికి పెళ్ళయి ఆరు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు పిల్లలు పుట్టలేదు. మా ఫ్రెండ్స్ సర్కిల్లో వాడికదో డిస్‌క్వాలిఫికేషన్.

"వెధవా ....ఆరేళ్ళు గడుస్తున్నా ఓ వెధవాయిని కనలేక పోయావు" అని ఒకరంటే

"వెధవల్లారా పిల్లల్ని పుట్టించకుండా నేను దేశసేవ చేస్తుంటే మీరంతా ఎగతాళి చేస్తున్నారు. దేశద్రోహనేరం క్రింద మీ అందరినీ జైల్లో త్రోయించాలి" అంటాడు సింహం.

అలాంటి సింహంగాడే ఓ నలుసును కనటానికి యెన్ని గుళ్ళు, గోపురాలు తిరిగాడో లెక్కలేదు. ఎంతమంది డాక్టర్ల దగ్గర తన భార్యను, తనను పరీక్ష చేయించుకున్నాడో లెక్కలేదు. మొత్తంమీద పిల్లల విషయంలో వాళ్ళు పడుతున్న ఇబ్బందులన్నీ మాకు తెలుసు.

వాడికి తండ్రిపోయి చాలాకాలమయింది. అమ్మవున్నా తన తమ్ముడి దగ్గర వుంటుంది. వీడ్ని పిసినారివాడని ఎవరనుకున్నా అదేం లెక్కలోకి తీసుకునేవాడు కాదు.

కేవలం భార్యాభర్తలే ఆ కొంపలో పడివుండటం వారికి బోర్ కొట్టిస్తోంది. కనీసం ఓ పిల్లవాడు, అధమం ఓ ఆడపిల్లయినా పుడితే బాగుంటుందని వాడి తాపత్రయం.

తక్షణ సమస్యమాత్రం అదికాదు.

మేమంతా కలిపి చదువుకున్నాక విడిపోయాం. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్నా మా నడుమ ఆ జ్ఞాపకాలు తప్పించి ఉత్తరాలు రాసుకోవటం ఉండేదికాదు. వాడు ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయి ఓరోజు హఠాత్తుగా వచ్చాడు.

వాడు ఈ ఊరు రాగానే ఇళ్ళ వేటలో దక్షిణామూర్తి

ఇల్లు తగిలింది. ఆయనకు మంత్రాలూ, తంత్రాలూ వచ్చని విన్నప్పుడు ఆనందపడ్డాడే గాని భయపడలేదు.

ఇంట్లోకి వచ్చిన క్రొత్తలో దక్షిణామూర్తిగారి పట్ల అత్యంత వినయపూర్వకంగా ఉండేవాడు. ఆయన మాత్రం చాలా గంభీరంగా ఉంటారు. ఓసారి నేను చూశానుకూడా.

ఆయన కాషాయ రంగులో పట్టుపంచి ధరించి, మొఖానికి విభూతి రాసుకొని పూజలో కూర్చుంటే రెండుగంటల పాటు ప్రపంచం ఏమైపోయినా కదలడుగాక కదలడట.

సింహంగాడు ఆయన భక్తి ప్రపత్తుల గురించి ఎంతో ఆరాధనాపూర్వకంగా వివరించేవాడు. చాలామంది భక్తుల్ని చూశానుగాని అంతగా లీనమయ్యేవారిని చూడలేదని చెప్పాడు. ఆయన సింహంగాడు రెండు చేతులూ జోడించి నమస్కరిస్తే "పుత్ర సంతానప్రాప్తిరస్తు" అని దీవించేట.

సింహంగాడు వెంటనే పుత్రుడు కలిగినంత ఉత్సాహంతో అప్పటికప్పుడు ఆ నడుమే కొన్న గ్రైండర్‌లో పిండి రుబ్బించి గారెలు చేయించేశాడు. ఆయనకూడా తృప్తిగా ఆరగించేరు.

సింహంగాడంత ఉత్సాహపడటానికి రెండు కారణాలున్నాయి. మొదటిది ఆయన ఆశీర్వాదం మీద బలమయిన నమ్మకం.

రెండోది "పుత్రసంతాన ప్రాప్తిరస్తు" అని దీవించటం.

నెల రోజులకల్లా దక్షిణామూర్తి ప్రతాపం తెలిసిపోయింది.

ఇప్పుడు సమస్య పుత్రుడా? పుత్రికా అని కానేకాదు.

ఇల్లు మారటం ఎలా?

2

దక్షిణామూర్తి ఆ ఇల్లు కట్టాడో, కొన్నాడో మాకు తెలియదు. మే మనుకోవటం అది కట్టుండడు. కొనుంటాడు. అదికూడా కారుచౌకగా ఎవరినుండో అమ్మించుకొనుంటాడని మా నిశ్చితాభిప్రాయం.

దక్షిణామూర్తి పేరుకు తగినట్లుగానే చిన్నతనం నుండి దక్షిణలు స్వీకరించేందుకే ఇష్టపడేవాడని, చదువూ, సంధ్యా అబ్బకపోగా సన్యాసుల్తో కలిసి తిరిగి పాముమంత్రాలూ, తేలుమంత్రాలూ, చేతబడులూ నేర్చుకున్నాడని సింహంగాడి కథనం.

నిజంగానే దక్షిణామూర్తిని చూస్తే ఎవరికయినా కొంత జంకు కలుగుతుంది. అంతటి విశాలదేహం ఆయనది. ఆయన పూజలోకి వెళ్ళటానికి నీలంరంగు పట్టుపంచె, ధవళవస్త్రం, ఎర్రటి ఎరుపు ఇంకా చాలా రంగులున్నాయి.

ఆయన ఇంటిలో పెద్ద విగ్రహం ఉందంట.

అది అమ్మగారి విగ్రహం.

ఆవిడ కళ్ళు ఎర్రగా చూస్తుంటే, నాలిక నుండి రక్తాలూ, చేతుల్లో శూలాలూ, గొడ్డళ్ళూ, మెడలో పుర్రెలూ, ఎవడి గొంతుమీదో ఆమె కాలుతో నానాబీభత్సంగానూ, భయంకరంగానూ వుందట.

సింహంగాడు దక్షిణామూర్తి ఇంట్లో కెందుకో వెళ్ళి ఆ విగ్రహాన్ని చూసి అలానే నిలబడిపోయాట్ట. దక్షిణామూర్తి వచ్చి కదిలిస్తేగాని తేరుకొలేదట.

"ఆ బొమ్మచూసి నా గుండె నిజంగా ఆగిపోయిందిరా. అందులో ఎలాంటి సందేహం లేదు. వాడొచ్చి నాగుండెను ఆడించాడు" అన్నాడు.

తొలుతగా ఆశీర్వాదంతోనూ, గారెల్తోనూ ముగిశాక

సింహంగాడికి ఓ టైంటేబుల్ అందిందట.

దాని ప్రకారం సోమ, బుధవారాల్లో ఇడ్లీలు, మంగళవారం మినపట్టు, గురువారం పూరీలూ, శుక్రవారం పెసరట్టూ ఆయన ఇష్టపడతారట. ఆదివారం నాడు గారెల్లో కోడిమాంసం నంజుకుతింటారట. కాగా శనివారంమాత్రమే ఏమీ ముట్టుకోరు.

"ఈయనగార్కి ముక్కుమీద కోపమమ్మాయ్....మా ఇంట్లో మేమెప్పుడూ టిఫిన్లు చేసుకోం. మావయ్యగారికి ఏ వారం ఏం తినాలో వాళ్ళకే తెలుసు. ఆయనకు ఇష్టం కలిగితే ప్రాణాలు పోస్తారు. లేకపోతే దేవిదగ్గర కూర్చొని మంత్రం చదివితే నెలరోజుల్లో కృంగిపోయి, ఎండిపోతారు" అని ఓ బాంబు పేల్చిందట ఆయన ధర్మపత్ని.

భార్యద్వారా ఈ విషయం తెలుసుకున్న సింహంగాడు గుండె బేజారయిపోగా ప్రొవిజన్ లిస్ట్ పెంచేశాడు. టైంటేబుల్ ప్రకారం అన్నిరకాల టిఫిన్లూ, మాంసాలూ, చేపలూ, గుడ్లు వాడు తింటూనే వున్నాడు.

"ఒరేయ్ మా ఇంట్లో పూరీలు చేసుకోవాలంటే నూనె ఖర్చవుతుందని చపాతీలే తింటాం. వీడికి కిలో నూనె బాండీలో పోస్తే మిగిలేది పావుకిలోనే. ఓసారి వాడిన నూనె మళ్ళీ వాడితే వాడికి పడదట. ఆ పూరీలు ఎర్రగా కాలాలి. పొంగాలి. పొంగటమెలాగో ఆయనే చెప్పాడు. చపాతి పిండిలో పాలుపోసి, కొంచెం ఆటా, చక్కెరకేళి అరటికాయలు, కోడిగుడ్డు సొన కలిపి, ఆ పిండిని ముద్ద చేయటానికి కొంచెంసేపు వ్యాయామం చేస్తే .... చిన్న సట్టెడు కుర్మాతో కలిపి చూస్తుండగానే ఆ కడుపులోకిజారిపోతాయి. ఇప్పటిదాకా ఎన్ని ఇడ్లీలూ, పూరీలూ, అట్లూ, కోళ్ళు నంజుకు తిన్నాడో తలుచుకుంటే గుండె చెరువయి

పోతుంది.

ఈ ఇల్లు ఖాళీ చేద్దామంటే భయంగా వుంది. వాడు ఇంట్లోకి రాగానే ముందు గోళ్ళూ, వెంట్రుకలూ సంపాదిస్తాడట. ఇల్లు మారతామంటే చాలు చేతబడి చేస్తాడు. దాంతో ఫినిష్. రెండొందలు పోయినా వాడు తినేవన్నీ సమర్పించుకోవటమే. ఎంతకాలం ఇలా చావాలి చెప్పు" అంటూ చెప్పుకొచ్చాడు సింహం.

మొదట్లో మా కయితే మహా సంతోషం కలిగింది. వీడి పిసినారితనానికి తగ్గట్టుగా మంచి ఓసరుగారే దొరికాడను కున్నాం. అయితే రానురానూ సింహంగాడు మరీ క్రుంగి పోవటం జరుగుతూంది. ఆ తేడా వాడి రూపంలోకూడా ప్రతిబింబించింది.

"ఏమ్మిత్రా అలా చిక్కిపోతున్నావు?"

"ఏంచేయమంటావురా.... ఆ దక్షిణామూర్తిగాడు నన్ను తినేస్తున్నాడు."

"చేతబడి చేశాడంటావా?"

"అదే నయమేమో .. వాడికి ఏ క్షణం కోపంవస్తుందో నని ఛస్తున్నాం. వాడి సేవలోనే మాకు తెల్లారిపోతుంది. ఎరక్కపోయి ఆ ఇంట్లో దిగాను. ఆ ఇల్లు ఖాళీగా ఉందంటేనూ, కొంచెం బాగుందంటేనూ వెళ్ళాను. దాని వెనుక ఇంత చరిత్ర వుందని తెలియదు. ఆ చుట్టుప్రక్కలవారు చెబుతున్నారు. ఆ ఇల్లు ఎప్పుడూ ఖాళీగానే వుంటుందట. వాడు మహాక్రూరుడంట. ఇల్లుమారితే తప్పకుండా పగబడతాడు. అది కాదురా ఆ తినేదేదో తింటుందికాక "మీకు మాత్రం ఎవరున్నారులే" అంటున్నారు. ఆఖరకు నా బతుకిట్టా అయిపోయింది. ఇంతమందున్నారు మీ వల్ల ఉపయోగం లేకుండా పోయింది" అని బావురుమన్నాడు.

చెప్పొద్దూ సింహంమీద జాలికలిగింది. వీడ్ని ఇలానే వదిలేస్తే ఏదోరోజు ఆ భయంతోనే గుండాగి చచ్చిపోయేటట్లున్నాడు.

సింహంగాడిచేత ఖర్చుపెట్టించే విషయంలో మేం దక్షిణామూర్తిని అభినందించినా, వాడి బలహీనతమీద ప్లే చేయటాన్కి ఒప్పుకోలేకపోయాం. ఆ విషయంలో అతనిమీద కోపం వచ్చింది.

సింహంగాడి వ్యవహారం చాలా సున్నితంగా మారింది. భూతాలు.... చేతబడులమీద వాడికి నమ్మకం....భయం. కాబట్టి వాడు తానుగా దక్షిణామూర్తి విష కౌగిలినుండి బయటపడటానికి ఏం చేయలేడు. వాడి ముందున్నది ఒకటే మార్గం ఈ ఊరినుండి ట్రాన్స్ఫర్ చేయించుకోవటం. అదిమాత్రం సాధ్యమయ్యే పనికాదు రిక్వెస్టుమీద ఈ ఊరి కొచ్చాడు. మరో మూడు సంవత్సరాలదాకా మాట్లాడటానికి లేదు పైపెచ్చు అంత పరపతికూడా లేదు.

మేం నలుగురం కలిసి వెళ్ళి వాడ్ని బెదిరించాలన్నా, అది తెలిస్తే సింహంగాడు ఛస్తే ఒప్పుకోడు. 'ఇప్పటికే నా గోళ్ళూ.... వెంట్రుకలూ వాడి దగ్గరుంటాయి ... మీరు పోట్లాడి వెళితే పోయేది నా ప్రాణంకదా' అంటాడు.

అందుకని ఏదో మార్గం ఆలోచించాలి.

దక్షిణామూర్తికి మంచి గుణపాఠం నేర్పాలి.

అందుకు ముందుగా మా మిత్రబృందం అంతా కలిసి చర్చించాలి. అందులో సింహంగాడు వుండకూడదు.

3

సమావేశంలో ఆరుగురు వున్నారు. అందులో కొందరికి ఈ విషయం తెలియదు కాబట్టి క్లుప్తంగా వివరించాను.

"కాబట్టి ఇప్పుడు సింహంగాడ్ని దక్షిణామూర్తి ఇంటి

నుండి మార్పించాలి. ఇందుకు మనమేం చేసినా వాడి కిబ్బంది కలగకూడదు. తర్వాతి విషయం. మానసికంగా ఇప్పటికే వాడు యెంతో భయపడుతున్నాడు. మనం నలు గురం వెళ్ళి వాడ్ని బెదిరించొచ్చు. అలా చేయటానికైనా అసలు వాడి కార్యక్రమం ఏమిటో....వాడి వెనకాల యెవ రున్నారో....వాడికెంత బలముందో వివరాలు సేకరించాలి. అది పూర్తయ్యాక మనం ఏం చేస్తే బాగుంటుందో ఆలో చించాలి. సాధ్యమైనంత వరకు దక్షిణామూర్తి స్వయంగా సింహంగాడ్ని నా యిల్లు ఖాళీచెయ్యి బాబు అనాలి. సలహా లివ్వండి" అన్నాను.

"అసలు సింహంగాడి బాధేమిటి? డబ్బులు ఖర్చయి పోతున్నాయనా? వాడేమైనా చేస్తాడనా?"

"రెండూనూ"

"పోనీండి దక్షిణామూర్తయినా తింటాడు. వాడి కడుపు కొట్టడమెందుకు"

మేమంతా నవ్వుకున్నాం.

"దక్షిణామూర్తా.... పేరుకూడా అదిరిందిగా....వాడ్ని చూశారుటరా."

"నేను చూశాను. వాడి కంఠం గండుతుమ్మెద ఝూం అంటూ తిరుగుతుంటే వచ్చే శబ్దంలా వుంటుంది...." అన్నాను.

"మరి అలాటోడితో ఏంటిరా బాబు....అందులోనూ దేవీ ఉపాసన చేస్తాడంటున్నావ్."

"దేవినీ, దయ్యాల్ని మనం విశ్వసించం గనుక బాధ లేదు."

"నేను విశ్వసిస్తా" అన్నాడు మూర్తి.

"ఏమిటిరా"

"అవునురా నాకు నమ్మకం వుంది. రేపు వాడేమన్నా చేస్తే. సీరియస్‌గానే చెబుతున్నాను. పిల్లలుగలవాడ్ని."

కొంచెంసేపు ఎవరూ మాట్లాడలేదు. వాడి నమ్మకంమీద నేను అరిచో, గేలిచేసో వాదించటం వలన ప్రయోజనం వుండదు.

"ఓ.కె. నీ అభిప్రాయాన్ని అంగీకరించకపోయినా మన్నిస్తున్నాను. మనలో ఇంకెవరికైనా యిలాంటి విషయాలమీద నమ్మకం వుంటే చెప్పండి" అన్నాను.

ఈ సమావేశం జరిగాకే మాలో ఇన్ని అభిప్రాయాలూ, నమ్మకాలూ గలవారున్నారని మాకు తెలిసింది.

"దేవుడున్నాడో లేడో అనే విషయంలో నాకేం అనుమానంలేదు. ఈ ప్రపంచాన్ని ఏదో అతీతశక్తి నడిపిస్తుందని నా నమ్మకం. ఈ చేతబడుల గురించి ఈ నడుమే తిరిగి ఆలోచించాల్సి వస్తుంది. నా చిన్నప్పుడు యిలాంటి కథలు వింటుండేవాడ్ని. ఏది ఏమైనా దానిమీద మనం డిస్కస్ చేయటం అనవసరం" అన్నాడు విశ్వం.

"చేతబడుల మీదగాని మరోవిషయం మీదగాని యెవరి అభిప్రాయాలు వారికుండటం అవసరం. అయితే వాస్తవం ఏమిటా అని పరిశోధించటానికి ముందుకు రావాలి. అలా కాకుంటే మన సింహంగాడి లానే తయారవ్వాల్సి వుంటుంది. మనం వున్నాయన్నా, లేవన్నా నిజం ఒకటుంటుంది. అది తెలుసుకోవటానికి ప్రయత్నించుదాం" అన్నాడు సూర్యం.

గదంతా నిశ్శబ్దం....

"మనం ఇంక వెళ్ళాం" అన్నాడు మూర్తి.

"ఇంతకూ మన చర్చలో అసలు విషయం" నసిగాడు సూర్యం.

"ఇంకా విషయమేముంది. దక్షిణామూర్తి దగ్గర ఏవో శక్తులున్నాయి. వాడో క్షుద్రుడు. అందుకే ఆ క్షుద్రశక్తుల్ని క్షుద్రమైన కోర్కెల్ని తీర్చుకుంటానికి వాడుకుంటున్నాడు. కాబట్టి సింహంగాడు వాడ్ని మూడు సంవత్సరాలు మేపి ట్రాన్స్ఫర్ చేయించుకుంటే సరిపోతుంది. ఈలోపు వాడు కృంగి కృశించిపోయినా అది వాడిఖర్మ ....మనమేం చెయ్యలేం" అన్నాడు విశ్వం.

"అదికాదు విశ్వం....మరో భూతవైద్యుడ్ని కలుసుకుంటే" అన్నాడు మూర్తి.

"ఎందుకు మూర్తీ ఈ రిస్కంతా. క్షుద్రుల్లో మరలా మంచివాడా? పోనీ మంచివాడయినా వీడంత కాకున్నా వాడూ తింటాడు. ఆ తినేదేదో దక్షిణామూర్తే తింటాడు"

"నీ జోక్ బాగుంది"

"షటప్. జోక్ అనకు. నీ భావాలు అజ్ఞానంతో కూడుకున్నవే కాక క్షుద్రమైనవని నేనంటాను. భరించగలవా?" అరిచాడు సూర్యం.

వాతావరణం వేడెక్కింది.

"నువ్వు మాట్లాడేదేమిటో నాకర్థంకావటం లేదు."

"నీకర్థంకాదు. అయినా పిల్లలు గలవాడివి. సింహంగాడేదో అయిపోతే నువ్వు వర్రీ కావలసిన అవసరంలేదు" కఠినంగా అన్నాడు సూర్యం.

"పోనీ నువ్వే వర్రీ అవు"

"అది నువ్వు చెప్పాల్సిన అవసరంలేదు. దక్షిణామూర్తి అంతు నేను తేల్చుకుంటాను" అన్నాడు సూర్యం.

"నా భావాలు నీకు నచ్చకపోవచ్చు. అంతమాత్రాన నువ్వు అలా అనటం బాగాలేదు" నిరసనగా అన్నాడు మూర్తి.

"నువ్వు పిల్లలు కలవాడినని నన్ను వదిలిపెట్టండన్నావ్. మరలా సింహం గురించి అడగటం రెండు నాలుకల పద్ధతి....ఐ హేట్ దట్" అన్నాడు సూర్యం.

మూర్తి ఇంక మాట్లాడలేకపోయాడు.

"సారీ....ఇంక మనం బయలుదేరుదాం" అన్నాను.

ఒక్కొక్కరే శెలవుతీసుకొని వెళ్ళిపోయారు. ఆఖరకు నేనూ, సూర్యం మాత్రం మిగిలాం.

"ఇద్దరు ఆంధ్రులు చర్చ ప్రారంభిస్తే అది తగాదాగా మారుతుందట" అన్నాను స్వగతంగా.

"అది కాదురా నా బాధ. వారి మూఢనమ్మకంలో ఓ నిజాయితీ లేదు. స్నేహితుడన్న ఆరాటం లేదు" అన్నాడు సూర్యం.

"ఏం చేద్దామంటావ్" అన్నాను.

"దక్షిణామూర్తికి మామూలు డోస్ పనికిరాదు. చూడు వాడి నోటితోనే చెప్పిస్తా" అన్నాడు.

సూర్యం దక్షిణామూర్తికి దీటుగా వుంటాడు. వాడు ఏదైనా తలచుకుంటే చేసి తీరతాడు.

"అయితే దక్షిణామూర్తిని యెప్పుడు కలుద్దాం."

"పదిరోజుల తర్వాత."

4

ఉదయం ఎనిమిది గంటలకు నేనూ, సూర్యం దక్షిణామూర్తి ఇంటికి వెళ్ళాం.

సింహంగాడు భార్యతోకలిసి వేరే ఊరు వెళ్ళాడు. అక్కడ రిటైరైన ప్రముఖ డాక్టరున్నాడట. ఆయన నెలలో రెండురోజులు మాత్రమే వైద్యం చేస్తాడు. ఆ రెండు రోజుల్లోనే యెంతోమంది ఆయనదగ్గర కొస్తారు. ఆయనదగ్గరకు వెళ్ళినవారిలో చాలామందికి పిల్లలు పుట్టా

రట. ఈ సంగతి సింహం భార్య కెవరో చెబితే ఆమె బల
వంతంమీద బయలుదేరి వెళ్ళారు.

"దక్షిణామూర్తి గారిల్లిదేనాండి" బయటనుండే సూర్యం
అరిచాడు.

"ఎవరూ" కొండమీదినుండి వేగంగా దొర్లుతున్న
రాయిలాంటి కంఠం.

"మేమేనండి."

"లోపలకు రండి."

సూర్యం మొదట కాలు లోపలికి పెట్టాడు. ఆ తర్వాత
నేనూ లోపలకు వెళ్ళాను.

"కూర్చోండి" అన్నాడు కుర్చీలు చూపిస్తూ.

మేము కూర్చున్న తర్వాత "ఏం పనిమీదొచ్చారు"
అన్నాడు దక్షిణామూర్తి.

మేం గంటముందుగా వచ్చాం. మరోగంటలో ఆయన
పూజలోకి వెళ్ళిపోతారు. పోతే మరి రెండు గంటలదాకా
పిడుగులుపడ్డా రాడుకదా!

సూర్యం జేబులోనుండి ఓ పొట్లాం తీశాడు. ఆయన
కళ్ళలో ఎలాంటి భావం లేకుండా చూస్తున్నాడు.

పొట్లం విప్పగానే అందులో వెంట్రుకలూ, గోళ్ళూ
వున్నాయి.

దక్షిణామూర్తి కళ్ళలో సంతోషం కనపడింది.

"మీరు చేతబడి చెయ్యాలి" అన్నాడు సూర్యం ముందుకు
వంగి.

"తలుపువేస్తే బాగుంటుందేమో" అన్నాను నేను.

దక్షిణామూర్తి స్వయంగా లేచి తలుపేశాడు.

"నేను చేతబడి చేస్తానని ఎవరు చెప్పారు?"

"మీరు దయ్యాల్ని వదిలిస్తారటకదా."

"అవును"

"దయ్యాల్ని వదిలించేవారికి దయ్యాల్ని పట్టించటం చేతనవునని మా ఉద్దేశ్యం. ఆ ఆశతోనే వచ్చాం."

"ఇంతకూ యెవరికి చేయించదలుచుకుంటున్నారు."

"ఓ మనిషికి"

"కారణం"

"మమ్మల్ని తింటున్నాడు. అందుచేత."

దక్షిణామూర్తి కొంచెంసేపు ఆలోచించాడు.

"నావల్ల కాదు"

"మీవల్ల అవుతుంది. మాకు నమ్మకంగా తెలిసే వచ్చాం."

"ప్లీజ్ వాడిబాధ మేం భరించలేకపోతున్నాం" అన్నాను నేను.

"దానికి చాలా తతంగం జరగాలి. బోలెడు ఖర్చవుతుంది" అన్నాడు దక్షిణామూర్తి.

"దానిగురించి ఏం బాధలేదు. ఎంత ఖర్చయినా భరిస్తాం" అంటూ జేబులోనుండి వందరూపాయల కట్టతీసి "లెక్కపెట్టరా" అంటూ నాకిచ్చాడు సూర్యం.

దక్షిణామూర్తి సంతోషాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తపడుతున్నాడు.

"మీరింతగా ప్రాధేయపడుతుంటే....మీలాంటి అమాయకుల్ని బాధపెడుతున్నాడంటే భరించలేక ఒప్పుకుంటున్నాను" అన్నాడు దక్షిణామూర్తి.

"చాలా సంతోషం. మీరు ఒప్పుకోరేమోననుకున్నాం"

దక్షిణామూర్తి పెళ పెళ నవ్వాడు.

"ఇంతకూ ఈ గోళ్ళు యెవరివి?"

"నావే" అన్నాడు సూర్యం.

దక్షిణామూర్తి అప్రయత్నంగా "ఆఁ" అన్నాడు ఉలిక్కిపడి.

"నావే దక్షిణామూర్తీ! నామీద చేతబడి చేయాలి" సూర్యం కంఠం గంభీరంగా వుంది.

"ఎవరి యింట్లో మాట్లాడుతున్నారో తెల్సా" దక్షిణామూర్తి కంఠంలో మేకపోతు గాంభీర్యం....

"బాగా తెలుసు" అన్నాను జేబులో మినీ టేప్‌రికార్డర్ తీసి ప్లేచేస్తూ....

దక్షిణామూర్తి మొఖంలో రంగులు మారిపోయాయి.

"ఎవరు మీరు?" వణుకుతున్న కంఠంతో అన్నాడు.

"మీకు సెక్షన్ 303, 304 తెలుసా?" అన్నాడు సూర్యం.

"తెలవదు."

"మాకు తెలుసు."

"ఇప్పుడు నేను బయటకెళ్ళి జనాన్ని పిలిచి ఈ ఊళ్లో అందరికీ చేతబడి చేస్తున్నావని చెప్పాననుకో. నమ్మరా? మన ఊరిలో అందరికీ కళ్ళు ఎర్రగా మారటానికి. మెదడు వాపు వ్యాధి రావటానికి నువ్వే కారణం అని చెప్పాననుకో....ఏంచేస్తారు?"

దక్షిణామూర్తి మాట్లాడలేదు

"అప్పుడేం చేస్తారో తెలుసా? ప్రాణంతీస్తారు. కనీసం నీ ముందుపళ్ళు రెండు ఊడగొడతారు."

"మరప్పుడు కోడికూర ఎలా తింటాడు" అన్నాను.

"చారే త్రాగాలి "

"ఈ టేప్‌రికార్డరు తీసుకెళ్ళి పేపర్ల కెక్కుతాం. ప్రభుత్వం వారికిస్తాం. హేతువాద సంఘాల కిస్తాం.

అప్పుడు నీ పరిస్థితి ఏమిటో తెల్సా?” అన్నాడు సూర్యం.

“ఏమిటిదంతా. ఎవరు మీరు?” అన్నాడు. ఈసారి స్వరంలో మార్పు వచ్చింది.

“అలారా. మేం సింహం స్నేహితులం. నరసింహ మూర్తి స్నేహితులం. ఏవిటి వాడ్ని రోజూ టిఫిన్లూ, కాఫీల్తో ముంచుతున్నావట.”

“అబ్బే....”

“అబ్బే ఏమిటిరా. నీ బాబుగాడి సొత్తా అది. అమాయ కుడ్ని భయపెట్టి యిష్టం వచ్చినట్లు చేస్తావా” అన్నాను కోపంగా.

“రా” అన్నందుకు కొంచెం బాధపడ్డాడు

“నీ చరిత్ర అంతా, బయటకు తీశాం. ఈ యింట్లోకి వచ్చేవారందరితోనూ యెలా ప్రవర్తిస్తున్నావో, ఎన్నెన్ని టిఫిన్లూ, కోళ్లూ, చేపలూ తిన్నావో లెక్కలు రాశాం. రేపే యువకులంతా నీ యింటిమీదికి దండెత్తి వస్తారు. అందరికీ చేతబడి చెయ్యి చూద్దాం” అన్నాడు సూర్యం.

“నన్నేం చెయ్యమంటారు” అన్నాడు ధైర్యంగా.

“చెబుతాను. మొదటిది సింహాన్ని నువ్వు యిల్లు ఖాళీ చేయమని చెప్పాలి. రెండవది నువ్వు స్వయంగా మీ ఆవిడచేత టిఫిన్లు చేయించుకోవాలి. మూడవది నువ్వు ఈ వృత్తి మానెయ్యాలి.”

“మొదటి రెండూ న్యాయం. మూడోది మీకు న్యాయం కాదు” అన్నాడు దక్షిణామూర్తి.

“నో ... మేం ఒప్పుకోం.”

“దయ్యాలమీద కథలు రాసుకొని బ్రతికేవారిని మీరేం చేస్తున్నారు. చెప్పండి. నా నోటిదగ్గర కూడు తియ్యొద్దు” బ్రతిమాలాడు.

మేం ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నాం.

"వారి మూలంగానే కదా మాకు గిరాకీ లభించింది" అన్నాడు సవాల్ చేస్తున్నట్లుగా.

"వాళ్ళు మా ఊరివాళ్ళు కాదు కాబట్టి ఊరుకున్నాం. నువ్వుమాత్రం మానెయ్యాలి. నీ గురించి యెలాంటి వార్త తెలిసినా పేపర్లూ, ప్రభుత్వం, కోర్టులూ, ముందు పళ్లూ.... ఉరిశిక్షలూ" అన్నాడు సూర్యం.

దక్షిణామూర్తి తలూపాడు అంగీకారంగా.

"మీ ఆవిడుందా?"

"ఆమెందుకు."

"ఈరోజు టిఫిన్—ఏం తింటారు?"

"పూరీ—కుర్మా" అన్నాను నేను.

"చేయమని చెప్పండి పిలిచి" అన్నాడు సూర్యం.

"మీకొక్కడానా" అడిగాడు దక్షిణామూర్తి.

"కాదు నీకే" అన్నాడు సూర్యం.

చెప్పాక దక్షిణామూర్తి వంక ఆశ్చర్యంగా చూపింది వాళ్ళావిడ. సూర్యం ఫోటోలు తీశాడు "ఇది డి.యస్.పి గారితో ... మా మావగారవుతాడు .... ఈయన నీలాంటి వారి పేరు వింటే ఉగ్రరూపం దాలుస్తాడు. మరోరకంగా పిచ్చి వేషాలు వేస్తే ఖబడ్దార్" అన్నాడు లేచి నిలబడుతూ.

దక్షిణామూర్తి మావంక, టేప్‌రికార్డర్‌వంక వెర్రిగా చూస్తుండిపోయాడు.

మేం ముందుకు కదిలాం.

"ఏవండి" పిలిచాడు దక్షిణామూర్తి.

"ఏవిటి" అన్నాం అక్కడే నిలబడి వెనక్కి తిరిగి.

"మీ గోళ్ళూ, మీ వెంట్రుకలూ" జాగ్రత్తగా అందించాడు.

"థ్యాంక్స్"

* * *

"ఒరేయ్....గుడ్ న్యూస్. మా దక్షిణామూర్తి గారు ఇల్లు ఖాళీచేయమని చెప్పాడు" అన్నాడు సింహం సంతోషంగా.

"మంచిది. మాకేవన్నా పార్టీ వుందా."

"పార్టీయా....ఇంకేమన్నానా....సంవత్సరానికి సరిపడా తినేశాడు దక్షిణా మూర్తి" అన్నాడు సింహం.

"ఇంకో శుభవార్తరా" అన్నాడు సింహం.

"ఏమిట్రా"

"ఈ ఇల్లు అమ్మబడును" అని బోర్డు పెట్టాడు. దాదాపు గాల్లోకి ఎగిరినంత సంతోషంగా చెప్పాడు.

"ఏం చేశారో. చెప్పండిరా" అంటూ మూర్తి పట్టుబట్టాడు.

"ఏం చేస్తాం. చేతబడే" అన్నాడు సూర్యం.

"దేవుడు లేడని పూజార్లకి చేతబడులు లేవని అవి చేసేవాళ్ళకే బాగా తెలుసు మూర్తీ" అన్నాను నేను. □

స్టూడెంట్సుకు ప్రత్యేకం!



నరభక్షకుడు

కె.వి.రమణ

౧

శ్రీకాకుళం అడవుల్ని ఓ వారంరోజుల పాటు తుపా మోతలతో మారుమ్రోగించి గత రాత్రే కొంపజేరాను. సూర్యోదయానికి ముందే యెప్పటిలా నిద్రలేచి వ్యాయామం స్నానం వగయిరాలు ముగించి కాఫీ సేవిస్తూ పేపరు చదువుతున్నాను. మధ్యలో నల్లని బార్డరుకట్టి ముద్రించిన వార్త

మీద పడింది నాదృష్టి.

సీలేరు మారుమూల ప్రాంతాలలో దట్టమయిన అరణ్యాల మధ్య నరభక్షకుడయిన ఒక వ్యక్తి తిరుగుతున్నాడట. ఇప్పటికే యెందరో కొండజాతి ప్రజలను చంపుకుతిని భయోత్పాతాన్ని కలిగించిన ఆ వ్యక్తిని ప్రాణాలతోగాని వధించిగాని ప్రభుత్వానికి అప్పగించిన వారికి పదివేల రూపాయలు బహూమతి ఇవ్వబడుతుంది—ఇది ఆ వార్త సారాంశం.

పేపరు ప్రక్కనపెడుతూ చల్లారిపోతున్న కాఫీని ఒక గుక్కలో తాగేశాను. ఆ వార్త విషయంలో నా ఆలోచనలు ఒక కొలిక్కిరాకముందే నాకోసమని యెవరో వచ్చారంటూ కబురుతెచ్చాడు పనికుర్రాడు. ఆ వ్యక్తిని లోనికి పంపమని వాడికి చెప్పి తిరిగి పేపరు అందుకొని నల్లబార్డరు వార్తను మరోసారి చదవసాగాను.

"దండాలు దొరా!" అనే పరిచిత కంఠస్వరం విని తలెత్తేసరికి ముకుళిత హస్తాలతో నవ్వుతూ కనిపించాడు మకరయ్య.

మకరయ్య సీలేరు ప్రాంతానికి చెందిన 'నకిరి' నివాసి. కొండజాతి మనిషి. నలభై ఏళ్ళ వయసుగల మకరయ్య మొహాన్ని ఎప్పుడూ అంటిపెట్టుకునుండేది నవ్వే! గురి చూపి తుపాకీ పేల్చే సామర్థ్యం లేకపోయినా మకరయ్యకు వేటపట్ల గొప్ప ఆసక్తి.

సీలేరు ప్రాంతంలో ఎప్పుడు వేటాడినా మకరయ్య నా వెంట తప్పనిసరి! మకరయ్యకు సీలేరు అడవులు కొట్టిన పిండి. అడవులూ పర్వతాలూ మనకు ఎంతగా పరిచయమున్నా అక్కడ సంచరించేటపుడు ఆ ప్రాంతాలను బాగా తెలిసిన వ్యక్తి తోడుగా వుండడం ఎంతో అవసరం.

"మీ ప్రాంతాలలో మరీ అంతగా ముఖ్యమయిన వేట వున్నప్పుడు తప్పనిసరిగా నా దగ్గరకు రావాలి సుమా!" అన్నానొకసారి. ఆ మాటకూ; ప్రస్తుతం మకరయ్య రాకకూ; నల్లబార్దరు వార్తకూ ఏదన్నా సంబంధం వుందా అనే ఆలోచన కలిగింది నాలో.

పేపరు పక్కన పడేస్తూ "ఏమిటి మకరయ్యా! ఇంత పెందళాడే దూసుకు వచ్చావ్" అన్నాను వుత్సాహంగా. మాలాంటి వేటగాళ్ళకు మకరయ్యను మించిన వార్తా పత్రికలు ఏముంటాయి మరి!

"చిత్తం! రాత్రే వస్తిని దొరా! ఆ ఏలప్పుడిక మిమ్మల్ని కదపడ మెందుకని ఇప్పుడొస్తిని" అన్నాడు మకరయ్య.

"మంచిది! సంగతి చెప్పు!" అన్నా.

"మరేంలేదు దొరా! మా ప్రాంతానికి సరికిసరి రెండు రోజుల ప్రయాణం. కాలిబాటన, దోనెపడవలమీదా పోవాలి. కాకర లోయ అంటారు దాన్ని. మా సీలేరును మించి చిక్కని అడవి ప్రాంతమది అక్కడికి మనుషుల్ని పీక్కుతినే ఓ రాకాసి మనిషి ఏడనుండో వచ్చిండు. ఈ సరికి పది పన్నెండు జీవాల్ని పొట్టన పెట్టుకున్నాడు. వారిలో ఇద్దరు వేటగాళ్ళు సయితం వున్నరు. కాకరలోయ కొండజాతి కుల పెద్ద బాసయ్య దొరకు ఎవరో తమ పేరు చెప్పినారు. బాసయ్య దొర సరికిసరి నాకు కబురంపాడు. ఎట్టనో జేసి ఏదోలా మిమ్మల్ని పట్టుకరమ్మని బాసయ్య దొర మరీమరీ చెప్పేను" అన్నాడు మకరయ్య.

మకరయ్య మాటలు నాకు ఒకోసారి నవ్వు తెప్పిస్తూ వుంటాయి తరచూ పట్టణ ప్రాంతానికి చెందిన నాలాంటి వేటగాళ్ళతో పరిచయం మూలంగా మకరయ్య మాటలు ఇటు కొండజాతికీ అటు నాగరిక ప్రాంతానికీ చెంది

వుంటాయి. మకరయ్య ఒకోసారి ఇంగ్లీషు పదాలు సయితం వాడతాడు.

"మకరయ్యా! ఇంతకూ ఆ నరభక్షకుణ్ణి చూసినవారెవరయినా వున్నారా?" ఆసక్తిగా అడిగాను.

"చూడకేం దొరా! చూశారు. చూసినవాళ్ళు చెప్పారు. వాడిది ఏనుగు బలం. రంగూ! ఆకారం! రెండుకాళ్ళమీద నిలబడ్డ బలిసిన దున్నపోతులా వుంటాడట. అడకు ఆడే మనిషిని నిలవునా పీక్కుతింటాడు" అన్నాడు మకరయ్య.

మకరయ్య మాటలు వింటూ ఓ క్షణం ఆలోచనలో పడ్డాను. "ఎంతయినా నరభక్షకుడూ మనిషే! పోయిపోయి మనిషిని చంపడం ఎంతవరకూ సబబు" అన్నదే నా ధర్మ సందేహం. అదే మాట మకరయ్యతో అంటే "అదేంటి దొరా! అట్టగంటారు. ఎవరికీ కీడుచెయ్యని పులిని చంపడం ఎంత నేరమో: పదిమందినీ పీక్కుతినే మనిషినయినా వదిలిపెట్టడం అంతే నేరం" అన్నాడతడు. అదీ నిజమే అనిపించింది నాకు.

నిట్టూర్పు విడిస్తూ "ఇంతకూ ఆ నరభక్షకుడు అక్కడకెలా వచ్చాడంటావ్" అడిగాను మకరయ్యను.

"కాకరలోయకు మరీ ఎగువన కాకులుదూరని కారడవులంటరే! అట్టగుంటది. ఆ ప్రాంతాన్నిగూడా దాటి ఓ పది మైళ్ళు పోతే అడ్డంగా ఓ ఏరు పారుతుంటది. ఆ ఏరుదాటి ఒక రాత్రీపగలూ నడిస్తే అక్కడ పట్టపగలే చీకటి రాజ్యమేల్తది. ఆడ మనుషుల్ని పీక్కుతినే ఈ జాతి మనుషులుంటరని మా పెద్దలు చెబుతారు. ఈ రాక్షసుడు ఆ జాతి వాడు కావచ్చు. ఎట్టనో కాకరలోయ కొచ్చి పడ్డాడు" చెప్పాడు మకరయ్య.

మకరయ్య చెప్పినది నిజమే కావచ్చు. కాకరలోయకు

పశ్చిమదిశగా వున్న భయంకరమయిన అడవుల్లో నరమాంస భక్షకులయిన మనుషులు వున్నారని తానూ విన్నాడు వీడు ఏ కారణంగానో తనజాతి మనుషుల్ని వీడి ఇటు వచ్చాడు. కరువుతీరా వీడికిక్కడ నరమాంసం దొరుకుతోంది. ఈ పరిస్థితుల్లో చస్తే వెనుతిరిగిపోడు. నరభక్షకుణ్ని చంపడమే దీనికి ఏకైక పరిష్కారం.

పేపరులో వార్త మరీ యింత తొందరగా నాముందుకు రావడం సంతోషమనిపించింది నాకు. నాకై నేను నరభక్షకుడి కోసమని ఆ ప్రాంతానికి వెళ్ళడంకంటె అక్కడి ప్రజల ఆహ్వానం మేరకు వెళ్ళడం మరింత అభిలషణీయం కదా!

2

మకరయ్యా నేనూ అదేరోజున జీపులో సీలేరు బయలేదేరాం. సీలేరులో ఎప్పటిలా పరిచయమున్న ఓ వ్యక్తి యింటిదగ్గర జీపును వదలి కాలినడకన ఇద్దరం అడవిదారి పట్టాం.

బట్టలూ, బుల్లెట్లూ, దారిలో తినేందుకు రొట్టెలూ వుంచిన హంటింగ్ బేగ్ నెత్తిన పెట్టుకొని మకరయ్య ముందు నడవగా; డబల్‌బారల్ గన్ భుజాన వేసుకొని అతణ్ని వెన్నంటి నడుస్తున్నాను నేను.

రాష్ట్రంలో వున్న అడవుల్లో కెల్లా సీలేరు మన్య ప్రాంతం ప్రకృతి సౌందర్యానికి పెట్టింది పేరు. బ్రహ్మాండమయిన వృక్షాలతో నిండిన పర్వతాలు, గలగల పారే సెలయేళ్ళు, చిన్నవయిన నదులు, పచ్చిక మైదానాలు దాటుకుంటూ ముందుకు పోతున్నాం. శీతాకాలం అయినందున ప్రకృతి మరింత రమణీయంగా వుంది. ఎటుచూసినా రకరకాల రంగుల పూలమొక్కలు కనులకు విందుచేస్తు

న్నాయి.

మార్గమధ్యంలో అక్కడక్కడా మజిలీలు వేస్తూ రెండు రోజులు ప్రయాణం సాగించాం.

"అల్లదిగో! ఆ కనిపిస్తున్నదే కాకరలోయ" అన్నాడు మకరయ్య వేలితో చూపిస్తూ.

మేం ఇద్దరం ఎత్తయిన ఓ పర్వతం అంచున నిలబడి వున్నాం. ఎదురుగా కనుచూపు మేరలో వుందొక లోతట్టు ప్రాంతం. సుమారు పది పదిహేను మైళ్ళ విస్తీర్ణంలో వుండే ఆ ప్రాంత మంతటినీ కాకరలోయగా వ్యవహరిస్తారని చెప్పాడు మకరయ్య. ఆ లోయలో యించుమించు ఇరవై గ్రామాలవరకు వుంటాయి. వాటిలో పదీ: ఒకో చోట అంతకు తక్కువ ఇళ్ళుకలిగిన గ్రామాలు కూడా వున్నాయి.

సుమారు ఏభై గుడిసెలవరకూ వున్న "అంకమ్మపిగ" గ్రామం వీటన్నిటికీ ప్రధాన కేంద్రం. బాసయ్యదొర వుండేది అంకమ్మపిగలోనే. మొత్తం కాకరలోయ కొండ జాతి ప్రజలకు బాసయ్యదొర ఒక్కడే నాయకుడు.

మేమిరువురం కొండదిగి కాకరలోయలో ప్రయాణం చేసి అంకమ్మపిగ చేరేసరికి సాయంత్రం ఐదు కావస్తోంది. ఆసరికి గ్రామం మొత్తం నిర్మానుష్యంగా వుండి ఇళ్ళ తలుపులన్నీ వేసివున్నాయి.

"వూరంతా ఇలా వుందేం? వీళ్ళెప్పుడూ ఇంతేనా?" అన్నాను చుట్టూవున్న ఇళ్ళన్నీ పరికిస్తూ.

మకరయ్య తల అడ్డంగా వూపుతూ "లేదు దొరా! ఆ రాకాసి మనిషికి భయపడి వీళ్ళిట్టా అయ్యారు. అంతకు ముసుపు నడిరేయి దాటినా ఆటపాటలతో మహా సందడిగా వుండేది" అన్నాడు.

మకరయ్య తిన్నగా వెళ్ళి అక్కడి యిళ్ళకు కాస్తంత యెడంగా విశాలంగా వున్న యింటిని సమీపించి తలుపు తట్టాడు.

లోపలినుంచి "ఎవరది?" అనే పురుష కంఠం బొంగురుగా వినపడింది.

"నేను దొరా! మకరయ్య" అన్నాడు మకరయ్య గట్టిగా.

ఇంటితలుపు చటుక్కున తెరచుకుంది. ఆజానుబాహుడయిన ముసలి వ్యక్తి పైకి వస్తూనే "రాజును తెస్తివా మకరయ్యా" అన్నాడు ఆత్రంగా. ఆ ఒక్క మాటనుబట్టే వారంతా నాకోసం యెంత ఆత్రంగా యెదురుచూస్తున్నారో అక్కడి పరిస్థితి యెంత తీవ్రంగా వుందో అర్థమయింది నాకు.

మకరయ్య నవ్వుతూ చేయిచాపి నావేపుకు తిరిగాడు నేను రెండడుగులు ముందుకువేసి నవ్వుతూ "దండాలు బాసయ్యదొరా!" అన్నా.

బాసయ్యదొర "దండాలు రాజుబాబూ! తమసంగతి మకరయ్య చెప్పగా వింటిని. మా కష్టం మకరయ్య తమకు చెప్పే వుంటాడు. చూస్తిరిగా మా వూరు. పొద్దయినా పోకమునుపే ఎట్ట సద్దుమణిగిపోయిందో" అన్నాడు విచారంగా.

"దొరా! నీ బెంగ ఇక అట్టేకాలం వుండదులే. ఆ రాక్షసుడి జీవం రాజుబాబు తుపాకీతో ముడిపడింది. బాబు వచ్చాడు. ఆడు చచ్చాడు. అంతే!" అన్నాడు మకరయ్య ధీమాగా నావంక చూస్తూ.

ఆ మాటకు బాసయ్య మొహంలో విచారం కనుమరుగయి నవ్వు వెల్లివిరిసింది. నోటికి ఇరుప్రక్కలా అర

చేతులు రెండూ చేర్చి మొహాన్ని పైకెత్తుతూ "అహో...." అని అరిచాడు పెద్దగా.

క్షణాలమీద చుట్టూవున్న గుడిసెల తలుపులన్నీ తెరచు కున్నాయి. పైకి వచ్చిన ప్రతి వ్యక్తి చేతిలోనూ కత్తులు, ఈటెలు, గొడ్డళ్ళు మొదలయిన ఆయుధాలు వున్నాయి. వారంతా కలసి సుమారు ముప్పైవరకు వున్నారు. ఇంత మంది పురుషులు చేత కత్తులూ కటార్లూ కలిగి వుండీ ఒక్కగానొక్క ఆ నరభక్షకుడికి యింతగా యెందుకు భయపడుతున్నారో అర్థంకాలేదు నాకు.

బాసయ్యదొర మనుషుల మొహాలలో కదిలే భావాలను ఇట్టే కనిపెట్టగల సమర్థుడిలా వున్నాడు.

నవ్వుతూ "రాజుబాబూ! ఆ నరరాక్షసుణ్ణి తేలిక చేయ కండి. బలంలో ఐదారు పెద్దపులులయినా వాడికి సరికావు. బాణాన్ని మించిన వేగం వాడిది. వాడి మాయలు చూస్తే నక్కకు పుట్టిన మనిషేమో అనిపిస్తుంది. మాయమర్మం తెలియని జాతి మాది. ఎదురొస్తే ఏనుగునయినా ఢీ కొడతాం. కానీ ఈ రాక్షసుణ్ణి ఏమీ చేయలేకపోతున్నాం" అన్నాడు.

రాత్రి చాలాసేపటివరకూ బాసయ్యదొరతో నరభక్షకుడి విషయమై మాటాడి మకరయ్యా నేనూ మాకోసమని ప్రత్యే కించబడిన గుడిసెలోకి పోయి పడుకున్నాం.

3

ఉదయం నిద్ర లేచేసరికి బారెడు ప్రొద్దెక్కింది. ప్రయాణ బడలికతో బాగా అలసి వుండిన కారణంగానూ, రాత్రి బాగా ఆలస్యంగా నిద్రకు వుపక్రమించడవల్లను మత్తునిద్ర పట్టేసింది. ఆసరికి అక్కడి జనమంతా యెవరి పనుల్లో వారున్నారు.

కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసేందుకు మక రయ్యను వెంటేసుకుని ఏటికి బయల్దేరాను. మొలలోతున ప్రవహిస్తోంది ఏరు. చల్లగా మంచులా వున్నాయి నీళ్ళు. ఏరు దిగి నే స్నానం చేస్తుంటే ఒడ్డున ఓ బండరాతిమీద కూర్చొని వున్నాడు మకరయ్య. మకరయ్య ప్రతిరోజూ విధిగా స్నానం చెయ్యడు. ఏ నాలుగయిదు రోజులకో ఒక సారి బుద్ధిపుట్టినపుడు అదీ చిటికెలో అయిందనిపిస్తాడు.

స్నానం ముగించి ఒడ్డు చేరుతుండగా కొండజాతి యువకు డొకడు పరుగున రొప్పుతూ వచ్చి "ఆ రాకాసి మనిషి యిప్పుడే ఓ ఆడమనిషి నెత్తుకుపోయాడు. దొర మిమ్మల్ని పిలుస్తున్నాడు" అన్నాడు.

బట్టలయినా తొడుక్కోకుండా బండరాతికి ఆనించి వుంచిన గన్ తీసుకొని ఆ యువకుడితోబాటు పరుగుతీసాను. నా పాంటూ షర్టూ చేతపట్టుకొని మా వెంటే వస్తున్నాడు మకరయ్య.

పది నిముషాల్లో కొండజాతి ప్రజలు ఒక చెట్టుకింద గుమిగూడి వున్న చోటికి మమ్మల్ని చేర్చాడా యువకుడు.

సుమారు ఇరవై ఏళ్ళ యువతి ఏడుస్తూ బాసయ్య దొరకు జరిగిన సంఘటన వివరిస్తున్నది. ఈటెలు కత్తులు ధరించిన పురుషులు కొందరు విచారంగా నిలుచున్నా రక్కడ. నన్ను చూడగానే ప్రక్కకు తొలిగారు వారంతా.

బాసయ్యదొరతో "ప్రస్తుతం మనం చేయగలదేమైనా వుంటే విషయాన్ని సాధ్యమైనంత టూకీగా చెప్పండి" అన్నాను. ఈలోగా మకరయ్య యిచ్చిన నా దుస్తుల్ని వేసేసుకున్నాను.

రెండే నిముషాల్లో సంగతి వివరించాడు బాసయ్యదొర. ప్రస్తుతం విలపిస్తూ బాసయ్యదొరతో మాటాడుతున్న

యువతి నరభక్షకుడు ఎత్తుకుపోయిన మరో యువతి చెల్లెలు. అక్కా-చెల్లెళ్ళిద్దరూ చెట్టుకింద పడివున్న ఎండు పుల్లల్ని ఏరుతున్నారు. చెల్లెలు పుల్లల్ని ఏరుతూ చెట్టు మొదలుకు చేరువలో వుండగా కాస్తంత ఎడంగా కొమ్మల దిగువన వుంది అక్క. నరభక్షకుణ్ణి చూస్తూనే పెద్దగా అరుస్తూ చెట్టెక్కేసింది చెల్లెలు.

అక్క సయితం రానున్న ప్రమాదాన్ని గ్రహించి చెట్టు వేపుగా దూసుకువచ్చింది. చెట్టును ఎక్కే ప్రయత్నంలో వున్న ఆమెను వేగంగా సమీపించాడు నరభక్షకుడు. పైకి పోతున్న ఆమె కాళ్ళు రెండూ అందుకున్నాడు. భయంతో అరుస్తూ చేతికి అందిన కొమ్మను గట్టిగా కావలించి పట్టుకుందా యువతి.

నరభక్షకుడు మాత్రం పట్టు విడవకుండా ఆమెను బలంగా కిందకు గుంజి ఆ వూపున తల చిట్లేలా ఆమెను చెట్టుకేసి బాదాడు. తలనుండి రక్తం వరదలా ప్రవహిస్తుండగా నరభక్షకుడు ఆ యువతి శరీరాన్ని భుజాన వేసుకొని తిరిగి వచ్చినదారినే వెనక్కిపోయాడు. గజగజలాడుతూ జరిగినదంతా చెట్టుపైనుండి చూస్తూనే నిస్సహాయురాలుగా వుండిపోయింది చెల్లెలు.

చెట్టుమొదట నేలమీద రక్తం విపరీతంగా వుంది. కొమ్మను ఆమె భయంతో ఒడిసిపట్టినపుడు నరభక్షకుడు కాళ్ళు బలంగా గుంజగా శరీరం ఒరిసి రక్తమాంసాలు చెట్టుకొమ్మకు అంటుకుపోయాయి. దానినిబట్టి ఆ యువతి ఆ క్షణంలో ప్రాణభయంతో ఎంతగా తల్లడిల్లిందీ అర్థమవుతోంది!

కొండజాతి పురుషులు చెట్టుమీద నుండి చెల్లెలికేకలు విని ఆయుధాలతో సహా పరుగున వచ్చారు. కానీ ఆ సరికే

నరభక్షకుడు అక్క శరీరంతోబాటు అక్కడి నుండి వెళ్ళి పోయాడు. అయినా తలనుండి కారి నేలమీద ఏర్పడిన రక్తంచారలు ఆధారంగా సెలయేరు వరకూ వెళ్ళగలిగారు. ఆ తర్వాత రక్తం మరకలు అదృశ్యమయ్యాయి. చేసేది లేక తిరిగి వచ్చారందరూ!

తుపాకీ చేతబట్టి అదే రక్తపుజాడ ఆధారంగా నేనూ బయల్దేరాను. కొండజాతి యువకులు కొందరు నా వెంట వచ్చేందుకు సిద్ధపడగా వద్దని వారించాను. యుద్ధానికి బయ ల్దేరినట్టు యింత జనమూ వెంటబడితే; మందిలోపడ్డ పాము మరి చావదన్న సామెతను పోలివుంటుంది పరిస్థితి.

మకరయ్య ఒక్కడే నావెంట బయల్దేరాడు. చెట్టుదగ్గర గీతలా ప్రారంభమయిన రక్తపుజాడ మధ్యలో బొట్లుగా మారి సెలయేటి గట్టుదగ్గర కొచ్చేసరికి పూర్తిగా అదృశ్య మయింది. సెలయేరు యిక్కడ మొకాలు లోతుండి యించుమించు ముప్పై అడుగుల వెడల్పున ప్రవహి స్తోంది.

నరభక్షకుడు రక్తపుబొట్లు అంతమయిన చోట సెల యేరులో దిగాడని తెలుస్తూనే వుంది. మకరయ్యను అక్కడే వుండమని నీటిలో దిగి ఆవలి ఒడ్డు చేరాను. ఇంచుమించు ఆ ప్రాంతమంతటా ఎక్కడా రక్తం జాడ లేదు. ఎవరయినా నీటిలో నడచి గట్టెక్కినపుడు ఏదో ఒక చోట నేల తడిగా వుండాలి! కానీ ఇసుకనేల యెక్కడా చెమ్మయినా లేక పొడిపొడిగా వుంది. ఈ లెక్కన నీటిలో దిగిన నరభక్షకుడు ఆవలికి చేరనేలేదని అర్థమవుతోంది. మరి ఏమయినట్టు? మొకాలులోతు నీటిలో ఏ మనిషయినా మునిగిపోయే అవకాశం లేదుకదా!

ఏటిలో దిగిన మనిషి మునగకా! గట్టూ ఎక్కకా!

ఎక్కడికి వెళ్ళినట్టు.

అంటే: నరభక్షకుడు రక్తం ఆధారంగా తన నెవరైనా అనుసరించే అవకాశం వుందని గ్రహించి సెలయేటి నీటిలో నడచిపోయాడన్న మాట. నరభక్షకుడు సయితం మనలా మెదడున్న మనిషి. మనం ఆ దృష్టితో ఆలోచించి వ్యవహరించాలే తప్ప ఏదో మామూలు జంతువును వేటాడినట్టు ముందుకుపోతే యెదురుదెబ్బ తప్పదు.

అయితే యిప్పుడు నరభక్షకుడు సెలయేటిలో యే దిక్కున వెళ్ళినట్టు! ఎగువకా? దిగువకా?

భుజాన బరువుతో సాధ్యమయినంత వరకూ ఎవరూ ఎగువకు పోయే ప్రయత్నం చెయ్యరు. అదే దృష్టితో నేనూ సెలయేరు పారే దిక్కుగా బయల్దేరాను. మకరయ్య నన్ననుసరిస్తూ ఒడ్డున నడుస్తున్నాడు.

నరభక్షకుడు ఒడ్డు ఎక్కే అవకాశాలను ఒకవంక పరీక్షిస్తూనే వేగంగా అడుగులు వేస్తున్నాను. నీటి మధ్యలో ఒకచోట అడ్డంగా పెద్దపెద్ద బండరాళ్ళున్నాయి. సెలయేటి వెడల్పు అక్కడ బాగా తగ్గి నీరు కేవలం బండరాళ్ళ మధ్యగా ప్రవహిస్తోంది. రాళ్ళమధ్య యించు మించు రెండడుగుల ఖాళీ మాత్రమే వుంది. బండరాళ్ళ కారణంగా ఏర్పడిన యిబ్బందికి చిరాకుపడుతూ చప్పుడుతో వేగంగా ప్రవహిస్తోంది నీరు.

రాళ్ళ మధ్యగా వెళుతూ చటుక్కున ఆగాను. సూదిగా వున్న రాతికొనకు తెగిన పూసలదండ ఒకటి వేలాడుతూ అగుపించింది. ఇక కొద్దిసేపట్లో ప్రవాహవేగంలో కొట్టుకుపోయేలా నీటిని తాకుతూ వూగుతోందది. అదేచోట బండ రాతికి కొద్దిగా రక్తమాంసాలు అంటివున్నాయి.

నరభక్షకుడు ఆ యువతి శరీరాన్ని బండరాతిమీద ఉంచి

విశ్రాంతికోసం ఆగాడా యిక్కడ? అటువంటప్పుడు రక్త మాంసాలు యిలా అంటే అవకాశం లేదు. పూసలదండ సయితం తెగదు!

అంతలోనే జరిగిందేమిటో గ్రహించి నవ్వుకున్నాను. నీటి ప్రవాహాన్ని తనకనుకూలంగా వినియోగించుకున్నాడు నరభక్షకుడు. యువతి శరీరాన్ని నీటిలో దించి కాళ్ళు రెండూ బహుశా దేనితోనో కట్టి సులభంగా ఈడ్చుకు పోయివుంటాడు. అలా ఈ బండరాళ్ళ మధ్యగా ఆమె శరీరాన్ని ఈడ్చుకుపోయినప్పుడు ఈ గుర్తులన్నీ ఏర్పడేవీలుంది! సందేహంలేదు. నరభక్షకుడు యీ మార్గంలోనే వెళ్లాడు. వేగంగా ముందుకు కదిలాను.

అలా వెళుతుండగా ఒకచోట గట్టు కాస్త తడిగా వుందనిపించి చూసాను. నీటిలో నుండి గట్టుపైకెక్కినట్టుగా ఆతడి కాలి గుర్తులు సయితం పెద్దగా బలంగా పడివున్నాయి. అంత పెద్దపాదాలు మామూలు మనుషుల్లో వుండే అవకాశంలేదు గనకనే విన్నదానిని బట్టి అవి నరభక్షకుడి పాదాల గుర్తులే అని నా వూహ. రక్తం జాడల కోసమని ప్రయత్నించాను. ఎక్కడా అగుపడలేదు. సెలయేటి నీటిలో ఆ యువతి శరీరం బాగా నానివుండిన కారణంగా రక్తం అంతగా స్రవించే అవకాశం వుండదు.

చుట్టుప్రక్కల చెట్టుపుట్టల్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ముందు నేనూ ఆ వెనక మకరయ్యా నడుస్తున్నాం.

ఓ ఐదారు నిమిషాలు అలా నడిచామో లేదో ఎదురుగా ఓ యాభై అరవై అడుగుల దూరంలో కంటబడిన దృశ్యాన్ని చూసి ఠక్కున ఆగాను. మకరయ్యను సయితం ఆగమన్నట్టు చేతితో సంజ్ఞ చేసాను.

తుపాకీ పొజిషన్‌లో పట్టుకొని చప్పుడు చేయక ముందుకు కదిలి బండరాతిని సమీపించాను. బండకు ఆవల తెల్లగా కనిపిస్తున్నాయి కాళ్ళు. ఎండలో మెరుస్తున్నాయి. ముడుకుల దిగువనుండి కాలి పిక్కలూ పాదాలూ స్పష్టంగా దర్శన మివ్వగా మిగిలిన శరీరమంతటికీ బండరాయి అడ్డ మయింది.

బండరాతిని ఆనుకొని ఎండుపుల్లల మీదా ఆకులమీదా కాలు మోపకుండా వూపిరి బిగబట్టి ముందుకు కదిలాను. నేలమీద పడివున్న కాళ్ళు రెండూ వూగుతున్నాయి నెమ్మ దిగా. కొద్దిగా చప్పుడు వినపడుతోంది. మాంసాన్ని దుమ్ము లతో పాటు కొరుక్కుతినే చప్పుడది. మకరయ్య చెప్పినట్లు శవాన్ని అలాగే పీక్కు తింటున్నాడన్నమాట. ఈ దెబ్బతో కాకరిలోయ వాసులకు నరభక్షకుడి పీడ విరగడ కావాలి. నా గుండె చప్పుడు స్పష్టంగా నాకే వినపడుతోంది!

తుపాకీ స్థిరంగా పట్టుకొని ఒక్క వుదుటున అటు గెంతాను. కంటికి కనపడిన దృశ్యాన్ని గాంచి విస్తు పోయాను.

ఆ క్షణం వరకూ శవాన్ని పీక్కుతింటున్న మూడు తోడేళ్ళు నన్ను చూస్తూనే భీకరంగా అరుస్తూ మీదకు రాసాగాయి. గత్యంతరంలేని పరిస్థితుల్లో రెండుమార్లు గర్జించింది నా డబుల్ బారల్ గన్! రెండు తోడేళ్ళు అక్కడి కక్కడే కూలిపోగా మూడవది హడలిపోతూ తోక ముడిచింది.

చప్పుడు విని నరభక్షకుడు చచ్చాడనే ఆనందంతో చప్పట్లు చరుస్తూ పరుగున వచ్చిన మకరయ్య ఆ దృశ్యాన్ని చూసి తెల్లమొహం వేసాడు.

యువతి శవాన్ని దగ్గరగా చూసి మొహం తిప్పుకో

కుండా వుండలేకపోయాను. చుట్టూ మడుగులా వుంది రక్తం. తల చితక్కొట్టబడి మెదడు, కనుగ్రుడ్లు తొలగించబడ్డాయి. ఛాతీభాగంలో పెద్దరంధ్రం. గుండె మొదలయిన లోపలి భాగాలన్నీ తొలగించబడి డొల్లలా వుంది. శరీరంలో మెత్తని మాంసప్రదేశాలయిన పిరుదులు, తొడ మొదలయినవి పూర్తిగా కోసి వేయబడ్డాయి.

ఆమె శరీరంమీద వుండవలసిన చీర ఆ ప్రాంతంలో ఎక్కడా లేని కారణంగా; పెకలించిన స్త్రీ శరీర భాగాలను నరభక్షకుడు అందులో మూటగట్టుకుపోయాడని భావించాను.

4

ఆ పూపున మకరయ్య వెంటరాగా పశ్చిమాద్రిన సూర్యుడు విశ్రమించేంతవరకూ తిండీ తిప్పల మాటయినా లేకుండా అరణ్యమంతా వెతికాను. నరభక్షకుడి జాడలేదు.

మరుసటిరోజు సయితం అదే పరిస్థితి. నిజానికి నరభక్షకుడికి ఓ రెండురోజుల వరకూ తన స్థావరం వీడి బయట పడే అవసరం వుండదని నా నమ్మకం. నిన్న తను సంపాదించిన ఆహారం యెంత లేదన్నా రెండురోజుల గ్రాసం వాడికి. ఈలోగా వాడికోసమని అడవిలో తిరగడం వృధా ప్రయాసే.

అదలావుంచి నరభక్షకుడికోసమని అడవంతా తిరిగేకన్నా యెక్కడో స్థిరంగా వుండే వాడి స్థావరం కనుక్కోవడమే వుత్తమమనిపిస్తోంది నాకు. ఇన్ని రోజులుగా యీ ప్రాంతంలో తిరుగుతున్నాడంటే తప్పకుండా ఏదో నివాసం వుండితీరుతుంది వాడికి. ఆ ఆలోచన వచ్చినదే తడవు బాసయ్య దొరను కలిసి అడవిలో వుండే పర్వత గుహల్లాంటివి బాగా ఎరిగున్న వ్యక్తి కావాలన్నాను.

బాసయ్యదొర ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నలు వేయక కొండయ్య అన్నే ముప్ఫయ్యేళ్ళ బలమయిన యువకుణ్ణి పిలిచి "అడవిలో నక్కకు సయితం తెలియని తావులన్నీ వీడికి తెలుసు" అన్నాడు.

మకరయ్యను ఆ రోజుకు విశ్రాంతి తీసుకోమని కొండయ్య వెంట అరణ్యంలో ప్రవేశించాను.

అడవిలో కొండయ్య వెంట వెంటనే నాలుగయిదు పర్వత గుహల్ని చూపించాడు. అవి ఎవరయినా యిట్టే వెళ్ళిరాగలిగేవి. నరభక్షకుడి విషయంలో నాకు ఇప్పటికే ఒక అవగాహన ఏర్పడిన కారణంగా వాడు యింత సుల భంగా పట్టుపడే గుహల్లో వుండే అవకాశం లేదని నాకు తెలుసు. కొండయ్యతో అదే మాట చెప్పాను.

కొండయ్య నా మాటలు బాగా అర్థం చేసుకోగలిగాడు. దట్టంగా వుండే అరణ్య మధ్య ప్రాంతాలకు నన్ను వెంట బెట్టుకుపోయాడు. అక్కడ రెండు మూడు గుహలు వెదికాం. మొదటి గుహలకన్నా ఇవి కాస్తంత రహస్యం గానే వున్నా వీటిలో ఎవరూ నివసిస్తున్న జాడలేమీలేవు. నిజానికి వీటిలో కూడా ఆ నరభక్షకుడు వుండడన్నదే నా గట్టి నమ్మకం.

"ఇంతకుమించిన రహస్య స్థావరమేదీ లేదా చుట్టు ప్రక్కల్లో! అంటే మనుషులూ లేక మరే ప్రాణులయినా అంత సులభంగా ఆ ప్రాంతాన్ని చేరలేనిదీ చేరేందుకు భయపడేదీ! అలాంటిదన్న మాట!" అన్నాను.

కొండయ్య మొహం చిట్లిస్తూ బుర్ర తడుముకున్నాడు "సూదికొండ శిఖరంమీద ఆకాశ గుహ అని ఒకటుంది. అందులో వచ్చిన మనుషుల ఆత్మలుంటాయని చెప్పు కుంటారు. మా జాతి మనుషులు నిలువెత్తు బంగారమిచ్చినా

అటుపోరు. ఆ గుహను ఒకంతట చేరడమే కష్టం" అన్నాడు కొండయ్య.

ఆ మాట వింటూనే నా మొహం వికసించింది. నిజానికి నే వెతుకుతున్న గుహ సయితం అలాంటిదే "మనక్కావలసిందదే!" అన్నాన్నేను వుత్సాహంగా. కొండయ్య అయిష్టంగానే కదిలాడు.

సూదికొండను చేరడమే శ్రమతో కూడిన పనయ్యింది. ఆకాశాన్ని తాకేట్టున్న పర్వత శిఖరాన్ని వేలితో చూపుతూ "అక్కడే ఆకాశగుహ వుండేది" అన్నాడు కొండయ్య.

తలెత్తి చూసాను. బ్రహ్మాండమయిన ఏకశిలా దుర్గంలా వుంది సూదికొండ. నిట్టనిలువుగా వుండే ఆ బండరాళ్ళను ఎక్కి ఆకాశగుహను చేరడం చాలా కష్టమని బోధపడుతూనే వుంది.

"గుహ ముఖద్వారం ఏ దిక్కుగా వుంటుంది?" అడిగాను కొండయ్యను.

"మనం యిప్పుడు నిలిచింది గుహకు ఎదురుగానే" అన్నాడు కొండయ్య.

"అయితే మనం అవతలికి వెళ్ళి గుహను వెనక నుండి చేరే ప్రయత్నం చెయ్యాలి" అన్నాను.

"అలాగే! వెళ్ళి రండి" అన్నాడు కొండయ్య.

"నువ్వు రావా?" ఆశ్చర్యపోతూ ప్రశ్నించానతణ్ణి.

మౌనంగా తల వంచుకున్నాడు కొండయ్య. కొండయ్య భయపడుతున్నాడని గ్రహించాను.

నవ్వుతూ "మంచిది. నువ్విక్కడే వుండు. నేవచ్చేంత వరకూ ఏదయినా ఎత్తయిన రాతిమీదనో చెట్టుమీదనో కూర్చో" అన్నాను బయల్దేరేందుకు సిద్ధపడుతూ.

కొండయ్య తలవూపుతూ నడుమున వేలాడే పరుశువును

తీసి నాకిస్తూ "దొరా! ఇది మా తాతల కాలం నుండీ మా వెంట వస్తున్నది. దీనిని చేతపట్టినవాడికి ఎదురుండదు. పట్టుకెళ్ళండి దీన్ని" అన్నాడు

నేను నవ్వుతూ కొండయ్య చేతిలో వున్న పరుశువు వంక చూశాను. ఎండలో తళతళ మెరుస్తోంది దాని అంచు. బలిసిన దున్న మెడను ఒక్కవేటున తెగనరికే సామర్థ్యం దానికుంది.

"కొండయ్యా! నీ తాతలు నీకు దీనిని యిచ్చినట్టే మా తాతలూ యీ తుపాకిని నాకిచ్చారు" అని వెనక్కి తిరిగాను.

5

సూదికొండ శిఖరం చేరేందుకు ఎవరెస్టును అధిరోహించినంత పనయ్యింది. ఒళ్ళంతా వేడెక్కి చెమట ధారగా ప్రవహించసాగింది. నిస్సత్తువ ఆవహించింది. గుండె దడ తగ్గేంతవరకూ తుపాకిని ప్రక్కన పెట్టి ఒక బండరాతికి ఆనుకున్నాను.

కొండలు ఎక్కడం నాకు కొత్తకాదు. కానీ ఇటువంటి కొండను నే నెక్కడా చూసి వుండలేదు. ఒకవేళ యిదే కొండమీద గనక నరభక్షకుడు నివసిస్తూ వుంటే వాడి శక్తిసామర్థ్యాలు తక్కువగా అంచనా వేసే వీలులేదు.

నెమ్మదిగా లేచి తుపాకీ సిద్ధంచేసి బయల్దేరాను. శిఖరం కొద్దిమేర సమతలంగా వున్నచోట బండరాళ్ళ మధ్య ఎత్తయిన గుడిలా విచిత్రంగా వుందొక గుహ. ప్రవేశ ద్వారం మాత్రం ఇంచుమించు నాలుగయిదడుగుల చతురంలో వుంది. ద్వారం ప్రక్కనే దానికి అడ్డంగా తలుపు మాదిరి వుందొక బండరాయి. తుపాకీని పొజిషన్‌లో ఉంచి నెమ్మదిగా ద్వారాన్ని సమీపించాను.

ద్వారానికి అడ్డం వున్నరాయి కొద్దిగా తెరిచివున్న తలుపులా వుంది సామాన్యులు పదిమంది సయితం ఒక అంగుళమయినా కదపలేని రాయది. తెరచివున్న ఖాళీ ద్వారా నెమ్మదిగా కదిలి గుహ ముఖద్వారం దగ్గర నిలుచున్నాను.

గుహలోపల చీకటిగా వుంది. కొద్దిసేపు అక్కడే నిలిచి తదేకంగా చీకటిలో దృష్టి సారించాను. ఎటువంటి పరిస్థితి ఎదురయినా నిలదొక్కుకోగల నమ్మకంతో వున్నాను. గుహ లోపలిభాగం యిప్పుడు బాగానే కనపడుతోంది. లోపల ఎవరూ వున్నట్టులేదు. ద్వారం కొంచెం చిన్నదే అయినా గుహలోపల విశాలంగానే వుంది. ఒక్కొక్క అడుగే లోనికి వేసాను.

ముక్కుపుటాలు అదిరిపడే దుర్వాసన! మాంసం కుళ్ళిన వాసనది!

బండరాళ్ళ మధ్య అక్కడక్కడా ఎండి కుళ్ళిన మాంసం ముద్దలు చెల్లాచెదురుగా పడివున్నాయి. మనుషుల ఎముకలు చిన్న చిన్న కుప్పలుగా వున్నాయి. సందేహం లేదు! ఇది నరభక్షకుడి నివాసం

నరభక్షకుడిప్పుడు ఆహారం కోసం వెళ్ళివుంటాడు. ఇక్కడే వేచివుండి వాడు గుహలో అడుగు పెట్టీపెట్ట గానే....నా ఆలోచన పూర్తికాక ముందే గరగర శబ్దంతో గుహ మొత్తం చీకటి ఆవరించింది.

త్రుళ్ళిపడుతూ వెనక్కి తిరిగాను. ద్వారం మూసుకు పోయివుంది. పరుగున వెళ్ళి ద్వారానికి అడ్డంగా వుంచబడిన బండరాతిని చేతులతో వెనక్కి నెట్టాను. కాళ్ళతో తన్నాను. ఏదో పిచ్చి ఆవేశం తప్ప బండరాయి విశ్చలంగా వుంది.

కొండరాళ్ళు ప్రతిధ్వనించేలా బయట పకపకలాడుతూ వినపడిందో స్వరం. అది నరభక్షకుడి గొంతయి వుంటుంది. రెండు నిమిషాలపాటు నాకర్థంకాని భాషలో పెద్దగా ఏమేమో వాగాడు వాడు. బహుశా అవన్నీ నన్నుద్దేశించిన తిట్లు కావచ్చు. తిరిగి నిశ్శబ్దం. అరగంట గడిచినా ఏ అలికిడీ లేదు.

నన్ను గుహలో బంధించి వాడు మరో తావు వెతుక్కుంటూ పోయివుంటాడు. నన్ను తొలినుండీ గమనిస్తూ తెలివిగా ఇందులో యిరికించిపోయాడన్నమాట.

అంతలో నాచేతిలో వున్నది తుపాకీ అనే విషయం గుర్తుకొచ్చింది! బండరాతి ద్వారాన్ని ఆశగా రెండుమార్లు తుపాకీతో కాల్చాను. ఉహూఁ! కదలికే లేదందులో. తూటాలు తగిలిన చోట అరంగుళం లోతున రంధ్రాలు మాత్రం పడ్డాయంతే!

ఉసూరుమంటూ నేలమీద చతికిలబడిపోయాను. లాభం లేదు! నాపని యిక యింతటితో అయిపోయినట్టే. ఇంత బతికూ బతికి అన్నపానీయాలు కరువై, చివరకు యీ గుహలో దిక్కుమాలిన చావు నా నుదుట రాపివుంది.

అయినా ఆశ చావక లేచి గుహచుట్టూ పదికి మించి ప్రదక్షిణలు చేసాను. చీమ దూరే సందయినా లేదెక్కడా! వున్నట్టుండి నా బుర్రలో తళుక్కుమందొక ఆలోచన!

కాలిబూటుకున్న అరలోనుండి సన్నని చాకు బయటకు లాగాను. ద్వారానికి అడ్డంవున్న బండరాతిని సమీపించి దాని ముందు చతికిలబడ్డాను. చాకు పిడిని రెండు అరచేతుల మధ్యవుంచి తుపాకీ పేల్చగా ఏర్పడన రంధ్రంలో చాకు మొన గుచ్చి తరిణిపట్టసాగాను. కుడి ఎడమలకు చకచక తిరుగుతోంది చాకు.

అరగంట గడిచింది. చాకు క్రమేపీ ముందుకు సాగుతోంది. గంట! రెండు గంటలు! కాలం దొర్లిపోతోంది. పాంటూ షర్టూ తడిసి ముద్దయ్యాయి చెమటతో. విప్పి ప్రక్కన పడేసాను. అరచేతులు వేడెక్కి బొబ్బలు కాసాయి. అవికూడా చితికి చేతులు రక్తం స్రవిస్తున్నాయి. మంట! బాధ! కళ్ళమ్మట నీళ్ళు తిరుగుతున్నాయి. అయినా పట్టువీడలేదు. పళ్ళుబిగువున పని చేస్తున్నాను.

సుమారు మూడు నాలుగు గంటల మధ్యకాలంలో నా శ్రమ ఫలితంగా బండరాయి ఐదంగుళాల మేరకు రంధ్రం పడింది రక్తసిక్త హస్తాలతో పాంటు జేబుల్లో వున్న తుపాకీ తూటాలు తీసాను. చాకుతో వాటి సీలును వూడబెరికి బండరాతి కన్నంలో జాగ్రత్తగా ఆ మందును కూరాను. కన్నం నిండిపోగా ఒకే ఒక తూటా మిగిలింది. వణికే చేతులతో ఆ తూటాను గన్‌లో లోడ్ చేసాను.

గుహ వెనక గోడను చేరి దానికి ఆని నిలుచున్నాను. నా కళ్ళు అప్పటికి చీకటికి బాగా అలవాటుపడ్డాయి. బండరాతిలో తుపాకీ మందుకూరిన ప్రదేశం నా దృష్టికి స్పష్టంగా గోచరిస్తున్నది. మనసారా దేవుణ్ణి ప్రార్థించి తుపాకీ గురిచూపి ట్రిగ్గర్ నొక్కాను. అంతే!

కళ్ళముందు ఒకే ఒక పెద్ద మెరుపు మెరిసి చెవులు చిల్లులుపడేలా బ్రహ్మాండమయిన శబ్దం వినపడింది. ఒక క్షణం కళ్ళూ చెవులూ మూసుకున్నాను.

తిరిగి కళ్ళుతెరిచేసరికి బండరాయి పేరుకయినా లేదక్కడ. ఇంతలో నాకెందుకో అనుమానం కలిగి గుహ వెలుపలికి వాయువేగంతో పరుగుతీశాను. లోపలినుండి యిలా బయట అడుగుపెట్టానో లేదో ఫెళ ఫెళ లాడుతూ గుహ మొత్తం కూలిపోయింది.

దేవుడికి మనసారా అంజలిఘటిస్తూ ఇక అక్కడ ఏ మాత్రం జాగుచేయక కొండ దిగాను. అయితే ఆసరికే నే భయపడినంత పనీ జరిగిపోయింది.

కొండయ్యా నేలమీద విగతజీవుడై పడివున్నాడు. శవం మీద ఈగలు ఝుమ్మంటున్నాయి. తల చితక్కొట్టబడి మెదడూ కనుగ్రుడ్లూ అదృశ్యమయ్యాయి. ఛాతిలో పెద్ద రంధ్రం.

కొండయ్య ప్రక్కనే పడివుంది అతని తిరుగులేని పరుశువు!

ఏ చావుకు భయపడి కొండయ్యా నావెంట రావడం మానుకున్నాడో! అదే చావు అతణ్ణి వెదుక్కుంటూవచ్చింది. బాధగా నిట్టూర్చాడు. ఆసరికి అరణ్యాన్ని తన కౌగిలిమధ్య ఇముడ్చుకోవాలని ఆరాటపడుతూ ముంచుకువస్తున్నది చీకటి కాంత!

6

బొబ్బిలెక్క గాయపడిన నా అరచేతుల్ని ఏదో ఆకు పసురు వైద్యం ద్వారా రెండే రోజుల్లో నయం చేసాడు మకరయ్య. మకరయ్యా నేనూ తిరిగి అడవిమీద పడ్డాం. అడవిలో ఎత్తయిన పర్వత సముదాయాలున్న ప్రాంతంలో కాయకసరులు ఏరే కొండజాతి మనుషులు కేకలువేస్తూ మాకు ఎదురుగా రావడం అగుపించింది.

మకరయ్య ఏమయిందంటూ వారిని కొండభాషలో ప్రశ్నించాడు. పెద్దగా మాట్లాడలేకపోయినా నాకూ ఆ భాష ఇంచుమించుగా బాగానే తెలుసు. కొండజాతి యువకు డొకడు "మాతోబాటు కాయలేరుతున్న ఒక యువతిని రాకాసిమనిసి ఎత్తుకుపోతున్నాడు. మీరు తొందరగా పోతే దొరుకుతాడు" అన్నాడు.

నేను ఆ యువకుణ్ణి మరేమీ ప్రశ్నలు అడక్కుండా అతడు వేలితో చూపిస్తున్న దిక్కుగా బాణంలా దూసుకు పోయాను. కొద్దిసమయానికే చెట్లు మధ్యగా ఒక స్త్రీని మోసుకుపోతూ కనిపించాడు నరభక్షకుడు. యావత్శక్తినీ కూడదీసుకొని మరింత వేగంగా పరుగుతీశాను.

తననెవరూ అనుసరించడంలేదనే ధీమాతో కాస్తంత నిర్లక్ష్యంగా అడుగులు వేస్తున్న నరభక్షకుడు; చెట్ల ఆకుల మీద పడుతూ పెద్దగా వినవస్తున్న నా అడుగుల చప్పుడుకు హఠాత్తుగా తలతిప్పి చూసాడు. నరభక్షకుడు వెంటనే పరుగందుకున్నాడు.

భుజాన ఒక మానవ శరీరాన్ని మోస్తూనే నరభక్షకుడు మా యిద్దరి మధ్యగల దూరాన్ని క్రమేపీ పెంచుకుపోతు న్నాడు. ఈ పరిస్థితిలో వాడు ఇక కొద్ది క్షణాల్లో నా దృష్టి నుండి తప్పుకుపోవడం ఖాయం. అది జరక్కూడదనే ఆరాటంతో పట్టుదలగా పరుగెడుతున్నాను. నిజానికి నర భక్షకుడు తుపాకీదెబ్బకు అందేంత దూరంలోనే వున్నాడు. అయితే చెట్లు అడ్డంకి. మరోదిక్కు వాడి భుజాన వున్న స్త్రీ. ఆమె వీపూ తలా ఇంచుమించుగా నరభక్షకుడ్ని కవర్ చేస్తున్నాయి. ఆమె ఒకవేళ ఏమాత్రం ప్రాణాలతో వున్నా లేనిపోని రిస్కు తీసుకున్నట్టవుతుంది.

నరభక్షకుడు పర్వతానికి చేరువగా నున్న చిన్న గుట్టను ఎక్కుతున్నాడు. అదే సమయంలో తుపాకీ పేల్చాను. నిజానికి ఆ బులెట్ వాణ్ని గురిచూపి పేల్చిందికాదు. ఏదోలా భయపెడితే భుజానవున్న ఆ యువతి శరీరాన్ని వదలిపోతా డేమోననే ఆశతో మాత్రమే!

తుపాకీ చప్పుడుకు నే వూహించినట్టుగా నరభక్షకుడు కాస్తంత తొట్రుపడినా భుజాన మోస్తున్న యువతిని

మాత్రం దించకుండానే గుట్ట దిగి పల్లంలోకి పోయాడు. నేను వేగంగా గుట్టను అధిరోహించాను. గుట్టదిగాక మార్గం పర్వతముఖాన్ని తాకుతూ రెండుగా చీలివుంది. ఒక బాటలో ఇంచుమించు చీలికకు యాభై అరవై అడుగుల దూరంలో బండరాతిమీద పడివుంది ఆ యువతి శరీరం.

ఆత్రంగా బండను సమీపిస్తూ యువతి చేయిపట్టుకు చూసాను. ఎప్పుడో పోయింది ప్రాణం. ఆమెను ఇక ఏ విధంగానూ కాపాడే అవకాశంలేదు. చచ్చిన మనిషికోస మని నరభక్షకుణ్ణి వదలిపెట్టడం అవివేకం.

నరభక్షకుణ్ణి వెదుకుతూ నేను అదే బాటలో ముందుకు పరుగెత్తాను. పదినిముషాలు ఆపసోపాలు పడుతూ బండ రాళ్ళ మధ్య పరుగులెత్తినా నరభక్షకుడు అయిపులేదు. ఇంతలోగా ముందుమార్గం హఠాత్తుగా అంతమయింది. చుట్టూ కోటగోడల్లా వున్నాయి పర్వతాలు. వాటిని ఎక్కడం నరభక్షకుడివల్లకూడా జరిగేపని కాదు.

నేను పప్పులో కాలేసానని గ్రహించాను. నరభక్షకుడు నన్ను కావాలని తప్పుతోవ పట్టించాడు. వెంటనే ఆఘ మేఘాలమీద వెనక్కి పరుగుతీసాను.

ఖాళీ బండరాయి నన్ను వెక్కిరిస్తూ అగుపడింది!

నరభక్షకుడు నా పీడ వదిలించుకునే వుపాయంతో మొదట ఈ మార్గం పట్టి యువతి శరీరాన్ని బండరాతిమీద దించాడు. తాను దాపులనే ఎక్కడో నక్కి వున్నాడు. వెర్రిగా నేను ముందుకు పోవడంతో వాడు శవాన్ని తిరిగి భుజాన వేసుకొని రెండోతోవ పట్టి పోయాడు.

వేటలో కాకలుతీరిన నన్ను ఒక అనాగరిక నరభక్షకుడు ఎంత సులువుగా బోల్తా కొట్టించాడో గ్రహించి సిగ్గుతో తల దించుకున్నాను.

7

మరో నాలుగయిదు రోజులు గడిచాయి.

నేనూ మకరయ్యా క్రమం తప్పకుండా అడవిని చుట్టి వస్తున్నాం. ఈలోగా మరో యిద్దరు కొండజాతి యువతులు నరభక్షకుడికి ఆహారమయ్యారని వార్తలందాయి.

కొండప్రజలు మునుపటిలా మమ్మల్ని గౌరవ భావంతో చూడడంలేదు. వారికి నేనిక నరభక్షకుణ్ణి చంపలేననే నమ్మకం ఏర్పడిపోయింది. బాసయ్య దొర మాదగ్గరకు దాదాపుగా రావడమేలేదు. ఎక్కడయినా ఎదురుపడితే తప్పదన్నట్టు ముభావంగా పలకరించి పోతున్నాడు.

అందుకు వారిని నిందించీ ప్రయోజనంలేదు. మకరయ్యే నాగురించి వాళ్ళకు చాలా గొప్పగా చెప్పాడు. రాజుబాబు అడుగుపెడితే చాలు రాకాసిమనిషి ఆయువు చెల్లు అనే అభిప్రాయం మకరయ్య మాటలవల్ల స్థిరపడింది వాళ్ళలో. మేం లోయలో అడుగుపెట్టి పదిహేనురోజులు దాటిపోయాయి. నరభక్షకుణ్ణి చంపడం మాట అటుంచి చావు తప్పి కన్ను లొట్టబోయిం దన్నట్టు ప్రతిసారీ తిరిగి వస్తున్నాం.

అంతెందుకు! నరభక్షకుణ్ణి అసలు చంపగలనా అనే అనుమానం రోజురోజుకీ నాలోనే పెరిగిపోతోంది! ఎవరి అభిప్రాయం ఏదయినా నరభక్షకుడు నా చేతుల్లోనే చస్తాడన్నది మకరయ్య గట్టి నమ్మకం!

మకరయ్యా నేనూ అదేపనిగా అడవంతా గాలిస్తున్నాం. రాత్రీ పగలూ అనక అడవిలోనే కాయకసరులు తింటూ కాలం గడుపుతున్నాం. నరభక్షకుడి అంతు చూడనిదే లోయలో అడుగు పెట్టకూడ దన్నదే మా నిర్ణయం. ఒకరి మనసులో మాట మరొకరికి చెప్పకపోయినా మా యిద్దరి

లక్ష్యం అదే!

సూర్యుడు ధగధగలాడుతూ నిప్పులు చెరుగుతున్నాడు. ఇద్దరం తిరిగి తిరిగి బాగా అలసిపోయాం. నడిచేందుకయినా ఓపికలేదిక. దాహంతో నాలుక పొడారి వుంది. మరోవంక ఆకలి దహిస్తోంది.

ఓ విశాలమయిన చింతమానుకు ఆనుకుని కూర్చున్నాను నేను. మకరయ్యకు సయితం నా ప్రక్కనే చతికిలబడ్డాడు. తుపాకీ నా ఒడిలోనే వుంది.

మగత నిద్రలో కొద్దిగా జోగుతున్నాను. ఏదో చిన్న చప్పుడుకు చటుక్కున కళ్ళుతెరిచాను. ఎంత నిద్రలోవున్నా చీమ చిటుక్కుమంటే చాలు నాకు తెలివివచ్చేస్తుంది. ఎన్నో ఏళ్ళ వేట అభ్యాస ఫలితంగా సాధ్యపడిన విషయమది.

మకరయ్య నిలబడి వున్నాడు. ఏమిటన్నట్టు చూసాను మత్తుగా. నవ్వుతూ చిటికెనవేలు చూపించాడు మకరయ్య. నేను తిరిగి కళ్ళు మూసుకున్నాను. మకరయ్య ప్రక్కనే వున్న పొదలదిక్కుగా వెళుతున్నట్టు అడుగుల చప్పుడు వలన తెలుస్తోంది.

కొద్ది క్షణాలయినా గడవకముందే చిన్నగా వినపడిందో కేక. అది మకరయ్య గొంతు. కళ్ళు తెరిచి చటుక్కున నిలుచున్నాను. నిద్రమత్తు కాస్త వదలిపోయింది.

గట్టిగా పిలిచాను "మకరయ్యా!"

జవాబులేదు. పొదల వెనక్కి పరుగెత్తాను. మకరయ్య లేడక్కడ!

ఏమయ్యాడు యింతలోనే! ఏ జంతువో ఎత్తుకుపోయిందా? లేక నరభక్షకుడే....

చుట్టూ నేలమీద పరీక్షగా చూసాను. ఎత్తుగా పెరిగిన

గడ్డి ఒకదిక్కుగా నలిగినట్టు కనిపించింది. చిన్నచిన్న మొక్కలు ఎవరో తొక్కినట్టు నేలకు ఒదిగివున్నాయి అదే దిశలో. క్షణమయినా ఆలస్యం చేయక అటుగా పరుగు తీసాను.

రెండు మూడు నిముషాలయినా గడవక మునుపే ఒక పెద్ద పొద చేరువలో ఎదురయిన దృశ్యాన్నిచూపి ఠక్కున ఆగిపోయాను.

నేలమీద వెల్లకిలా పడివున్నాడు మకరయ్య. నరభక్షకుడు ప్రక్కన పర్వతంలా మోకాళ్ళమీద కూర్చొని వున్నాడు. మకరయ్య కంఠాన్ని కొరికేందుకు పెద్దగా నోరు తెరచి ముందుకు వంగుతున్నాడు. ఏమాత్రం ఆలస్యం జరిగినా మకరయ్యకు ఈ భూమిమీద నూకలు చెల్లినట్టే! నా చేతిలో గన్ పిడుగులా గర్జించింది.

తుపాకీ శబ్దం వింటూనే నరభక్షకుడు తలయినా ప్రక్కకు తిప్పకుండా ముందుకు పిల్లిమొగ్గ వేస్తూ పొదల్లో పడ్డాడు.

వేగంగా పొదలను సమీపించాను. నరభక్షకుడు లేడక్కడ. ఆత్రంగా మకరయ్యను సమీపించి చూసాను. ఒంటిమీద స్పృహలేదు తప్ప ప్రాణాపాయంలేదు. గాఢంగా నిట్టూర్పు విడుస్తూ తిరిగి పొదలను జాగ్రత్తగా పరిశీలించాను. కొన్ని ఆకులు రక్తం అంటివున్నాయి.

నరభక్షకుడు మొత్తంమీద గాయపడ్డాడు. పొదల వెనక నుండి నేలమీద రక్తం బొట్లుగా ముందుకు సాగింది. పెద్ద గాయమే కావచ్చు. ఈ గాయంతో వాడు యెంతోదూరం పోయివుండడు. వాణ్ణి దెబ్బ తీసేందుకు తగిన సమయమిదే.

తిరిగి మకరయ్యవద్దకు వచ్చాను. చేతితో తట్టి పిలిచినా

వులుకూ పలుకూలేదు. నరభక్షకు డతణ్ణి మెడమీద గట్టిగా కొట్టివుండొచ్చు. దానికి తోడు మకరయ్యా నరభక్షకుణ్ణి చూసి షాక్ తినివుంటాడు. తెలివి వచ్చేందుకు మరి కొంచెం వ్యవధి పట్టొచ్చు. అంతవరకూ ఎదురుచూడా లంటే ఈలోపు నరభక్షకుడు జారిపోతాడు.

మకరయ్యను ఎత్తి పొదలమధ్య పరుండబెట్టాను. పైనుండి పరీక్షగా చూసాను. మకరయ్యా తనకు తానుగా లేస్తేతప్ప ఎవరికీ కనపడే అవకాశంలేదు. తృప్తిగా ఊపిరి వదలి రక్తపుజాడ వెంబడి నడిచాను వడిగా.

రక్తపుబొట్లు అలా రెండు ఫర్లాంగులు మించి సాగి ఒక చెట్టుమొదట అంతమయ్యాయి. చెట్టుపైకి చూసాను. ఎవరూ వున్నట్టులేదు, నరభక్షకుడేమయినట్టు?

రక్తంచెట్టు మొదట ఆగిపోయింది. పరీక్షగా చూస్తే చెట్టు బెరడు అక్కడక్కడా వూడి నేలమీద ముక్కలుగా పడివుంది. నరభక్షకుడు చెట్టు ఎక్కాడన్నది స్పష్టం. చెట్టుకు తొర్రలు సయితంలేదు. మరి ఏమయినట్టు?

విషయం బోధపడింది: చెట్లు దట్టంగా వుండి ఒకదాని కొకటి చేరువగా వున్నాయి. చుట్టూవున్న చెట్లలో నరభక్ష కుడు ఏ దిక్కున పోయాడో తెలిసేదెలా?

అయినా పట్టువీడక ఓపిగ్గా నలుదిక్కులా గాలించ సాగాను. ఒకచోట ఎండిన ఆకుమీద కనపడిందో రక్తపు బొట్టు. నా పెదవులమీద అప్రయత్నంగా వెలిగిందో చిరు నవ్వు. పది పదిహేనడుగుల దూరంలో మరోచెట్టు వేగంగా అడుగులు వేస్తూ నేలను పరికిస్తూ ముందుకు సాగుతున్నాను మరొక బొట్టుకోసమని!

కానీ ఈసారి నా నెత్తిమీద పడిందో వెచ్చనిబొట్టు. చటుక్కున పైకెత్తాను తల. అయినా అప్పటికే ఆలస్య

మయింది. విశాలమయిన కొమ్మపై నుండి అసరికే దూకేసిన నరభక్షకుడు భీకరంగా అరుస్తూ నా మీద పడబోతున్నాడు.

రెప్పపాటులో తుపాకీ పైకెత్తి పేల్చాను. చెప్పాలంటే గురికూడా చూడలేదు. చూసే సమయమూలేదు. "ఢాం" మంది తుపాకీ. ఆ ఒక్క క్షణంలోనే నేను నా వేట జీవితంలో చేసిన ఒకే ఒక పొరపాటు జ్ఞాపకం వచ్చి కంపించిపోయాను. దురదృష్టవశాత్తూ ఈ గుండు తప్పితే నా డబుల్ బారల్ గన్‌లో మరి రెండో తూటాను ఇంతకు మునుపు నరభక్షకుణ్ణి గాయపరచిన దానిస్థానంలో లోడ్ చేయులేదు.

నరభక్షకుడు ఆ వూపున నామీద పడ్డాడు. నడుం కళుక్కుమనగా తుపాకీ నేనూ చెరోప్రక్క పడ్డాం. నరభక్షకుడి బరువుకే నా వొళ్ళు హూనమయిపోయింది. లేవాలనుకున్నా లేవలేకపోయాను. నరభక్షకుడు ఎక్కడ పడినవాడు అక్కడే వుండిపోయాడు. అంటే! తుపాకీదెబ్బ తిన్నట్టే గదా!

నెమ్మదిగా దేకుతూ వెళ్ళి నారభక్షకుణ్ణి సమీపించాను. మొదట తగిలిన దెబ్బ తొడలోనూ, రెండోసారి తూటా ఛాతీని ఒరుసుకుంటూపోయి నిలువున గెడ్డం దిగువనుండి శిరస్సులోకి పోయింది. అందుకే కిక్కురుమనలేదు నరభక్షకుడు.

ఇంతలో వచ్చాడు మకరయ్య పరుగున నా వద్దకు. నేలమీద పడివున్న నరభక్షకుణ్ణి చూస్తూనే ఆనందంతో చప్పట్లు చరుస్తూ నాకు చేయందించాడు. నెమ్మదిగా లేచి నిలబడ్డాను. □

కరాటే దొంగలు

విపంచి

సెకండ్ షో విడిచిపెట్టారు.

జనం తోసుకుంటూ, ముందుకి వెళ్తున్నారు.

బాగా రద్దీగా వుంది. ఒకరిమీద ఒకరు పడిపోతూ, అదే అదనని ఆడవాళ్ళ శరీరాల్ని తాకి, సంతృప్తి పడి పోతున్నారు జనం.

వాళ్ళకేసి చిరాగ్గా చూశాడు కూర్మావతారం.

తన ప్రక్కనే వున్న భార్య మల్లికకేసి తిరిగి, చెప్పాడు. "మనం వీళ్ళతోబాటు వెళ్ళొద్దు. ఈ రాపిడిలో అంత కంగారు కంగారుగా వెళ్ళి, మనం చేసేదేమీ లేదుకదా!"

'అలాగే!' అన్నట్లుగా తలాడించింది మల్లిక.

అతని బాధ అతనిది! పండగ బోనస్ వచ్చింది కదాని మల్లికకి బంగారపు గొలుసు చేయించాడు. గొలుసు చేయించి వారంరోజులు కూడా కాలేదు. అంతలోనే కర్మ కాలి, ఈ సందడిలో ఎవడైనా కొట్టేస్తే....? భార్య మెడ కేసి చూసాడు కూర్మావతారం.

సంతృప్తిగా నిట్టూర్చాడు కూర్మావతారం. మల్లిక మెడలో బంగారపు గొలుసు వుంది.

అందరూ వెళ్ళిపోయిన తర్వాత ఆఖర్న బయల్దేరాడు కూర్మావతారం, భార్య మల్లికను తీసుకొని.

"టైమెంతయ్యిందండీ?" నడుస్తూ, అడిగింది మల్లిక.

"పన్నెండున్నర!" చేతివాచీ చూపి చెప్పాడు.

చలిగాలి ఉధృతంగా వీస్తోంది. శరీరాలను వణికింప జేస్తోంది.

రోడ్డు కిరువైపులా వున్న మున్సిపాల్టీ లైట్లు ఒకటీ; అరా వెలుగుతున్నాయి. ఆ ట్యూబ్‌లైట్ల చుట్టూ మంచు పేరుకుపోయింది.

చంద్రుడు కూడా కనీ - కన్పించకుండా మబ్బుల్లో దాక్కున్నాడు.

రోడ్డుమీద సిన్మాకొచ్చిన వాళ్ళ తాలూకు స్కూటర్లు వెళ్ళిపోతున్నాయి.

కొంతమంది రిక్షాల్లో వెళ్తున్నారు.

"మనం కూడా రిక్షాలో వెళ్దామండీ?" గోముగా అడి

గింది మల్లిక.

ఆమె అలా గోముగా అడగటంకన్నా, గోముగా అడిగి నప్పటి అందమైన పెదాలు కూర్మావతారానికి ముద్దొచ్చి, వెంటనే శాంక్షను చేసేసాడు.

"ఓ.కే!"

వాళ్ళకోసమే వెదుక్కుంటూ వచ్చినట్లుగా సైకిల్ రిక్షా ఒకటి చప్పుడు చేసుకొంటూ, వాళ్ళ దగ్గరికొచ్చింది.

"ఏం బాబూ, రిక్షా కావాలా?" గరగరలాడుతున్న గొంతుతో అడిగాడు రిక్షావాడు.

రిక్షావాడికేసి చూడగానే వులిక్కిపడ్డాడు కూర్మావతారం.

ముఖమంతా మచ్చలు మచ్చలుగా....మందు కొట్టేసి నట్లు ఎర్రటికళ్ళు, మెలిదిరిగిన నల్లటి మీసాలు, వంకర నవ్వు. మల్లిక మెడమీదే నిల్చిన ఆ రిక్షావాడి చూపు....

వెన్నులో సన్నటి వణుకు పుట్టుకొచ్చింది కూర్మావతారంలో. రెండువేలు ఖరీదుచేసే గొలుసు అతని కళ్ళ ముందు కదలాడింది.

"అమ్మో, వద్దు!" అన్నాడు బెరుగ్గా కూర్మావతారం.

అర్థం కాలేదు మల్లికకి-భర్త ఎందుకు రిక్షా వద్దన్నాడు. అయోమయంగా చూపింది భర్తకేసి.

"అమ్మో వద్దు ఏటండీ? రిక్షా కావాలా వద్దా?" రిక్షా ఎక్కకపోతే పొడిచేస్తాన్నంత ఘోర్పుగా ధ్వనించింది కూర్మావతారానికి ఆ రిక్షావాడి మాటలు.

"అబ్బె, వద్దండీ రిక్షా! కార్తీకమాసంలో, అందునా కృష్ణపక్షంలో అర్ధరాత్రిపూట రిక్షా లెక్కకూడదని 'శివ పురాణం'లో వ్రాసుంది. ఏదో....కొంచెం శివభక్తుణ్ణి. ఈ సారికిలా కానిచ్చెయ్యండి" కాళ్లూ, చేతులు వణుకు

తున్నాయి కూర్మావతారానికి.

"ఉహూఁ" అంటూ ఆ రిక్షావాడు బీడీ వెలిగించుకొని వెళ్ళిపోతూ, కూర్మావతారంకేసి రెండు మూడుమార్లు వెనుదిరిగి చూసి గొణుక్కున్నాడు "ఎధవ బేరం!"

"అదేమిటండీ, ఇందాక ఆ రిక్షావాడితో మాట్లాడు తున్నప్పుడు మీ కాళ్లూ చేతులు, ఎందుకు వణికాయి?" అడిగింది మల్లిక.

"హిహి" వెర్రినవ్వు నవ్వి, చెప్పాడు కూర్మావతారం. "చలికాలం కదా! అలా కాళ్లూ చేతులు మొత్తం శరీర మంతా వణికిపోతుందన్న మాట."

ఇంకేమీ మాట్లాడలేదు మల్లిక. మనసులో మహా మంటగా వుందామెకు—యింత చలి రాత్రివేళ నడిపించి, తీసుకెళ్ళుతున్నందుకు.

చేతులు కట్టుకుని, నడవసాగింది మల్లిక.

సన్నటి మంచు వారి తలలని తడుపుతుంది.

ఆ రోడ్డుమీద వారిద్దరు తప్ప మరెవ్వరూ లేరు.

కూర్మావతారానికి సిన్మాలోని హీరోయిన్ గుర్తు కొచ్చింది. "భలే అందంగా వుంది" గుటకలేసాడు-హీరో యిన్ని తల్చుకొని.

సరిగ్గా అదే సమయానికి మల్లిక మనసులో కూడా యించుమించు కొద్దితేడాతో అవే ఆలోచనలు—"సిన్మాలో హీరో పర్సనాల్టీ ఎంత బావుంది? ఆ విశాలమైన ఛాతీ, కండలు తిరిగిన శరీరం, గుండెలమీద వెంట్రుకలు.... హుఁ, తన భర్త వున్నాడు ఎందుకు? తుఫాన్‌గాలి వేగంగా వీస్తే ఎగిరిపోయే రకం! ముఖ్యంగా ఫైటింగ్ సీన్స్‌లో "హూ. ఆఁ!" అంటూ కరాటే ఫోజు లిచ్చినపుడు వుబ్బొంగిన మజిల్స్ ..."

ఆమె ఆలోచనలు పూర్తికాలేదు.

మోటారు బైకుల శబ్దం విన్పించింది.

తల పైకెత్తి చూసింది.

నాలుగు మోటారుబైకులు! వాళ్ళకి దగ్గరగా వచ్చి, ఆగాయి.

ఆ నాలుగు మోటారుబైకుల మీద నలుగురు కండలు తిరిగిన యువకులు. బనీన్. జీన్స్ ప్యాంట్లు ధరించి వున్నారు. జుట్టు గాలికి రేగుతుంది. కాళ్ళకి స్పోర్ట్స్ షూస్....

వాళ్ళని చూడగానే ఆ అర్ధరాత్రివేళ కూర్మావతారం లోని భయం మేల్కొంది. "ఎవరు మీరు?" కంపిస్తున్న స్వరంతో అడిగాడు.

'షోలే' సిన్మాలో అమ్జాద్ఖాన్లా వికటాట్టహాసాలు చేసారు వాళ్ళందరూ_ఒకేమారు. "ఇలాంటి టైమింగ్స్లో మాలాంటి వాళ్ళం ఎందుకొస్తామో తెలియదూ?" క్రూరంగా చూసాడొకతను.

"అంటే—తన మల్లికను వున్న పళంగా రేప్చేసి.... బాబోయ్!" మల్లికని, ఆ నలుగురు రౌడీల్ని మార్చి మార్చి చూసాడు కూర్మావతారం.

వెన్నెల్లో తడిసి, మరింత మనోహరంగా వుంది మల్లిక.

ఆ రోడ్డుమీద తను, మల్లిక, ఆ నలుగురూ తప్ప, మరెవ్వరూ లేరు.

పళ్ళు ఇకిలిస్తూ, మల్లికకు దగ్గరగా వచ్చాడో కుర్రాడు. మల్లిక ఒక్క క్షణం థ్రిల్ ఫీలయ్యింది—ఆ మరుక్షణమే భీతి! బెదురు బెదురుగా చూసింది.

చేతిని మల్లిక వక్షోజాల దగ్గరికి పోనిచ్చాడా కుర్రాడు.

"రేయ్! వదలరా....నా పెళ్ళాం ఒంటిమీద చెయ్యేసా

వంటే" రెచ్చిపోతూ, ముందుకు రాబోయాడు కూర్మావతారం.

అతని మాటను మింగేసే అంతటి శబ్దం చేసారు మిగిలిన ముగ్గురూ. "య్యా....హీ!"

పెద్దగా అరుస్తూ పొజిషన్‌లో కొచ్చేసారు. వాళ్ళ కండరాలు వుబ్బొంగాయి. కళ్ళు ఎర్రబడ్డాయి. పిడికిళ్ళు బిగించాడు.

వాళ్ళు కరాటే వచ్చిన దొంగలని అర్థం చేసుకోవటానికి క్షణంకన్నా ఎక్కువసేపు పట్టలేదు కూర్మావతారానికి. వణుకు, దడ పుట్టుకొచ్చింది. అసలే బక్కపల్చని శరీరం కావటంతో గజగజా వణికిపోయాడు.

"బాబూ! మా ఆవిడ్ని ఏం చెయ్యొద్దు వదిలెయ్యండయ్యా! కావాలంటే నా పర్సు యిచ్చేస్తాను!" దీనంగా ప్రార్థించాడు కూర్మావతారం.

మల్లికకి అసహ్యమేసింది భర్తమీద "ఇలాంటి సిట్యుయేషన్లలో సిన్మాలోని హీరో అయితే ఎంత అద్భుతంగా చితకతన్నేవాడా కరాటే కుర్రాళ్ళని?"

"ఈ సిటీలో యింతే వెధవబ్రతుకు! ఎప్పుడే క్షణాన 'ఢాకూవాలా' వూడిపడతాడో తెలియదు. వీళ్ళు ఆ బాపతే" మనసులోనే గొణుక్కున్నాడు కూర్మావతారం.

నాలుగో కుర్రాడి చెయ్యి మల్లిక భుజంమీద పడింది. మృదువుగా మెడభాగాన్ని నిమురుతూ—

రక్తం నరనరాల్లో వేగంగా ప్రవహించింది. "మగాడయ్యుండి, కట్టుకున్న భార్యను కాపాడుకోలేకపోతున్నాడు" ఆలోచన మనస్సులోకి రాగానే, ముందుకి వురికాడు కూర్మావతారం.

నాలుగో కుర్రాడు కూర్మావతారాన్ని చూపి, చిన్నగా

నవ్వాడు.

ఆ రెండో క్షణమే—

"ఫట్"మని విసురుగా వచ్చి కూర్మావతారం మొహాన్ని తాకింది అతడి బలిష్టమైన చెయ్యి.

మొహం చితికిపోయినట్లై "అమ్మోవ్!" బాధతో అరిచాడు కూర్మావతారం. రక్తం పెదవుల చివర్ల నుండి కారింది.

రక్తాన్ని చూసుకోగానే, ఉక్రోషం ముంచుకొచ్చి ఆవేశం, ఉక్రోషం కలిపిన గొంతుతో ఓ బూతుమాట తిట్టాడు కూర్మావతారం.

అంతే!

"ఫట్ ఫటా"మంటూ పంచెస్ రిలీజ్ చెయ్యబడ్డాయి. కూర్మావతారం మొహంమీద, ఛాతీమీద - శరీరంలోని అన్ని ప్రదేశాలలో కరాటే దెబ్బలు! మెరుపులా మెలికలు తిరిగిపోతున్నారా నలుగురూ.

ఎప్పుడు ఏ విధంగా, అంత వేగంగా కదుల్తున్నారో అర్థం కావటంలేదు మల్లికకి నిశ్చేష్టితయై నిలబడి, చూస్తుంది.

బాధతో వుండలు చుట్టుకుపోతున్నాడు కూర్మావతారం. "శరీరంలో ఎన్ని ఎముకలు విరిగిపోయాయో-" అనుకున్నాడు. "అయిపోయింది! తన అవయవాలు కదలవిక! చితకబాదేసారు. మల్లికని...." ఏడుపు ముంచుకొస్తుంది కూర్మావతారానికి.

భార్యముందు ఏడిస్తే బావుండదని, దెబ్బల బాధని మాత్రం తాళలేక అరుస్తున్నాడు.

దూరంగా రిక్షాబెల్ విన్పించింది.

ఆ శబ్దాన్ని వినగానే క్యాప్టుడు కార్యక్రమాన్ని ఆపి,

మోటార్ బైకులు స్టార్టుచేసి, పారిపోయారా నలుగురూ.

రోడ్డుమీద పడున్నాడు కూర్మావతారం — అతని ప్రక్కనే నిలబడిపోయివుంది మల్లిక.

రిక్షా దగ్గరయ్యింది. ఇందాకటి రిక్షావాడే!

2

చటుక్కున మెలకువ వచ్చింది ముకుందానికి. అర్ధరాత్రివేళ అలా వున్నట్లుండి మెలకువరావటం ముకుందానికి అలవాటే!

ధనాన్ని విపరీతంగా సంపాదించటం మొదలుపెట్టిన గత ఏడు సంవత్సరాలనుండి ముకుందానికి రాత్రిపూట సరిగ్గా నిద్రపట్టదు.

చెవులు రిక్కించాడు. ఎక్కడో చప్పుడవుతుంది. వెంటనే మంచంమీద నుండి లేచి, లైటువేసాడు.

గది మూలగావుంది ఐరన్ సేఫ్! అందులోనేవుంది తన కష్టార్జితం—సంతృప్తితో నిట్టూర్చాడు.

తిరిగి మంచంవైపు నడవబోయి, తెల్లబోయాడు. బాల్కనీకున్న అద్దాల తలుపులు తెర్చుకుని, లోపలికొస్తున్నారు ముగ్గురూ. వాళ్ళల్లో ఏ ఒక్కరూ ఆరడుగులకి తక్కువుండరు. కండలు తిరిగిన శరీరాలు ...

ఆ రాత్రిపూట అలా దొంగచాటుగా వచ్చేవాళ్లెవ్వరో తెలుసుకోవటానికి ముకుందానికి క్షణంసేపు కూడా పట్ట లేదు. "దొంగలు!"

బాగా దగ్గరికొచ్చి, అన్నాడొకతను. "తాళంచేతులివ్వు-ఐరన్ సేఫ్‌లో మాకు కావల్సినంత తీసుకొని, బుద్ధిమంతుల్లా వెళ్ళిపోతాం."

ముకుందానికి పరిస్థితి అర్థమైంది. ఇటువంటి పరిస్థితి ఎప్పటికో ఒకనాటికి ఏర్పడుతుందని, అతనెప్పుడో ముందు

జాగ్రత్తలు సిద్ధం చేసుకున్నాడు.

ప్రతిరోజూ రాత్రి నమ్మకస్తులైన నలుగురు వస్తాదులు ఆ ప్రక్కగదిలోనే పడుకుంటారు.

"ప్రభాకరం!" పెద్దగా అరిచాడు ముకుందం - ప్రక్క గదిలో పడుకున్నవాళ్ళని లేపటానికి.

పిలుపు బయటికొచ్చింది. ఆ మరుక్షణమే అతని నోటి మీద బలిష్టమైన చేతిదెబ్బ పడింది.

ముకుందం పిలుపుకి మెలకువ వచ్చి, ఆ గదిలోకి పరుగు పరుగున వచ్చారు కాపలావస్తాదులు.

ఆ వస్తాదులని చూసి కూడా, ఏ మాత్రం చలించలేదు ఆ ముగ్గురు దొంగలు! పైగా నవ్వారు.

"ఇంట్లోకి చొరబడి, దొంగతనం చేద్దామనుకుంటున్నారా? ఆ పప్పులుడకవు" చెప్పాడు వస్తాద్ ప్రభాకరం - ఒక అడుగు ముందుకివేస్తూ

ముకుందానికి కొంచెం ధైర్యం వచ్చింది.

వస్తాదులు ఆ దొంగలపై తిరగబడ్డారు! వస్తాదుల పిడికిళ్ళు ఆ ముగ్గురు దొంగల మొహాన్ని తాకకముందే అరచేత్తో 'బ్లాక్' చేసారు మోకాలువంచి, వస్తాదుల పొత్తి కడుపుదగ్గర తన్నారు దొంగలు.

ఒక్కక్షణం విపరీతమైన బాధతో గిలగిలలాడి, త్వరగానే తేరుకొన్నారు వస్తాదులు.

ఈసారి నలుగురు ఆ గది నాలుగుమూలలకి నాలుగు దిక్కులగా విడిపోయి, దొంగలచుట్టూ చక్రబంధం పన్నారు. ఆవేశం వారి అణువణువులో చోటు చేసుకొంది.

"ఈసారి మా నుండి తప్పించుకోలేరు" నలుగురు వస్తాదులు దొంగల్ని చుట్టుముడుతూ, నిర్భయంగా ఎనౌన్స్ చేసారు.

తమని చుట్టుముడుతున్న వస్తాదుల్ని కనుచివర్లనుండి గమనించారు ముగ్గురు దొంగలు.

వాళ్ళ కండరాలు వుప్పొంగాయి. గది గోడలు బీటలు వారేలా సింహనాదం చేసారు.

మెరుపు మెరిపినట్లు వాళ్ళచేతిలో 'నన్‌చాకు'లు ప్రత్యక్షమయ్యాయి.

నన్‌చాకుల్ని చూడగానే అదిరిపడ్డారు వస్తాదులు. మార్షల్ ఆర్ట్సులో ఎంతో ప్రావీణ్యముంటేగాని 'నన్ చాకు'ని త్రిప్పడం సాధ్యంకాదు. అటువంటిది ఆ ముగ్గురి దొంగలచేతిలో నన్‌చాకులున్నాయంటే మార్షల్ ఆర్ట్సులో ఆరితేరినవారై వుండాలి—తత్తరపడుతూ, వెనుకంజ వెయ్యబోయారు వస్తాదులు.

కాని అప్పటికే ఆలస్యమైంది.

ముకుందం తెల్లబోయి చూస్తున్నాడు.

నన్‌చాకులు స్పిన్నింగ్ వేగంతో కదలటమే అతనికి తెలిపింది.

మూడుక్షణాల్లో 'నన్‌చాకు' దెబ్బలకి నజ్జునజ్జు అయ్యారు వస్తాదులు.

మార్షల్ ఆర్ట్స్, నన్‌చాకుల ముందు కుస్తీపట్లు, సర్కస్‌ఫీట్లు దిగదుడుపే - అని ముకుందం ఓ నిర్ణయాని కొచ్చేలోపలే ఐరన్‌సేఫ్ తెరిచి, తమ చేతికందిన నోట్ల కట్టలందుకొని వచ్చినదారి పట్టారు కరాటే దొంగలు.

దోచుకున్నది బ్లాక్‌మనీ కావటంతో నోరెత్తలేక పోయాడు ముకుందం.

3

గీత కాలేజీనుండి బయటికొచ్చి. ఫ్రెండ్సుతో నడుస్తుంది.

మొత్తం గీతతో కలిపి ఆరుగురు అమ్మాయిలు!

"త్వరగా నడవండే! పాపం, బోల్డెంతమంది 'అ.ఆ'లు మనకోసం సెంటర్లో ఎదురుచూస్తుంటారు. ఆలస్యమైన కొద్దీ ఆశాభంగమవుతుంది వాళ్ళకి" నవ్వుతూ అన్నది విశాలాక్షి.

"ఆ 'అ.ఆ.'ల సంగతేమోగాని, ముందు మన విశాలాక్షికే ఎక్కువ ఆత్రుత అనుకుంటా. ఓ తొందరపడి పోతుంది" ఓరకంట చూస్తూ చెప్పింది గీత.

"ఏయ్" గీతను కొట్టబోయింది విశాలాక్షి. మిగిలిన అమ్మాయిలు పకపకా నవ్వారు.

అంతలోనే వెనకనుండి పాట వినబడింది. "నడుము చూడు - నడుము అందంచూడు, నడకలోవున్న వొంపులు చూడు...."

గిర్రున వెనక్కి తిరిగింది గీత.

నలుగురు కుర్రాళ్ళు రెండుసైకిళ్ళమీద గీతావాళ్ళనే ఫాలో అవుతూ, పాడుతున్నారు.

"రోగ్స్! పని పాటా ఏమీ వుండదు ఈ వెధవలకి" కోపంగా అన్నది గీత.

గీత కామెంట్స్‌కి ఏ మాత్రం చలించలేదు వాళ్ళు. పైగా తాము పాడుతున్న పాటని మరింత హుషారుగా పాడసాగారు.

కొంచెం దూరం వేగంగా నడిచింది గీత బృందం. అయినా వాళ్ళపాట ఆగలేదు.

వెనక్కి తిరిగి, నిప్పుల్లా జ్వలిస్తున్న కళ్ళతో వాళ్ళకేసే చూస్తూ. చెప్పింది గీత. "చెప్పు తెగుతుంది, జాగ్రత్త!"

"ఓయ్....హోయ్! మా చెప్పులమీద అమ్మడికి ఎంత అభిమానం! చొచ్చొచ్చు!" తమాషాగా పెదవి విరుస్తూ,

నవ్వాడు కుర్రాడు.

రెచ్చిపోయింది గీత ఆ మాటలకి "పిచ్చి పిచ్చి వేషాలు వేసారంటే, ఇక్కడున్న మా ఆరుగురి కాలి చెప్పులు మీ చెంపల్ని పావనం చేస్తాయి. ఇడియెట్స్!" అంటూ స్నేహితురాళ్ళవైపు తిరిగి అన్నది గీత. "మనం వూరుకున్న కొద్దీ ఈ మగవెధవలు మితిమీరిపోతున్నారు. ఏమైతే అదయ్యింది. ఇవ్వాళ వీళ్ళకి బుద్ధి చెప్పాల్సిందే!"

"బుద్ధులు, సిద్ధులు అంటుంది! అఫ్టాల్, ఆడపిల్లలు!! రేయ్, సైకిళ్ళకి బ్రేకెయ్యండి!!! అందాల సంగతి తేల్చుకున్న తర్వాతే, ముందుకి మన ప్రయాణం. వీళ్ళని వున్న పళంగా రేప్‌చేసి పడేస్తే, ఎవడు దిక్కు?" సైకిళ్ళు దిగి, గీత బృందానికి దగ్గరగా వచ్చారు.

భయంతో వణికిపోసాగింది గీత బృందం. అనవసరంగా రెచ్చగొట్టి, చిక్కుల్లో పడ్డామని ఆలోచించసాగారు.

అంతలోనే అటువైపుగా వస్తున్న ఓ 'అ.ఆ' (అందాల ఆరాధకుడు) ఆ దృశ్యాన్ని చూసి, తెగ బాధపడిపోయాడు.

"ఏమిటిరోయ్, మా ఆడవాళ్ళని అల్లరిపెట్టాలని చూస్తున్నావా? ఇది మా టెర్రిటరీ ఏరియా! ఇక్కడ మాకు తప్ప, మరొకరికి మరోపని చేసే అవకాశం లేదు. వినకపోయారంటే, ఏం జరగబోతుందో నేను చెప్పను. చూద్దురు" తనో హీరో క్రింద ఫీలై పోయి, గీత వాళ్ళకి ఓ 'స్టిల్' యిస్తూ, ఆ సైకిల్ రోమియోలకి వార్నింగిచ్చాడు అ.ఆ.

అ.ఆ. కి ఏమీ సమాధానం యివ్వకుండా నవ్వారు వాళ్ళు. నవ్వుతూ, కరాటే ఫైటింగ్ పొజిషన్‌లో కొచ్చారు.

ముచ్చెమటలు పట్టేసాయి అ.ఆ. కి "మీ.........మీ్మకు కరాటే వచ్చా?" మాట తడబడింది.

దానికి సమాధానం వాళ్ళు చెప్పలేదు. వాళ్ళ పిడికిళ్ళు జవాబిచ్చాయి.

మరుసెకన్ అక్కడ్నుంచి మంత్రమేసినట్లు మాయమై పోయాడు అ.ఆ.

రక్షణగా వుంటాడనుకున్న ఆ ఒక్క మగప్రాణి పారి పోయేసరికి గీత వాళ్ళల్లోని భయం రెట్టింపయ్యింది.

తామనవసరంగా తొందరపడ్డామని చాలా ఆలస్యంగా అర్థమైంది గీతకి. చాలా ఆలస్యం—చేసిన తప్పు దిద్దుకో లేనంత ఆలస్యం!

ఇక ఈ కరాటే రోమియోల బారినుండి తమని కాపాడే దెవరు?

భయంతో అక్కడ్నుంచి పరుగు తీస్తున్నారు. వెనకనే గీతవాళ్ళని తరుముకు రాసాగారు కరాటే రోమియోలు.

చాలా దూరం పరిగెత్తిన తర్వాత గుర్తించింది గీత— తమని కరాటే రోమియోలు తరుముకు రావటం లేదు. ఎక్కడ వదిలారు తమని?! తమ దారిన తాము పోయారు. ఎక్కడికో అక్కడకి పోయారు. పీడా వదిలింది.

"మన అదృష్టం బావుండబట్టి, ఈ రోజు తప్పించు కొన్నాం. ఇంకో రోజైతే...." సంతోషం, బాధ రెండు కలిపిన గొంతుతో నిట్టూరుస్తూ చెప్పింది గీత.

4

ఇవే కాదు జరిగినవి—

ఓ వారం రోజులబాటు ఆ నగరమంతా అల్లకల్లోలం సృష్టించారు కరాటే దొంగలు.

స్కూల్ బస్‌ను ఆపి, అందులో వున్న డ్రైవర్‌కి, కండక్టర్‌కి చెరో రెండు కరాటే దెబ్బల చొప్పున పంచి బెట్టి, ఆ బస్‌లో వున్న పిల్లల పెట్టెలు బుక్స్ ఎత్తుకెళ్ళి

పోయారు.

బ్లాక్‌మార్కెట్‌లో చచ్చీ చెడీ కొన్న టెక్స్టుబుక్స్ ఎత్తుకెళ్ళిపోయేసరికి లబోదిబోమన్నారు తల్లిదండ్రులు.

కొంతమంది పిల్లల్ని ఎత్తుకెళ్ళడానికి కూడా ప్రయత్నించి, విఫలులయ్యారు కరాటే దొంగలు.

అందమైన అమ్మాయిల వెనకబడి వేధించారు.

డబ్బున్నవాళ్ళ జేబులు దోచుకున్నారు.

నగరమంతా అలజడి... సంచలనం!

ఎదురు తిరిగిన వాళ్ళకి కరాటే దెబ్బలు....

అమ్మాయిలు విపరీతంగా భయపడిపోయారు. ఏ క్షణాన వూడిపడి, రేప్ చేస్తారో?

చదువుకుంటున్న పిల్లలకి భయం—తమని ఎత్తుకెళ్ళి, ఎవరికో అమ్మేస్తారని.

అందరికి భయం—భీతి!

ఏడురోజులు గడిచిన తర్వాత మేల్కొంది పోలీస్ డిపార్ట్‌మెంట్.

పోలీస్ వాళ్ళకి మెలకువ వచ్చేటప్పటికి కరాటేదొంగల అడ్రస్ లేదు. పూర్తిగా సద్దుమణిగిపోయారు.

కాని....అందరికి అనుమానమే.

మళ్ళీ ఎప్పుడు రోడ్ల పై ప్రత్యక్షమౌతారో?!

5

మొత్తం ఏడుగురు!

ఒకొక్కక్కరికి రెండేసి వేలు చొప్పున పద్నాలుగు వేలు!

ఏడు చెక్కుల మీద సంతకంపెట్టి, ఆ చెక్కుల్ని భద్రంగా విడివిడి కవర్లలో పెట్టి. ఎడ్రస్ వ్రాసి, పోస్టు చేద్దామని బయలుదేరాడు సభాపతి.

హాలంతా కరాటే కేకలతో ప్రతిధ్వనిస్తుంది. 'బిగినర్స్'కి సూచనలివ్వటంలో తలమునకలుగా మునిగిపోయి వున్నారు ముగ్గురు కరాటే టీచర్స్.

సభాపతి బండ పెదవులపై చిరునవ్వు మెదిలింది. హాలు దాటి బయటికొస్తూ, అనుకొన్నాడు. "అయిదు వేలకి తక్కువ కాకుండా చేరారు—కరాటే నేర్చుకోవటానికి, కరాటే దొంగల ధాటికి భయపడి ఒక్కొక్కళ్ళకి వంద రూపాయిల ఫీజు: యాభై వేలలో తను పెట్టిన పెట్టుబడి పధ్నాలుగు వేలెంత?"

ఆ బిల్డింగ్ నుండి బయటపడి, ఇనుప తలుపు ప్రక్కనే వున్న బోర్డ్‌ని చదివాడు ఆ సంస్థ ప్రొప్రయిటర్ సభాపతి.

"బ్రూస్‌లీ కరాటే స్కూల్: మీ ఆత్మరక్షణకై నేడే చేరండి::"

మరోసారి నవ్వుకొన్నాడు. ఈసారి కొంచెం పెద్దగా. □

నిజం చెప్పకు

కిడ్నాపర్

ఎమ్.వి.వి. సత్యనారాయణ

డిటెక్టివ్ శిరీష్ అతడిని నవ్వుతూ చూశాడు.

"కూర్చోండి మిస్టర్ బలరామ్!" అన్నాడు.

బలరామ్ నవ్వలేదు. అతడి మొహం వాడిపోయివుంది. ఏదో భరింలేని నిజం ఒకటి అతడిని చీకాకు పరుస్తున్నట్టుగా

అతడి వాలకం చెబుతోంది. నెమ్మదిగా అతడి బల్లకు అటు కుర్చీలో కూర్చున్నాడు.

"మా బాబును ఎవరో ఎత్తుకుపోయారు సార్!" అన్నాడు బలరామ్.

డిటెక్టివ్ శిరీష్ కుర్చీలో ముందుకు వాలాడు.

బలరాం తిరిగి అన్నాడు. "రవీంద్ర మాకు ఒక్కగా నొక్క బాబు. నాలుగు సంవత్సరాలుంటాయి. వాడిని ఎవరో దుండగులు ఎత్తుకుపోయార్సార్! రవీంద్ర మా యిద్దరికీ ప్రాణం! వాడిని ఎలా అయినా పట్టుకోండి సార్! మా బాబును మాకు ఒప్పగించండి!"

డిటెక్టివ్ శిరీష్ అతడి ఆవేదనకు కదిలిపోయాడు. బలరాం చిన్న పిల్లవాడిలాగా ఏడుస్తున్నాడు.

"మిస్టర్ బలరాం! మీ బాబును ఎలా ఎత్తుకుపోయారు?"

"ఒక గంటక్రితం సార్! ఇంటిచుట్టూ పోలీస్ బలగం కాపలా వుంది సార్! అయినా నా బాబును రక్షించుకోలేక పోయాను. నా భార్య అయితే స్పృహ తప్పిపోయింది సార్!"

శిరీష్ నుదురు చిట్లించాడు. పోలీస్ బందోబస్తు వుండగానే ఎత్తుకుపోయారా? ఎలా సాధ్యం?

"పూర్తిగా చెబుతాను సార్! అప్పుడు కాని విషయం అర్థంకాదు సార్!"

బలరాం బరువుగా వూపిరి పీల్చుకుని చెప్పడం మొదలు పెట్టాడు.

"ఈ రోజుకు సరిగ్గా వారం రోజులయి వుంటుందిసార్! నా పడక గదిలో బెడ్ మీద ఒక వుత్తరం ప్రత్యక్ష మయింది.

'మీ బాబును త్వరలో ఎత్తుకుపోతాం! అలా జరగ

కుండా వుండాలంటే తప్పించుకునే మార్గంకూడా వుంది. ఆలోచించుకో!

—నీ నీడ.'

యింతేవుంది వుత్తరంలో. నేను ఆ వుత్తరాన్ని పట్టించుకోలేదు. ధనవంతుల పిల్లలను యిలా డబ్బుకోసం ఎత్తుకుపోతాననడం అతి సాధారణంగా జరిగే సంఘటనే కదా! కాని నా భార్య వొప్పుకోలేదు.

పోలీసులకు కంప్లయింట్ యిస్తానని ఒకటే పోరు పెట్టింది. ఆమెను కంప్లయింట్ యివ్వనీయలేదు. అయితే మరుసటిరోజు మరో వుత్తరం వచ్చింది.

'వెరీ గుడ్!

పోలీసులకు చెబుతావనుకున్నాను. నువు చెప్పలేదు. అదే మంచిది! మేము మొదట నాలుగులక్షలు డిమాండ్ చేసి నిన్ను పుత్రశోకం నుండి తప్పించాలనుకున్నాం. నువు బుద్ధిగా వున్నావు రెండు లక్షల రూపాయలు మాత్రమే చాలు! ఎలా అందించాలో చెబుతాం!

—నీ నీడ!'

ఈ వుత్తరంతో నా మతి నిజంగానే పోయింది. ఆ వుత్తరాలు రాస్తున్న వాళ్ళెవరో నిజంగానే బాబును ఎత్తుకుపోయేలాగా వున్నారు. నా భార్యతో ఏకీభవించి పోలీసులకు తెలియపరిస్తేనే మంచిది! ...."

"మిస్టర్ బలరాం! రెండో వుత్తరం ఎలా అందింది?" కలగచేసుకున్నాడు డిటెక్టివ్ శిరీష్.

"సారీ సర్! చెప్పలేదు కదూ! మామూలుగానే. మొదటి వుత్తరం లాగానే రెండోదికూడా నా బెడ్‌మీదే వుంచారు!"

"ఇంట్లోకి నీడ అంత ధైర్యంగా ఎలా రాగలిగాడు?"

"అదే సార్! నాకూ ఆశ్చర్యం కలిగించింది!"

"నీదకు సహకరించే వాళ్ళెవరో మీ యింట్లో వుండి వుండాలి!"

"మా యింట్లో అలీ అనే నౌకరూ, ముసలావిడ అయిన వంట మనిషీ! ఒక తోటమాలీ వున్నారు. రాత్రివేళ కాపలాకు గూర్ఖా వచ్చిపోతూ వుంటాడు."

"ఈ ముగ్గురికీ, గూర్ఖాకూ మీ పడకగదిలో ప్రవేశించే వీలు వుంటుందా?"

"అలీ తప్పించి ఎవరికీ వుండదు, పైగా నా భార్య నా గదికి ప్రక్క గదిలోనే వుంటుంది కూడా!"

"అదేమిటి? మీ యిద్దరికీ కలిపి ఒక గది లేదా?"

"అది కాదు సర్! ఇల్లు పెద్దది. గదులు ఖాళీగా వుండటం జయంతికి యిష్టం వుండదు. పైగా ఆమె కొద్దికాలం నుండి మందులు వాడుతోంది. ఒంట్లో ఎవరికీ అంతుపట్టని అస్వస్థత!"

"అలాగా! బాబు మీవద్ద చేరికగా వుంటాడా? జయంతి గారివద్ద చేరికగా వుంటాడా?"

"వాడంటే మా యిద్దరికీ పంచప్రాణాలు! అలాగే వాడికి కూడా మేమిద్దరమూ అంతే! జయంతికి ఇక పిల్లలు పుట్టరని వైద్యులు చెప్పారు."

శిరీష్ నిట్టూర్చాడు. "ఇప్పుడు ఆ వున్న ఒక్క బాబునూ దుండగులు అపహరించారు. మీకు ఎదురయిన కష్టానికి నేను చింతిస్తున్నాను!"

బలరామ్ కళ్ళు ఒత్తుకున్నాడు.

"తరువాత ఏం జరిగిందో చెప్పండి?"

"శుక్రవారం నాడు మూడో బెదిరింపు వుత్తరం వచ్చింది. ఆదివారం నాడు మధ్యాహ్నం 12 గంటలకు బాబును ఎత్తుకుపోతారట! నేను పోలీసులను సంప్రదిం

చాను. వాళ్ళు నన్ను డబ్బు యివ్వవద్దన్నారు. ఆదివారం ఉదయం నుండీ మా బంగళా వద్ద పోలీసుల కాపలా ఏర్పాటయింది."

"మీ భార్య ఈ ఏర్పాటుకు ఒప్పుకున్నారు కదూ!"

"మొదట ఆమె ఇలాంటి ఏర్పాటు చేయమని కోరింది. మూడో బెదిరింపు ఉత్తరం ఎప్పుడయితే వచ్చిందో ఆమె పూర్తిగా బెదిరిపోయింది. నన్ను బతిమాలింది.

'పోతే పోనిద్దురూ! దిక్కుమాలిన సంత! రెండు లక్షలు పోతేమాత్రం మనకు వచ్చిన నష్టమేమిటి?' అంది జయంతి.

'పోలీసులు మనం డబ్బు పోగొట్టుకోవడానికి యిష్ట పడటంలేదు కదా!' అన్నాను.

'వాళ్ళకు తెలియకుండా యిద్దాం! మన బాబు శ్రేయస్సు మనకు ముఖ్యం!' అన్నదామె.

"బాంకు నుండి రెండు లక్షలు విత్‌డ్రా చేయించి తెప్పించింది జయంతి. కాని మమ్మల్ని బెదిరించిన వాళ్ళకు ఆ సొమ్ము ఎలా అందించడం? వాళ్ళు మాకు ఎలాంటి ఆధారమూ ఇవ్వకుండా కేవలం బాబును మాత్రమే ఎత్తుకుపోతా నన్నారు. శనివారం అంతా బెదిరించిన మనుషుల కోసం ఎదురు చూశాం. వాళ్ళు రావాలనీ సొమ్ము తీసుకోవాలనీ మనసులో కోరుకున్నాం. ఫలితం లేకపోయింది. ఆదివారం రానేవచ్చింది."

"పోలీసుల కళ్ళ ఎదుటే రవీంద్రను ఎలా ఎత్తుకు పోయారు?"

"అది యింకా విచిత్రంగా వున్నదండి!" బలరాం గుక్క తిప్పుకోనకుండా అన్నాడు. "మేడమీద నా గదిలో బాబుతో కూర్చున్నాను. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాకు

అంత దూరంలో కూర్చున్నాడు. ఆయన చేతిలో పిస్తోలు వుంది. పన్నెండు గంటలవుతోంది. బయట ఎండ మండి పోతోంది. నాకు బ్లడ్ ప్రెషర్ పెరిగిపోతోంది. బంగళా చుట్టూ పోలీస్ బందోబస్తు వుంది.

పన్నెండు గంటలు కొడుతోంది గడియారం. బంగళా చుట్టూ తోటలున్నాయి. తోటలో బాంబు ప్రేలిన శబ్దమయింది. బంగళా చుట్టూ ఆవరణలోనూ, చెట్ల మధ్యా పొగలు రేగాయి. సబ్ ఇన్ స్పెక్టర్ కిటికీలోంచి చూశాడు. దూరంగా చెట్లమధ్య కారు ఆగివుందట. ఆయన మెట్ల మీదుగా గబగబ దిగాడు.

నాకు గుండెలు గుబగుబలాడాయి

నా భార్య పక్కగదిలో ఎప్పటిలాగానే మంచంమీద పడివుంది. ఆమెకి ఆందోళనతో స్పృహతప్పింది. అక్కడ పనివాడు వున్నాడు. ఆమెకు ఏం కావలసి వచ్చినా చూస్తాడు.

గదిలోకి ఎటునుండి ప్రవేశించాడో, సబ్ ఇన్ స్పెక్టర్ కళ్ళు యెలా కప్పగలిగాడోగానీ అతడు పిస్తోలుతో ప్రవేశించాడు. పిస్తోలుకు యింత పొడుగున సైలెన్సర్ కూడా బిగించి వుంది.

అతడు లోపలికి వస్తూనే నా గుండెలకు పిస్తోలు గురి పెట్టాడు.

"రెండు లక్షలు కాదు: నాలుగు లక్షలు యిస్తావా? బాబును ఎత్తుకుపొమ్మంటావా?" అన్నాడు.

అతడి గొంతు మళయాళీ యాసతో వుంది.

"నా ...లు....గు....లక్షలా?" అన్నాను. నాకు గొంతు తడారిపోయింది. వీడెవడో అసాధ్యుడు. ఇంత మంది పోలీసు బలగం కాపలా వున్నప్పటికీ వీడు నిర్భయంగా

లోపలికి వచ్చాడు.

"ఆలోచించుకో!" అరిచాడతడు.

"ఇంట్లో రెండు లక్షలు మాత్రమే వున్నాయి!" అన్నాను.

అంతే! వాడు బాబుతో కలిసి మెట్లుదిగాడు. ఆశ్చర్యం! అతడు అటే వచ్చాడు. అటే వెళ్తున్నాడు. కనీసం ఇప్పుడయినా అతడికి సబ్ఇన్‌స్పెక్టర్ ఎదురయితే బాగుండును.

ఇదంతా క్షణాలలో జరిగిపోయింది. నాలోంచి శక్తిని, తిరగబడే వుత్సాహాన్నీ ఎవరో లాక్కున్నట్టయిపోయింది. సబ్ఇన్‌స్పెక్టర్ వచ్చేటప్పటికి నిస్త్రాణగా పడిపోయి వున్నానట!"

"బలరాంగారూ!" శిరీష్ కలుగచేసుకున్నాడు. "మీ పనివాడు అలీ ఏమయినాడు?" అన్నాడు.

"నన్ను పిస్తోలుతో కవర్ చేస్తున్నపుడే దుండగుడి మీద తిరగబడాలనుకున్నాడట! బాబుకుగానీ, నాకుగానీ అపకారం జరగొచ్చునని సంశయించాడట! దుండగుడు బాబుతో కిందకు దిగుతున్నప్పుడు అతడి వెనుక నడిచాడట! దుండగుడు మా యింట్లో కింద గదిలో వున్న రహస్య ద్వారం తెరచి తలుపు మూశాడట?"

"సబ్ఇన్‌స్పెక్టర్ ఏమయాడు?"

"కారు కనిపించిన దిశగా తన సిబ్బందిని తీసుకుని వెళ్ళాడు."

"కారులో ఎవరయినా వచ్చారా?"

"ఎవరూ లేరు. సిటీలోకి పోయేరోడ్డు మీద కారు— అంతే మరో కారు ప్రత్యక్ష్యమయిందని సబ్ఇన్‌స్పెక్టర్ చెప్పాడు. కారులో నా బాబు అతడికి కనిపించాడట! పోలీసులు అటు వాహనాలతో వెంబడించారు. ఖాళీగావున్న

కారు బీచ్‌లో దొరికింది!"

శిరీష్ నుదురు చిట్లించాడు. "అదే కారులో మీ బాబును ఎత్తుకుపోయారు కదా!" అన్నాడు.

"అవును సార్."

"మీ యింటి ఆవరణలో నిలిచిపోయివున్న కారూ, బీచ్‌లో వదిలిపెట్టిన కారూ ఎవరివో తెలిశాయా?"

"నాకు తెలియదండి!"

"పోలీసులు ఏమంటారు?"

"నా దగ్గర స్టేట్‌మెంట్ తీసుకున్నారు. బాబుకోసం యింకా గాలిస్తున్నారు. నేను పోలీస్టేషన్ నుండి యిటే తిన్నగా వచ్చేశాను!"

"మీ యింట్లో కింద రహస్యద్వారం వున్నదన్నారు. ఆ సంగతి బాబును ఎత్తుకుపోయినవాడికి బాగా తెలుసు!"

"అవును సార్! నాకు వుత్తరాలు అందించడానికికూడా ఆ మార్గాన్నే వుపయోగించి వుంటాడు!"

"పనిలో పని! బెదిరింపు లేఖలు తెచ్చారా?"

"పోలీసులవద్ద వున్నాయి సార్!"

"మీ యిల్లు చూడాలి. మీ శ్రీమతిగారితోనూ, అలీతోనూ మాట్లాడాలి! వెళ్దామా?"

"తప్పకుండా సార్! తీసుకువెళ్దామనే వచ్చానసలు! సార్! బాబు లేనిదే మేమిద్దరమూ బతకలేం! నాలుగులక్షలు యిచ్చి అయినా బాబును తిరిగి సంపాదించాలి సార్! మీ ఋణం వుంచుకోను. మాకు ప్రాణభిక్ష పెట్టండి!" బలరాం గొంతు వణికింది.

2

కింద హాలులో కూర్చున్నాడు డిటెక్టివ్ శిరీష్. అతడికి ఎదురుగా బలరాం, అతడి భార్య జయంతి కూర్చున్నారు.

చేతులు కట్టుకుని అలీ నిల్చుని వున్నాడు. డిటెక్టివ్ శిరీష్ చిరునవ్వుతో ముగ్గురినీ పరికించి లేచి నిలబడ్డాడు.

"జయంతిగారూ! మీరు మీ గదిలో వుండండి! అవసరం అనుకుంటే ప్రశ్నలడిగి తెలుసుకోవడానికి వస్తాను" అన్నాడు శిరీష్.

జయంతి తలూపింది. మెట్లెక్కి వెళ్ళిపోయింది.

"రహస్యద్వారం చూపిస్తారా?" అడిగాడు శిరీష్.

అలీ మెయిన్‌హాలు గోడవద్దకు నడిచాడు. గోడ తడిమి ఎక్కడో ఒత్తాడు. హాలు గోడలో దీర్ఘచతురస్రాకారపు తలుపు ప్రక్కకు తప్పుకుంది. బలరాం ముందుగా దారి తీశాడు. తరువాత డిటెక్టివ్ శిరీష్ ప్రవేశించాడు.

చిన్నసైజు గది అది. ఒక ప్రక్కగా పైకి మెట్లున్నాయి. నాలుగే నాలుగు మెట్లు. చివర చిన్న గుమ్మం వుంది.

"ఆ గుమ్మంలోంచి బయటికి వెళ్తే యింటివెనక తోటలోకి దారి వుంటుంది. బాబును ఎత్తుకుపోయిన కారు అక్కడినుండే బయలుదేరి వుంటుంది" అన్నాడు బలరాం.

"అంటే....ఒక కారుమీదకు మీ దృష్టి మరల్చి మరో కారులో బాబును ఎత్తుకుపోయారన్న మాట!"

"అంతేగదా సార్! అలాగే జరిగింది."

"రహస్యద్వారం లోంచి కారులో వచ్చిన వ్యక్తి మీ బాబును ఎత్తుకుపోయాడు. బాబును కారులో వుంచి అతడు పారిపోయినట్టు మాత్రం నిర్ధారణ ఏమిటి? అక్కడకూడా మిమ్మల్ని బురిడీ కొట్టించి వుండవచ్చు కదా!"

బలరామ్ కొన్ని క్షణాలపాటు నిర్ఘాంతపోయాడు. అంతలోనే సులువుగా తేరుకున్నాడు.

"నిజమే సార్!"

"పోలీసులు ఆ కారును వెంటాడి వుంటారు. కారు గురించి పోలీసులు ఏం చెప్పారు?"

"రెండుమూడు వీధులు దాటి కారు మాయమైపోయిందట సార్!"

"అంటే పోలీసుల చేతికి దుండగుడు దొరకలేదు కారు మాత్రం బీచ్ వద్ద దొరికింది!"

"అవును సార్! అలాగే జరిగింది."

చిన్నసైజు గదిని పరీక్షగా చూశాడు శిరీష్. గది ఖాళీగా వుంది. గదిలో దుమ్ములేదు. శుభ్రంగా తుడిచి బూజులు దులిపి వుంది.

"బలరామ్‌గారూ! మీరూ, అలీ తోటలోకి వెళ్ళి మీరు చూచిన మొదటి కారు ఎక్కడ వున్నదో గుర్తించండి. ఆ స్థలంలో రాళ్ళు పెట్టండి! తరువాత రెండో కారు ఎక్కడినుండి బయల్దేరిందో కనిపెట్టవచ్చును!" అన్నాడు శిరీష్.

బలరాం అతడివైపు అదో రకంగా చూచి, "అలీ ఒక్కడు వెళ్తే చాలదంటారా?" అన్నాడు.

శిరీష్ నవ్వి "ఒక బుర్రకు మరో బుర్ర తోడు!" అన్నాడు.

బలరాం బలవంతంగా నవ్వు తెచ్చుకుని అక్కడినుండి కదిలాడు. అలీ అతడిని వెంబడించాడు. డిటెక్టివ్ శిరీష్ వాళ్ళు దరిదాపులలో లేరని నిర్ధారించుకున్న తర్వాత గదిలో పరీక్షగా చూశాడు. గోడ వారగా వెళ్ళి నేలమీదకు వంగాడు.

నేలమీద గోధుమరంగు పౌడర్ వంటి పదార్థం చల్లినట్టుగా వుంది. శిరీష్ వ్రేలితో అందుకుని వాసన చూశాడు. నుదురు చిట్లించాడు. పౌడర్‌కి ఒక అడుగు దూరంలో

అంగుళన్నర వ్యాసార్ధంతో వృత్తం వుంది. ఆ వృత్తం తెల్లటి పదార్థం గచ్చుమీదకు కారడం వలన ఏర్పడిన వృత్తంలాగా వుంది. వృత్తం ఏర్పడిన పదార్థం వ్రేలితో తాకిచూశాడు. తరువాత మెట్లు ఎక్కి తోటలోకి వచ్చాడు.

తోట ఆవరణలో బలరామ్, ఆలీ తమ పనిలో నిమగ్నమై వున్నారు. శిరీష్ ముందుకు వెళ్ళి బలరామ్‌ను కలిశాడు.

రెండు కారులూ ఒకదానికొకటి సంబంధం లేని ప్రదేశాలలో ఆగాయి. బలరాం దృష్టిని మళ్ళించిన కారు ఫియట్. ఇక బాబును ఎత్తుకుపోయిన కారు ఏమిటో తనకు తెలియదన్నాడు బలరాం. బలరాం వుపయోగించే కారు ప్లైమత్!

"ఆలీ! దుండగుడు ఎలా వుంటాడో చెప్పగలవా?" అడిగాడు శిరీష్.

"సన్నగా పొడగ్గా వుంటాడు సార్! కళ్ళకు చత్వారం అద్దాలున్నాయి. పిస్తోలు పట్టుకుని అయ్యగారినీ, చిన్నయ్యగారినీ గురిపెట్టి నిలబడి వున్నాడు కాబట్టి నేనేమీ చేయలేకపోయాను సార్! అక్కడికి అతడి వెనక నడిచాను. చెయ్యి కదిపితే బాబును కాల్చి పారేస్తాడని భయపడ్డాను" అన్నాడు ఆలీ.

డిటెక్టివ్ శిరీష్ అతడివైపు పరిశీలనగా చూశాడు. ఆలీ బలంగా కండలు తిరిగి వున్నాడు. కోరమీసాలు. ఎర్రటి కళ్ళు. ఖారా కిళ్ళీతో ఎర్రబడిన పళ్ళూ, మెడలో కిళ్ళీమరక అయిన జేబురుమాలూ.... తెలుగు సినిమా చిన్నసైజు విలన్‌లాగా వున్నాడు. చిన్న కుర్రవాడిని సాకవలసిన సాత్త్వికుడిలాగా లేడు.

"బాబును ఎత్తుకు పోయిన దుర్మార్గుడు రహస్య మార్గంలో ప్రవేశించాడు. తర్వాత నువు ఏంచేశావు

ఆలీ?"

"తలుపు తెరవాలని ప్రయత్నించాను సార్! అవతల ప్రక్క తాళం పెట్టివుంటాడు అతడు. తెరచుకోలేదు. బిల్డింగ్ చుట్టూ తిరిగి తోటలోకి పరుగెత్తాను. పరుగెత్తుతూనే పోలీసులకు చెప్పాను."

"తోట వెనుక కారు చూశావా?"

"కారు అప్పటికే బయల్దేరింది సార్! వెనుక కిటికీ లోంచి బాబు జుత్తు ఎగురుతోంది. గుర్తుపట్టాను."

"ఏ రకం కారు అది?"

"సిమెంట్ రంగు అంబాసిడర్ సార్!"

"గుర్తు పట్టావా?"

"అవును సార్! కాని నెంబర్ చూడలేదు సార్!"

"మీ అయ్యగారికి కారు గురించి చెప్పలేదా?"

"లేదు సార్! పోలీసు స్టేషన్‌కి ఆయన వెళ్ళారు. ఇంట్లో అమ్మగారివద్ద కాపలాగా నేనున్నాను."

"ఆటుతర్వాత చెప్పుకోవలసిన సంఘటన లేమైనా జరిగాయా?"

"ఏమీ జరగలేదు సార్!"

"వారం రోజులుగా మీ అయ్యగారికి బెదిరింపు వుత్తరాలు అందుతున్నాయి. పడకగదిలోకి బెదిరిస్తోన్న పెద్ద మనిషి నీకు తెలియకుండా ప్రవేశించడానికి వీలుండదు. అవునా!"

"ఎందుకు వుండదు సార్? నాకు వూపిరి సలపని పని వుంటుంది. వాడెవడో మా అయ్యగారి బంగాళాను బాగా కనిపెట్టాడు సార్!"

"అతడిని అంతకుముందు యింకెక్కడయినా చూశావా ఆలీ?"

"లేదుసార్! బాబును ఎత్తుకుపోతున్నప్పుడు మాత్రమే చూశాను."

డిటెక్టివ్ శిరీష్ యింట్లో ప్రవేశించాడు. మెట్లెక్కి జయంతి గదిలోకి వెళ్ళాడు. ఆమె తలగడలో మొహం దూర్చి రోదిస్తోంది.

డిటెక్టివ్ శిరీష్ ఆమెను కొన్ని ప్రశ్నలడిగి ఓదార్చి కిందకు దిగిపోయాడు.

ఆమె దుండగుడిని అసలు చూడలేదట!

బలరాం వద్ద సెలవుతీసుకుని పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళాడు.

3

"నాకు చాలా విచిత్రంగా వుంది మిస్టర్ శిరీష్!" అన్నాడు ఎస్ ఐ సౌజన్యారావ్.

"చెప్పండి"

"బీచ్‌లో దొరికిన కారు అంబాసిడర్. బలరాం గారి బంగళాలో దొరికిన కారు ఫియట్. ఈ రెండు కారులూ క్రితంరోజు అపహరించినవే. ఈ కారులగురించి మావద్ద ఫిర్యాదులున్నాయి."

"దీంట్లో విచిత్రం ఏముంది? దుండగులు అపహరించిన కారులలోనే రావడం అతి సాధారణంగా జరుగుతున్న విషయం గదా!"

"నా వుద్దేశ్యం వేరు మిస్టర్ శిరీష్! మా దృష్టి ఒక కారుమీదకు మళ్ళించారు. రెండో కారులో రవీంద్రను ఎత్తుకుపోయారు. రవీంద్రవద్ద అంతసేపూ నేను పిస్తోలు పట్టుకుని కాపలా వున్నాను. ఆవరణలో పొగబాంబు పేలింది. నా సిబ్బందికి సూచనలివ్వడానికి కిందకు దిగాను"

"అడ్డం వచ్చినందుకు క్షమించండి! ఆలీ అప్పుడు ఎక్కడ వున్నాడు?"

"ఆలీయా? ఓ....బలరాంగారి యింట్లో పనివాడా? అతడు నాకు ఆ సమయంలో ఎక్కడవున్నాడో కనిపించనే లేదు" అన్నాడు ఎస్.ఐ.

"బలరాంకు అందిన వుత్తరాలు మీవద్ద వున్నాయట. ఒకసారి చూపిస్తారా?"

ఎస్ ఐ సౌజన్యారావు తలూపి, "తప్పకుండా మిస్టర్ శిరీష్!" అన్నాడు. తర్వాత బల్ల సొరుగు లాగి ఉత్తరా లందించాడు.

ఉత్తరాలు మామూలు తెల్లకాగితాలమీద రాసివున్నాయి. రాత గజిబిజిగా వున్నా, స్పష్టంగా అర్థమవుతోంది. ఉత్త రాలలో బలరాం చెప్పిన విషయాల కంటె కొత్త విష యాలు లేవు.

వాటిని తిరిగి ఎస్ ఐ. కి అందించాడు.

4

టెలిఫోన్ గణగణలాడింది. శిరీష్ రిసీవరందుకున్నాడు. అవతలప్రక్క బలరాం పలికాడు.

"సార్! ఇప్పుడే ఫోన్ వచ్చింది. నాలుగు లక్షల రూపాయలు—అన్నీ వందరూపాయ నోట్ల రూపంలో పాక్ చేసి బీచ్ లో పట్టుకుని నిలబడమని ఫోన్ చేశాడు. అత డిని ఏమాత్రం వెంటాడినట్టు తెలిసినా నా బాబుకు అపకారం జరుగుతుందని హెచ్చరించాడు" అన్నాడు బలరాం

"మీరేం చెప్పారు మిస్టర్ బలరాం?" అడిగాడు శిరీష్

"నా బాబును నాకు తిరిగి ఎప్పుడు అందిస్తారని అడి గాను డబ్బు అందిన గంట తర్వాత నా బాబు యెక్కడ వుంటాడో ఫోన్ చేస్తారట!"

"వెరీగుడ్!"

"ఏం చెయ్యమంటారు సార్!"

"అతడికి డబ్బు చెల్లించండి. తర్వాత చూసుకుందాం!"

"అదేమిటి సార్? నాలుగులక్షల రూపాయలు! ఒకటి రెండూ కాదు!"

"మీ లక్షలు ఎటూ పోవు తిరిగి మీ అక్కౌంట్ కే జమ అవుతాయి! నోట్ల నెంబర్లు భద్రపరిస్తే చాలు!"

"అలాగే సార్!"

"నోట్లు యిచ్చాక నాకు ఫోన్ చేయండి చాలు!"

"థాంక్స్ సార్!"

శిరీష్ రిసీవర్ క్రెడిల్ చేసి నిట్టూర్చాడు.

తరువాత కారెక్కి బలరాం బంగళా ముందు దిగాడు. జయంతి శాలువా కప్పుకుని ముందు వరండాలో యెదురు చూస్తోంది.

"రండి; రండి! మీరా?" అంది జయంతి.

శిరీష్ మందహాసంచేసి "బలరాం గారు డబ్బు యిచ్చి రావడానికి వెళ్ళినట్టున్నారు" అన్నాడు.

"అవును శిరీష్‌గారూ!"

"నంబర్లు నోట్ చేశారా బలరాం గారు?"

"నోట్ చేస్తానన్నారు."

"ఆలీని వెంటపెట్టుకు వెళ్ళారా?"

"లేదు శిరీష్‌గారూ! ఆలీ నిన్న సాయంత్రమే వాళ్ళ గ్రామం వెళ్ళాడు."

"అలాగా!"

"కూర్చోండి శిరీష్‌గారూ! కాఫీ తీసుకువస్తాను!" ఆమె లోపలికి వెళ్ళింది.

డిటెక్టివ్ శిరీష్ తోటలోకి నడిచాడు. తోటంతా తిరిగి

చూశాడు. తోటమాలి నవ్వుతూ చూశాడు.

"మీ అయ్యగారు ఏం వ్యాపారం చేస్తున్నారో నీకు తెలుసా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"యిళ్ళు కట్టిస్తారు బాబా! యీ మధ్య ఎందుకనో ఆ పనిమీద అయ్యగారు వెళ్ళడంలేదు" అన్నాడు తోటమాలి.

"నీవిక్కడ ఎంతకాలంగా పనిచేస్తున్నావ్?"

"ఏడేళ్ళపైన అయింది బాబు."

"రండి శిరీష్‌గారూ!" వరండాలోంచి పిలిచింది జయంతి.

శిరీష్ అటు కదిలాడు కాఫీ తాగాడు.

"ఒక్కసారి మీవారి ఆఫీస్‌గది చూపిస్తారా?" అడిగాడు శిరీష్.

జయంతి తలూపింది.

5

అరగంట తర్వాత డిటెక్టివ్ శిరీష్ కారులో వున్నాడు. వాచీ చూసుకున్నాడు. బలరాం వెళ్ళి యిప్పటికి గంట అవుతోంది.

రోడ్డుమీద అతి జాగ్రత్తగా చూసుకుంటూ, నిశితంగా పరిశీలించుకుంటూ, కారు నడుపుతున్నాడు శిరీష్. అతడిని అప్పుడు ఎవరయినా చూచివుంటే ఒక అపరాధ పరిశోధకుడిలాగా లేడు. అతడి వాహనంకూడా మామూలుగావున్న అంబాసిడర్. అతడు సహజంగా తోలుకునే డాట్సన్‌కారు కాదు. మామూలు అంబాసిడర్‌ను ఎవరికో సంబంధించిన కార్ డ్రయివర్ నడుపుతున్నట్టుగా నడుపుతున్నాడు.

నగరం దాటాక వచ్చే మొదటిపల్లె అది; ఆ పల్లెకు యివతల కారు ఆపాడు. బోనెట్ఎత్తి మరమ్మత్తు చేసు

కుంటూ అటూ ఇటూ చూస్తున్నాడు. రోడ్డుమీద దూరంగా ప్లైమత్ కారు కనిపించింది.

శిరీష్ ఓరకంట ప్లైమత్‌ను దృష్టిలో వుంచుకున్నాడు. ప్లైమత్ అతడిని దాటి వేగంగా వెళ్ళింది. పల్లెలో రోడ్డు మీద ఆగింది. కారులోంచి అతడు దిగాడు. ఒకమాదిరి డాబాయింటిముందుకు నడిచాడు.

డిటెక్టివ్ శిరీష్ బోనెట్ మూసి డాబా యింటివైపు కదిలాడు.

డాబాయింట్లో ప్లైమత్ మీద వచ్చినవాడు ఒక పిల్లవాడిని ఒడిలో కూర్చుండబెట్టుకున్నాడు. అతడి భుజాల మీద చెయ్యివేసి ఒక యువతి నిలబడివుంది. అతడూ ఆమె నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. పిల్లవాడు ఐస్ క్రీం తింటున్నాడు.

"డబ్బు ముట్టినట్టు ఆలీ యిప్పుడే ఫోన్ చేశాడు" అన్నదామె.

అతడు తలూపాడు "పోలీసులకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. బ్లాక్ మెయిలర్‌ను పట్టుకుంటానని అనలేదు వాళ్ళు: డబ్బు యివ్వవద్దూ అనలేదు" అన్నాడు.

డిటెక్టివ్ శిరీష్ తల తిప్పబోయాడు. అప్పటికే అతడి మెడ వెనకవున్న వాడి చేతులలో ఇరుక్కుపోయింది. కిటికీ వద్ద నిలబడి ఇక లోపలవున్న వాళ్ళను చూడటానికి అతడికి సాధ్యపడటంలేదు.

శిరీష్ అలాగే తల తిప్పిచూశాడు. రోడ్డు కొద్దిగా కనిపించింది. రోడ్డుమీద స్కూటర్ ఆగివుంది.

శిరీష్ నుదురు చిట్లించాడు. తనను వెనకనుండి పట్టు

కున్నవాడు స్కూటర్‌మీద వచ్చాడు.

"అలీ!" అన్నాడు శిరీష్

మెడమీదపట్టు క్షణంలో వెయ్యోవంతు సడలింది. ఆ వెసులుబాటు చాలు శిరీష్‌కు. చేతులు ముడిచి రెండూ వొక్కసారిగా వెనక్కి గుచ్చాడు. మెడమీద అలీపట్టు సడలింది.

డిటెక్టివ్ శిరీష్ అకస్మాత్తుగా వెనక్కి తిరిగాడు.

ఎక్కడ తగులుతోందో, ఎలా తగులుతోందో చూసుకో కుండా బలంగా తన్నాడు. అలీ వెనక్కి తుళ్ళాడు. కట్టె విరిగి పడినట్టు వెల్లకితలా పడ్డాడు.

దబ్బున శబ్దమయింది. శిరీష్ ముందుకు దూకి అతడిని మొహంమీద తన్నాడు. అలీ స్పృహతప్పి పడిపోయాడు.

"ఎవరది?" గదిలోంచి అతడు ముందుకు వచ్చాడు.

"మిస్టర్ బలరాం" శిరీష్ అతడి ముందుకు దూకాడు.

"మీరా?" ఆశ్చర్యపోయాడు బలరాం.

"మిస్టర్ బలరాం! ఎవరినీ ఎల్లకాలమూ మోసం చేయ లేరు."

"మీకు అంతా తెలిసిపోయిందా?"

"ఇప్పుడేకాదు: నేను మొదటిసారి మీ యింటికి వచ్చి నప్పుడే మీ కట్టుకధ నన్ను ఆకట్టుకుంది. దుండగుడు మీకూ, అలీకీ తప్ప ఎవరికీ కనిపించలేదు. ప్రక్కగదిలోనే వున్న మీ భార్య జయంతికి కూడా కనిపించలేదు.

ఉత్తరాలు నేరుగా మీ పడకగదిలోనే ప్రత్యక్షం కావడం ఏమిటి?

రహస్యమార్గంలో నేలమీద బిస్కట్లు చిదిపినప్పుడు రాలే రజనూ, ఐస్‌క్రీం నేలమీదవుంచితే పడే ఆనవాలూ

కావడం ఏమిటి?

రవీంద్రను ఎత్తుకుపోయినవాళ్లు అతడికి బాగా కావలసిన వాళ్ళు కావడమే యిందుకు జవాబు। ఆ కావలసినవాళ్ళకు సివిల్ కంట్రాక్ట్సులో నష్టం రావడం మరో జవాబు। కావలసిన వాళ్ళకు ఆస్తివున్న రోగిష్టి భార్యవుండటమూ, తద్వారా ఆకర్షణీయమైన మరో సదుపాయం వెనుకోవ్వడమూ, సదరు సదుపాయం లక్షల బహుమతి కోరడమూ జవాబుదారీలు। అర్ధమయిందా మిస్టర్ బలరాం।"

బలరాం కోపంగా చూస్తున్నాడు.

"పోలీసులను మభ్యపెట్టిన నేరానికి కటకటాలను అంతకంటె తీక్షణంగా లెక్కపెట్టవలసి వుంటుంది।" నవ్వాడు శిరీష్. □

పోస్టరు ప్రయోజనం!

ఆ గోడకెందుకు బాబూ! ఈ తడిక తలుపుకు అంటించు కుక్కల దోపిడిని అరికట్టండి



నేరకళా నైపుణ్యం

చంద్రశేఖర ఆజాద్

ప్రసాద్ టూర్‌మీద వస్తున్నాడనే వార్త నాకు సంతోషాన్ని కలిగించింది.

అంతకుముందు హైదరాబాద్‌లో మేము కలిపి పని చేశాం. మా స్నేహం 'ఓరేయ్' అని పిలుచుకునేదాకా ఎదిగింది. ఆ తర్వాత వాడికి విజయవాడ ట్రాన్స్ఫర్ అయింది.

నేను ఇక్కడపడ్డాను. ఒకసారి ఉద్యోగంలో చేరాక ఎక్కడకు వెళ్ళమంటే అక్కడకు వెళ్ళి పనిచేయాలి. లేకుంటే రాజీనామా చెయ్యాలి.

మా ఆఫీసులో అయితే తరచుగా బదిలీలు జరుగుతుంటాయి. మూడు నెలలకోసారి ట్రాన్స్ఫర్ అయిన వారున్నారు అదే సమయంలో యుగాలుగా ఆయా ప్రాంతాల్లో, సీట్లలో పాతుకుపోయినవారున్నారు. కొద్దిరోజులు ఇబ్బంది అనిపించినా ఆ తర్వాత అలవాటయిపోతుంది. ఇక్కడ జీవితం మరీ రొటీన్‌గా తయారయింది.

అందుకే ప్రసాద్ వస్తున్నాడంటే అంత ఉత్సాహం.

ఆర్డరు వచ్చిన మూడోరోజుకల్లా ప్రసాద్ రావటం జరిగిపోయింది. ఆ రోజే నాకు "అపన" వచ్చింది. ఇంకా సీజన్ ప్రారంభంకాలేదు. పనేం లేకపోవటంతో చదువుతూ కూర్చున్నాను.

"ఏరా మీకు జీతాలిస్తుంది ఆఫీసుల్లో పుస్తకాలు చదవటానికా" అంటూ వచ్చాడు ప్రసాద్.

"రా....రా....ఎప్పుడు రావటం"

"ఇప్పుడేరా బస్‌లోవచ్చాను. ఫోన్‌చేస్తే ఎంగేజ్ వచ్చింది. రిక్షాలో బయలుదేరి వచ్చాను." అన్నాడు ప్రసాద్.

"ఏమిటి మీ ఆఫీస్ విశేషాలు?"

"ఏమున్నాయి మామూలే. ఇక్కడ ఎలాఉంది పరిస్థితి?"

"టేబుల్ టేబుల్‌కూ నడుమ రాజకీయాలున్నాయి. ఇక్కడ మేనేజర్‌గారికి ఆయన కులం అంటే మహాభిమానం."

"నాచురల్"

"వాళ్ళేం చేసినా భరిస్తాడు. మిగతావాళ్ళమీద మాత్రం

ఎగిరెగిరిపడతాడు"

"ఏమన్నా మెమోలుగట్రా ఇచ్చాడా!"

"లేదులే. సర్లే ఈ గొడవలకేంలే ఎక్కడపడినా ఉంటాయి. మీపిల్లలు బావున్నారా" అన్నాను.

"మా రెండోవాడు బాగా ఏడుస్తున్నాడురా. నా దగ్గర వాడికి బాగా అలవాటయింది"

"ఎప్పుడూ అంతగా అలవాటు చెయ్యకూడదురా. ఇప్పుడు చూడు" అన్నాను.

"మెడికల్‌లీవ్ పెడదామనుకున్నాను. యం.డి.గారు సీరియస్‌గా ఉన్నారు. రాక తప్పలేదు"

"టూర్‌లో రావటానికి ఇబ్బందేమిటిరా"

"ఇబ్బందికాక ఏమిటిరా. ఇక్కడ నీళ్ళుత్రాగితే జబ్బులొస్తాయటగా"

"మేం కూడా మనుషులమేరా బాబు....ముందు రిపోర్టు చేపిరా" అన్నాను.

వాడు మేనేజర్‌తో మాట్లాడి, జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చాడు.

"ఏం పుస్తకంరా అది?" అన్నాడు.

"అపరాధ పరిశోధన"

"ఇలాంటి సాహిత్యం చదువుతున్నావేమిటి?"

"ఎలాంటి సాహిత్యం చదవాలంటావ్" అన్నాను.

"ఏవో మంచి నావెల్స్"

"అదేరా ఏవి మంచి నావెల్సో చెప్పు"

వాడు ఏవి మంచినవల్లో, ఏవికావో చెప్పలేకపోయాడు.

"నేను ఇదొక్కటే చదవను. అన్ని రకాల సాహిత్యం చదువుతాను. ఈ నడుమ సైకొఎనాలిసిస్ పేరుతో కొన్ని నవలలొస్తున్నాయి. చదివావా" అన్నాను.

"లేమరా" అన్నాడు.

"అసలు నువ్వు చదివిన నవలల పేర్లు చెప్పు" అనడిగాను.

ఏవో పాప్యులర్ నవలల పేర్లు చెప్పాడు.

"వాటికంటే ఇదేం తీసిపోదు. ఏ సాహిత్యమైనా చదవకుండా ఉండలేం. వాటిల్లో కొన్ని ప్లస్‌పాయింట్లు కొన్ని మైనస్‌పాయింట్లు ఉంటాయి. ఒక్క విషయం మాత్రం వాస్తవం. దీన్ని గుడ్డిగా అనుకరించినా ఫలితం దారుణంగానే ఉంటుంది. నేను ఈ పుస్తకాల్ని లాజిక్ అలవర్చుకోవటం కోసం చదువుతున్నాను" అని చెప్పాను.

"ఇలాంటి సాహిత్యం చదివే నేరాలు చేస్తున్నారు"

"ఈ సాహిత్యం చదివి నేరస్థుల్ని పట్టుకున్నవారు అనేకం ఉన్నారు."

ఫోన్ మ్రోగింది.

ఇద్దరం మాట్లాడటం ఆపి చెవులు రిక్కించాం. మేనేజర్ మాట్లాడటం వినపడుతూనే వుంది.

"ఆఁ ఉన్నారు. వన్ మినిట్ ...మిస్టర్ ప్రసాద్" అంటూ పిలిచాడు. ప్రసాద్ వెళ్ళి మాట్లాడి వచ్చాడు.

"అప్పుడే ఎవ్వరానాయన"

"ఇంకెవరు. శ్రీమతే" అన్నాడు నీరసంగా.

"ఏమయిందిరా"

"నేను వచ్చిన దగ్గర్నుండి వాదేడుస్తూనే ఉన్నాదట"

"బాగా అలవాటయిందన్నమాట....చూశావా ప్రేమ కూడా ప్రమాదమే. అంతమాత్రాన ప్రేమించకూడదని నేనన ననుకో"

"దానికీ దీనికి సంబంధం ఏమిటోయ్"

"సంబంధం ఉందనుకుంటే వుంది. లేదనుకుంటే

లేదు"

"అది సరేరా. ఇప్పుడేం చెయ్యమంటావ్"

"సాయంకాలం ఫోన్ చేద్దాం. అంతగా గొడవ ఆపక పోతే అప్పుడాలోచించొచ్చు" అన్నాను.

"కరక్టే" అన్నాడు

మా సంభాషణ అంతటితో ముగిసింది.

ప్రసాద్ నేకాదు. ఇంకా చాలామందిని చూశాను. 'శవ సాహిత్యం' అని ఓ స్వీపింగ్ కామెంట్ విసరటం తప్పించి సరిగ్గా చర్చించరు. దేశంలో ఒకరో, ఇద్దరో ఈ సాహిత్యం ప్రభావంతో నేరాలుచేసి ఉండొచ్చు. ఆ మాట కొస్తే అన్నిరకాల సాహిత్యాల్ని చదివి చెడ్డఫలితాల్ని చూపించినవారున్నారు.

ఈ సాహిత్యంపై సరైన విమర్శ చేసే వారెవరినైనా ఆహ్వానించవచ్చు. అంతేగాని ఫ్యాషన్‌కోసం మాట్లాడే వాళ్ళు రాత్రిపూట చదివేది ఇలాంటివాటినే. అందుకు కారణం-చదివింపచేసే శక్తి వాటికుంది కనకనే. ప్రసాద్ చదివిన 'మంచి' నవలలుగాని, వాటిని ప్రచురించిన పత్రికలుగాని 'అపరాధపరిశోధన' బాణీనే అనుకరిస్తున్నాయనేది ఓ నగ్నసత్యం.

దేశంలోగాని, ప్రపంచంలోగాని నేరం ఏ ఏ మూలల్లో దాగుందో ఎంతటి విచిత్రమైన వ్యక్తులున్నారో తెలుసుకోవాలంటే ఇలాంటి పుస్తకాలు చదవాల్సిందే!

2

ఆఫీస్ వదిలాక ఇద్దరం నటరాజ్ హోటల్లో కాఫీ తాగాం. ఆ తర్వాత కొంచెంసేపు పార్కులో కూర్చుని కబుర్లు చెప్పుకున్నాం. ఏడుగంటలు దాటుతుండగా ఫోన్ చేయటాని కెళ్ళాం.

యస్ టి.డి. చేయాలనుకున్నాం. మేం వెళ్లేటప్పటికి ఇద్దరు కూర్చున్నారు.

"ఏం కావాలండి" అనడిగాడు ఆపరేటర్.

"విజయవాడ కాలొకటి చెయ్యాలి"

"కూర్చోండి" అన్నాడు.

మేం కూర్చున్నాం.

అతను రింగ్‌చేసి మా ప్రక్కనున్నాయనకిచ్చాడు. ఆయన వ్యాపారానికి చెందిన వివరాలేవో అడుగుతున్నాడు. బ్రోకర్ అనుకుంటాను. ఏ లారీ ఎంతరేటుంది వివరంగా అడిగి రాసుకున్నాడు. ఫోన్ పెట్టేశాక....

"మొత్తంకలిసి ఇరవైతొమ్మిదిన్నర అయింది" అన్నాడు.

అంటే ఆయన అంతకుముందు ఓకాల్ చేసివుండొచ్చు.

అతను క్రొత్త పదిరూపాయలనోట్లు మూడు ఇచ్చాడు.

"ఎక్కడనుండి తెస్తున్నారండి ఇంత మంచినోట్లు. మాకు జీతాలరోజున కూడా దరిద్రపు కాయితాలు ఇస్తున్నారు" అన్నాడు వాటిని మడిచి జేబులో పెట్టుకుంటూ.

"చిల్లర ఉంచండి" అంటూ అతను హడావుడిగా వెళ్ళిపోయాడు.

"విజయవాడ ట్రైచెయ్యండి" అంటూ ఫోన్ఇచ్చాడు.

ప్రసాద్ డయల్‌చేయటం ప్రారంభించాడు.

"అసలు ఇంత దరిద్రపు కాయితాలు రావటం ఏమిటండి. ఉద్యోగస్తులకి నెలరోజులూ పనిచేసి ఈ కాయితాలు చూస్తే నీరసంవస్తుంది. ఏం చేస్తాం. ఎవరన్నా మంచి కాయితాలిచ్చినప్పుడు ఈ చెత్తకాయితాల్ని వదిలించుకోవాలి" అన్నాడు.

"నిజమేగురూ. మాకు కూడా మంచికాయితాలు రావ

టంలేదు. ఎప్పుడో నాలుగయిదు నెలలకుగాని రావు" అన్నాను.

"ఎంగేజ్‌వస్తుంది" అన్నాడు ప్రసాద్.

"ఇలా ఇవ్వండి" అంటూ తీసుకొని ఆయన ట్రై చేశాడు.

"ఎంగేజండి" అని "నెల్లూరు నెంబరెంతండి" అంటూ ప్రక్కన వారిని అడిగాడు. వాళ్ళు చెప్పారు. నెంబర్ వెంటనే దొరికింది. వాళ్లు మాట్లాడుతున్నారు.

"విజయవాడ బిజీనేనండి బాబు.... మీదేవూరు ఇదేనా" అనడిగాడు.

"విజయవాడేనండి. టూర్ మీదొచ్చాం. ఇంటిదగ్గర నుండి ఫోన్ పిల్లాడేడుస్తున్నాడంటూ" అన్నాడు ప్రసాద్.

"కాల్ అయిపోయింది ఏదీ ముప్పైపైసలివ్వండి" అంటూ బిల్‌రాసి చించిచ్చాడు వాళ్ళు కూడా ఇరవైపైసలు వదిలేసి వెళ్ళిపోయారు.

"మళ్ళీ ట్రైచెయ్యండి" అన్నాడు.

ప్రసాద్ ఆ కార్యక్రమంలో ఉన్నాడు.

"ఏమిటోనండి—మన ఊరని అనుకుంటాంగాని ఎక్కడకు వెళితే అక్కడే బాగుంటుంది. నేనిక్కడకు వచ్చిన క్రొత్తలో వెనక్కి వెళ్ళిపోవాలనుకునేవాడ్ని. ఇప్పుడలా అనిపించటంలేదు. అలవాటయిపోయింది. ఇక్కడనుండి వెళ్ళేవాడు లేడు. అక్కడినుండి వచ్చేవాళ్ళు లేరు. ఉద్యోగస్థులకు యెక్కడయితే ఏమిటండి" అంటూ ప్రశ్నించాడు.

నాకు ఆయన ఫిలాసఫి కూడా సరైనదే అనిపించింది.

"ఏమిటి ఎంగేజనా....ఇలా ఇవ్వండి...." అన్నాడు. నెంబరుకలిపి "మాట్లాడండి" అంటూ ఇచ్చాడు,

"ఏమిటోనండి వచ్చిన దగ్గర్నుండి వ్రేళ్ళు కదులుతూనే వుంటాయి. ఒక్కసారి విజయవాడ వెళితే ఆ పాత స్నేహాలు గుర్తొస్తే.... ఆ రోజులు రావు గదండి ఎంతయినా ఆ చిన్ననాటి రోజులు బంగారం లాంటివి" అంటున్నాడు.

ఆయన కళ్ళుమాత్రం మీటర్‌మీదే వున్నాయి.

ఆయన మాటలు వినగానే నా మనసు బాల్యంలోకి వెళ్ళింది.

"ఎంతసార్" అన్నాడు ప్రసాద్.

"ఎనిమిదీ నలభై పైసలివ్వండి" అన్నాడు బిల్‌రాస్తూ.

"ఎలా వుందట" అడిగాను.

"ఇప్పుడు పడుకొన్నాడట" అన్నాడు డబ్బులిస్తూ.

"అంతేలే. కొంచెంసేపు ఏడ్చినా ఊరుకుంటాడు వారం రోజులన్నా పనిచేయకుండా వెళితే గొడవవుతుంది" అన్నాను.

"నిజమే"

"వెళ్లొస్తామండి" అని అతనికి చెప్పాం

"మంచిది సార్" అన్నాడు.

"ఇంకా నయం. ఈ రాత్రికి వెళ్ళాలనుకొన్నాను" అన్నాడు ప్రసాద్.

నాకెందుకో అసిజీగా వుంది.

"మా ఇంటికి వెళదాం" అన్నాను.

"వెళదాం గాని ఈ యస్.టి.డి. బిల్స్ విచిత్రంగా వస్తుంటాయేమిటి? మొన్న ఓసారి విజయవాడనుండి చేస్తే నాలుగు రూపాయలయింది. ఈరోజు ఎనిమిది రూపాయలయింది" అన్నాడు ప్రసాద్.

నాకు ఓసారి ఆ ఆపరేటర్ సంభాషణాక్రమం మనసులో మెదిలింది. వెంటనే ఆశ్చర్యపోవడం నా వంతయింది.

"యస్ టి డి. బిల్స్ ఎక్కడయినా ఒకటే. మనం చేసే కాలాన్ని బట్టి ఆధారపడి వుంటుంది" అన్నాను.

"ఏం వచ్చిందోలే" అన్నాడు.

"అదే వెధవ లక్షణం. ప్రతి విషయం పట్ల కీన్‌గా వుండటం ముందు అలవాటు చేసుకో. నువ్వాలోచిస్తే నీకో 'క్లూ' దొరుకుతుంది."

"క్లూనా" అన్నాడు ప్రసాద్.

"అవును"

"ఏమిటో చెప్పరా"

"ఆలోచించు"

"నావల్లకాదు చెప్పు"

"ఇంటిదగ్గర చెబుతాను" అన్నాను.

3

భోంచేసి వరండాలో కూర్చున్నాం.

"మొత్తంమీద నీ సాహిత్యం బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు" ఆరోపణతో మొదలయ్యాడు ప్రసాద్.

"అదేమిటి" అన్నాను.

"ఆ చెప్పేదేదో చెప్పేడిస్తే టెంషన్ నుండి బయట పడతాను. అంత సస్పెన్స్ మైంటైన్ చెయ్యాలా ఏమిటి?"

నాకు నవ్వొచ్చింది.

"సస్పెన్స్ కోసం కాదురా బాబు. నువ్వాలోచిస్తావేమో నని....సస్పెన్స్‌కోసమయితే వచ్చేవారమే నీకు చెప్పేది."

ప్రసాద్ కూడా నవ్వాడు.

"ఆ ఆపరేటర్ మనల్ని మోసం చేశాడు" అన్నాను.

"ఈజిట్" అన్నాడు ప్రసాద్ ఆశ్చర్యంగా.

"డెఫినెట్‌గా" అన్నాను.

"ఎలా చెప్పగలవు"

"వాడు చాలా తెలివిగల ఆపరేటర్. ముందు వాడికి అభినందనలు తెలియచేయాలి" అన్నాను.

"మీ పుస్తకాలే చదివుంటాడు" ప్రసాద్ తిరిగి రాయి విసిరాడు.

"నేరం ఎప్పుడూ దాగదురా. ఆ పుస్తకాలు చదివి చేసినా, నీలాంటివారు గమనించకున్నా నాలాంటి వారుంటారని మరచిపోకు."

"సర్లే. ఇంతకూ ఎలా మోసంచేశాడు. బిల్లు ఇచ్చాడు కదా?"

"ముందే చెప్పానుగా వాడు తెలివిగలవాడని."

"వాడికి అందులో వచ్చేదేం వుండదు. వాడు పే చెయ్యాలి."

"నీకు అంతే అర్థమవుతుంది. మనం వెళ్ళగానే కూర్చొమని యెవరికో కాలిచ్చాడు గుర్తుందా. అతను మాట్లాడగానే బిల్లు ఇరవై తొమ్మిదిన్నర అయితే ముప్పై రూపాయలు ఇచ్చి చిల్లర ఉంచుకొమ్మని వెళ్ళిపోయాడు."

"అవును"

"అతనికి బిల్లిచ్చాడా?"

"ఇవ్వలేదా?"

"ఇవ్వలేదు. అతను కావాలని అడగలేదు. అతనిచ్చిన ముప్పై రూపాయలు మడిచి జేబులో పెట్టుకున్నాడు. అతను చేసిన రెండు కాల్స్ ఎంత డ్యూరేషనో, ప్రక్కనో, మనసులోనో నోట్ చేసుకొన్నాడు. దాని ప్రకారం మొత్తం అయిదు నిముషాలు మాట్లాడాడనుకుంటే, మన ముందు మాట్లాడిన వారికి సగం, మనకు నిముషన్నర .... మన తర్వాత ఇంకెవరన్నా దొరికితే వాళ్ళకి ఆ బిల్లు పంచుతాడు.

కాగా మనకు తెలిసినంతవరకూ అతని ఆదాయం ఈరోజు ముప్పై రూపాయల ఇరవై పైసలు."

"అమ్మనీ! ఎంత గొప్పగా మోసం చేస్తున్నాడు" అన్నాడు నోటిమీద వేలేసుకుంటూ.

"నేనూ గమనించలేదు. అయినా మనస్సు ఏదో జరిగిందని హెచ్చరిస్తూనే ఉంది. ఫోన్ నన్ను రింగ్ చేయమని ఇచ్చాడు. నన్ను మాటల్లోకి దింపాడు. అతను అంత ఆప్యాయంగా మాట్లాడుతుంటే మనం ఎంతసేపు మాట్లాడింది గమనించం. సాధారణంగా యస్ టి.డి. చెయ్యటానికి అర్జెంట్ పనిమీద గాని, ప్రత్యేక విషయం చెప్పటానికి గాని కొంత టెంషన్‌తో వెళతారు. అందుకే ఎంతసేపు మాట్లాడింది పట్టించుకోరు. కొంతమందికి అసలు ఎంత అవగలదో కూడా తెలియదు ఆలోచించరు కూడా. వాడెంత చెబితే అంత యిచ్చి రావటమే. కాగా చదువుకొని, ఉద్యోగాలు చేసిన మనల్నే వాడు మోసం చెయ్యగలిగితే, సామాన్యుల్ని ఎంతగా ముంచేస్తాడో ఆలోచించు. వాడు అంత తియ్యగా మాట్లాడటం మనల్ని డైవర్ట్ చెయ్యటానికే"

"అరరే....ఈ దేశం ఎంత ముందుకు పోతుంది" అన్నాడు ప్రసాద్.

"మరేమిటనుకున్నావ్. వాడు ప్రస్తుతానికి ప్రభుత్వాన్ని మోసం చెయ్యటంలేదు - మనకు తెలిసినంతవరకు. వాడి దాహం పెరిగితే ప్రభుత్వాన్ని మోసం చెయ్యటానికి టెక్నికల్‌గా ఆలోచిస్తాడు. నా అంచనా ప్రకారం రోజుకు ఏభై రూపాయలు లేనిదే యింటికి వెళ్ళడు—ఏ రోజయినా" అన్నాను.

"ఓ వేళ ఎవరూ దొరకకుంటే అంతకి బిల్ రైజ్

చేస్తాడన్న మాట. కొడుక్కి అందుకే ఈ వూరు వదలి వెళ్ళ బుద్ధి కావటంలేదట....అలవాటయిపోయిందట" అన్నాడు ప్రసాద్.

"ఇలాంటి వారిని స్మశానంలో వేసినా జనాల్ని, శవాల్ని పిండేస్తారు. చోరకళా నైపుణ్యం" అన్నాను.

"క్రైమ్ జీవితంలో యింతగా భాగం అయిందా" అడిగాడు ప్రసాద్.

"ఇందుగల దందు లేదను సందేహం వలదు. ఎందెందు వెదికినా అందందే కలదు క్రైమ్" అన్నాను.

"ఇదిగో టిక్కెట్టు వాడు నలిపేస్తున్నాడు" అంటూ తెచ్చిచ్చింది శ్రీమతి.

"ఏమిటా టిక్కెట్టు. ఇటివ్వు" అన్నాను.

"నేనే ఇచ్చాలేరా. మొన్న గుంటూరు వెళ్ళాను. అది జేబులోనే వుండిపోయింది."

"టిక్కెట్టు అడిగే నాథుడు లేడన్నమాట."

"ఆ రూట్లో టి. పి.ని చూసి రెండు సంవత్సరాలయింది."

"ఏ రోజు వెళ్ళావో గుర్తుందా?"

"గుర్తుండకపోవడమేమిటి? పదో తారీఖు."

"నేనే గనుక టి. పి. నయితే నీకు ఛీటింగ్ నేరం క్రింద మూడు వందలు జరిమానా వేసేవాడ్ని."

"ఎందుకురా" అన్నాడు ప్రసాద్ అర్థంకాక.

"ఇది ఎనిమిదో తారీఖు టిక్కెట్టు"

ప్రసాద్ తల తిరిగిపోయింది.

"కౌంటర్లోనే కొన్నానే"

"కౌంటర్లో యిలాంటి టిక్కెట్లు రాకూడదనేముంది"

అన్నాను. వాడు పిచ్చెక్కినట్లు చూశాడు.

"ఇలా అయితే ఈ దేశంలో బ్రతికేదెట్లా" అన్నాడు నీరసంగా.

"అందుకేరా చెబుతుంది. ప్రతి విషయం మీద నిశిత పరిశీలన ఉండాలి. బస్ టిక్కెట్లు కూడా అయిపోయినవి యిస్తుంటారు. పట్టుబడితే తలకాయ నొప్పి. ఆ నడుమ కొంతమంది ప్రత్యేక టిక్కెట్లే ముద్రించారు. ఈ నడుమ రైలు టిక్కెట్ల కుంభకోణంలో కొంతమంది సస్పెండ్ అయ్యారు. ఈ దేశంలో గౌరవంగా బ్రతకాలంటే కనీసంగానైనా లాజిక్ తెలిసుండాలి."

"నిజమేరా. ఒప్పుకుంటున్నాను. అలాంటి దానికి ఈ పుస్తకాలు ఏ మాత్రం అవకాశం కలిగిస్తున్నా నా అభినందనలు" అన్నాడు ప్రసాద్.

నేను నవ్వాను.

"కానీ ఆ ఆపరేటర్‌గాడ్ని అలాగే వదిలిపెట్టటమేనా" అన్నాడు.

"లేదు. దానికో మార్గం వుంది. మనకు టెలిఫోన్స్‌లో తెలిసిన పెద్ద ఆఫీసరున్నాడు. ఈ విషయం ఆయన దృష్టికి తెద్దాం" అన్నాను.

మర్నాడు—

"యస్.టి.డి. కుంభకోణం" అని దినపత్రికలో బాక్స్ కట్టి ఓ వార్త ప్రచురించారు. అందులో ఈ వ్యవహారాన్ని పూర్తిగా చిత్రించారు.

ఆ రోజే యింకో వార్త ప్రచురింపబడింది.

"యస్.టి.డి." కాల్స్ దగ్గర కూర్చునే ఆపరేటర్ మహేష్ ప్రజల్ని మోసం చేస్తున్నట్లు కనుగొనడంతో సస్పెండ్ చేశారు. □

మంత్రికి మరణం తప్పదు

టెంపో రావ్

రాత్రి పన్నెండవుతోంది. నిద్రపట్టక ఫోమ్ బెడ్డుమీద ఇటూ అటూ దొర్లుతున్నాను. గదిలో చీకటిగావుంది. వుడ్‌బైన్ సిగరెట్ పీలుస్తున్నాను. కుడిచేత్తో పక్కనే తడిమిచూశాను. పార్వతి శరీరం వేడిగా తగిలింది. చటుక్కున టెలిఫోను మోగింది. టెలిఫోను వైపు దూసుకు వెళ్లాను. స్విచ్చి నొక్కాను. గది ప్రకాశవంతంగా అయింది. రిసీవరెత్తాను.

“హలో, పరుశురామ్ స్పీకింగ్!” అన్నాను మెల్లిగా.

"మంత్రి నూకరాజండీ."

"నమస్కారం మంత్రిగారూ, ఏమైంది?"

"మళ్ళా ఇప్పుడే టెలిఫోను వచ్చింది. తెల్లారేలోగా నాకు చావు తప్పదట!" అన్నాడు మంత్రి నూకరాజు భయంతో.

కాస్సేపు మాట్లాడకుండా అలాగే వుండిపోయాను. మంత్రి నూకరాజుని గురించి ఆలోచించసాగాను. గత ముప్పై రోజుల్నించీ అతడికి ఉత్తరాలు ఎక్స్‌ప్రెస్ డెలివరీ లెటర్లు, టెలిగ్రామ్స్, టెలిఫోను పిలుపులు వస్తూనే వున్నాయి. ఉత్తరాల్లో సంతకాలు ఉండవు. ఎవరు రాశారో తెలీదు. క్రైం బ్రాంచి వాళ్ళు ఎంత ప్రయత్నించినా పరిశోధన ఒక అంగుళం కూడా ముందుకి వెళ్ళలేకపోయింది.

"పరశురామ్‌గారూ." అటువైపు కంఠం గాభరాగా మ్రోగింది.

"ఏమిటి."

"పక్కగదిలో టెలిఫోను మళ్ళా మ్రోగుతోంది."

"వెళ్ళి మాట్లాడిరండి. నేనిలాగే వుంటాను"

"నా కెందుకో భయంగా వుంది," అన్నాడు నూకరాజు.

నవ్వు ఆపుకోలేకపోయాను. ఇరవై ఏళ్ళ క్రితం ఈ నూకరాజే బ్రిటిషు ప్రభుత్వాన్ని ఎదిరించాడు.-వణికించాడు. చాలా ధైర్యం గలవాడని పేరు సంపాదించుకున్నాడు ఒకప్పుడు జుబ్బా చింపి తెల్ల సైనికుల తుపాకీల కెదురుగా తన ఛాతీనుంచి, "కావాలంటే షూట్ చెయ్యండి. నా రక్తాన్ని పీల్చండి!" అని అరిచాడు అటువంటి నూకరాజుకి ఇప్పుడు ఫోనులో మాట్లాడ్డం భయంగా వుందంటే ఆశ్చర్యంగా వుంది.

"పరశురామ్‌గారూ."

అతని కంఠం వణుకుతోంది.

"చెప్పండి."

"నాకు చాలా నీరసంగా వుంది. ఈ ముప్పై రోజుల్నించీ నాకు నిద్రాహారాలు లేవు. ఇవాళ రాత్రి నాకు చావు తప్పదని వాళ్ళు హెచ్చరిస్తున్నారు టైమ్ పన్నెండు దాటింది. ఆరుగంటలకి తెల్లారుతుంది, ఈ ఆరు గంటలూ మీరు నా పక్కనే వుండాలి. నన్ను కాపాడాలి."

"మంత్రిగారూ, మీ ఇంటి చుట్టూ పోలీసులు వున్నారుగా?"

"కావల్సినంత మంది వున్నారు. ఇంటిచుట్టూ వున్నారు, గుమ్మాల్లో నిలబడ్డారు. నా గదిలో కూడా నిలబడ్డారు. కాని వాళ్ళని చూసినా నాకు భయంగానే వుంది దయచేసి మీరు వెంటనే రండి!"

"అలాగే వస్తున్నాను."

రిసీవర్ని పెట్టేశాను. క్షణకాలం నా రూపాన్ని పరిశీలించుకున్నాను. నైట్ గౌన్ని తీసేసి కుర్చీమీదకు విసిరాను. చారల పైజామా, చారలస్లాక్ కాళ్ళకున్న సింగపూర్ స్లిప్పర్స్, వీటిని విప్పేసి సూటూ బూటూ ధరించాను. తల దువ్వుకుని వుడ్ బైన్ సిగరెట్ వెలిగించి హాయిగా నిద్రిస్తూన్న పార్వతి వద్దకు వెళ్ళాను. ఫోమ్బెడ్డుమీద కూర్చున్నాను. పార్వతివైపు తదేకంగా చూస్తూ వుండి పోయాను. పమిట పక్కకి జరిగిపోయింది. పల్చటిజాకట్ లోంచి టైట్ గా నొక్కుతూన్న బ్రాను వెక్కిరిస్తూన్న వక్షోజాలను గమనిస్తుంటే మంత్రి నూకరాజుని తాత్కాలికంగా మర్చిపోవాలనిపించింది. అదే క్షణంలో ఉలిక్కి పడుతూ పార్వతెందుకో లేచింది. కళ్ళు తెరచి నా వైపు నవ్వుతూ చూసింది.

ఆమె చేతులు నన్ను చుట్టేశాయి.

"ఇంత రాత్రివేళ ఎక్కడికి ప్రయాణం?" అడిగింది పార్వతి.

"మంత్రి నూకరాజుగారింటికి. ఇవాళ రాత్రి ఆయనకు చావు తప్పదని టెలిఫోను కాల్స్ ఎన్నో వచ్చాయట."

"ఆ మాత్రం దానికి మీ రెందుకు వెళ్ళడం? నూకరాజు పోతే కామరాజు మంత్రి అవుతాడు. లోకాని కేవిధంగానూ నష్టం సంభవించదు!"

"పార్వతీ, ఆయన దేశభక్తుడు. ఒకప్పుడు తెల్లవారి నెదిరించాడు. లాఠీచార్జికి గురయ్యాడు. ఆయనా, ఆయన లాంటి మరెందరో చేసిన త్యాగాల మూలంగానే మనకి స్వాతంత్ర్యము లభించింది. ఆయన్ని రక్షించడం నా విద్యుక్త ధర్మం!"

చటుక్కున మంచం మీదనుంచి దిగాను. పార్వతి నా ఎదురుగావచ్చి నిలబడింది. గడ్డాన్ని నా ఛాతీ మీద ఆనించి నా వైపు సూటిగా చూస్తూ వుండిపోయింది ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. గట్టిగా కౌగలించుకుని గబగబా బయటకు నడిచాను. కాస్సేపట్లో డాడ్జికారు మంత్రి నూకరాజు భవనం వైపు శరవేగంగా వెళ్ళసాగింది.

2

ముందుగేటు దాటుతూంటే అక్కడ కాపలావున్న అయిదుగురు కాన్‌స్టేబుల్స్,సబిన్‌స్పెక్టర్ సుబ్బారావ్ నాకు శల్యూట్ చేశారు లోపలికి పోనిచ్చి, పోర్టికో కింద కారాపాను. మంత్రి నూకరాజు భవనంలో ఏదో కార్నివాల్ సాగుతూన్నట్టుంది. ఎక్కడచూసినా దీపాలు వెలుగుతున్నాయి. ప్రతిచోటా కాన్‌స్టేబుల్స్ తుపాకీలు పట్టుకుని గస్తీ తిరుగుతున్నారు. ఇటువంటి ప్రదేశంలోకి హంతకులు

ప్రవేశించడం కష్టమే. కారులోంచి కిందకి దిగాను. ఇన్స్పెక్టర్ నాయర్ నావైపు పరుగెత్తుకొచ్చాడు.

"నాయర్ భాయ్," అన్నాను నవ్వుతూ.

"నువ్వొచ్చినందుకు చాలా సంతోషంగా వుంది, బ్రదర్. తెల్లారేవరకూ నువ్విక్కడే వుండాలి."

"వుంటాను. మంత్రిగారిని కలుసుకుందాం, పద."

ఇన్స్పెక్టర్ నాయరూ, నేనూ లోపలకు నడిచాం. కానిస్టేబుల్స్ కాపలా కాస్తున్న గుమ్మాన్నిదాటి గర్భగుడిలోకి చేరుకున్నాం. ఇన్స్పెక్టర్ తలుపుమీద అయిదుసార్లు వేళ్ళతో తట్టాడు. తలుపులు తెరవబడ్డాయి. ఆరుగురు కానిస్టేబుల్స్ మాకు ప్రత్యక్షమయ్యారు. వాళ్ళని బయట కెళ్ళమని హెచ్చరించి గదిలో ప్రవేశించి తలుపులుదగ్గరగా మూశాను. నా కుడి చెయ్యిని కోటుజేబులోనికి పోనిచ్చి తడిమి చూసుకున్నాను. పిస్టల్ వేళ్ళకు తగిలింది. క్షణ కాలం గదినీ, గదిలోని వారినీ పరీక్షిస్తూ వుండిపోయాను. మంత్రి నూకరాజు సోఫాలో కూర్చునివున్నాడు. అతని కెదురుగా ఇద్దరు స్త్రీలు కూర్చుని వున్నారు. వాళ్ళ వెనుక నున్న పరుపుమీద ఇరవైఏళ్ళ యువతి బోర్లా పడుకుని పత్రిక చదువుతోంది. నూకరాజు దగ్గరగా నడిచాను. అతని కుడివైపునున్న బాస్కెట్ కుర్చీలో కూర్చున్నాను.

"మీరు వచ్చాక నాకు చాలా ధైర్యంగావుంది," అన్నాడతను.

కాస్సేపు అతడిని పరిశీలిస్తూ వుండిపోయాను. అతడి వయస్సు 65 సంవత్సరములు దాటి వుంటుంది. పళ్ళు ఊడిపోయాయి, బుగ్గలు లోపలకి చొచ్చుకుపోయాయి. సున్నంలా తెల్లబడ్డ వెంట్రుకలు.

"ఆమె నా భార్య, లక్ష్మి," అన్నాడు నూకరాజు.

లక్ష్మివైపు చూసి నమస్కరించాను. ఆమె వయస్సు యాభై వుంటుంది. నా నమస్కారాన్ని ఆమె ఆవలింతలతో అందుకుంది. వెళ్ళి హాయిగా పడుకోవాలనే కోర్కె ఆమె మొహం చూస్తే స్పష్టమవుతోంది. ఆమెకు ప్రక్కనే కూర్చున్న స్త్రీ వైపు నూకరాజు చెయ్యి చూపించాడు.

"ఈమె విమల ఇద్దరం స్వాతంత్ర్యం కోసం కలిపి పోరాడాం. అటుపైన నాతోనే వుండిపోయింది."

విమలకి నమస్కరించాను. ఆమె మొహాన్ని క్షణకాలం చూస్తూ వుండిపోయాను. వయస్సు నలభై దాటినా ఆమె చాలా అందంగా వుంది. కళ్ళు మెరుస్తున్నాయి.

మంత్రి నూకరాజు దూరంగా చూశాడు ఫోమ్ బెడ్డు మీద బోర్లా పడుకుని ఏదో పత్రికను చదువుతూన్న యువతి వైపు చూపించాడు.

"ఈమె విజయ. మంత్రి అయ్యాక నాకు పరిచయమయింది. నా కార్యదర్శిగా వుంటోంది." అన్నాడతను.

ఆ యువతికి నమస్కరించవలసిన అవసరం నాకు లేకుండా పోయింది. పూర్తిగా పత్రికలో లీనమయిపోయిన ఆమెకు మంత్రి నూకరాజు మాటలు వినిపించలేదు. కాస్సేపు ఆమెని చూస్తూ వుండిపోయాను. చక్కటిరూపం. మొగాళ్ళను ఆకర్షించే వంపులన్నీ ఆమె శరీరానికున్నాయి. నిముషాలు గడుస్తున్నాయి. వుడ్ బైన్ సిగరెట్ వెలిగించాను. టైము పన్నెండున్నర దాటింది. కుర్చీలోంచి లేచాను. గబగబా వెళ్ళి గది గోడలను వేళ్ళతో తట్టి చూశాను. గదికి ఒకే కిటికీవుంది. కిటికీకున్న కర్ర తలుపులు లోపల్నుంచి మూసివున్నాయి. కిటికీ తలుపులు తెరిచాను.

"ప్లీజ్ పరశురామ్‌గారూ, వాటిని తెరవకండి!"

అరిచాడు నూకరాజు.

తెరిచిన కిటికీ ఊచల మధ్యనుంచి బయటకు చూశాను. సమీపంలో కానిస్టేబుల్స్ తిరుగుతున్నారు. దూరంగా ప్రహరీగోడ కనిపిస్తోంది. అక్కడక్కడ లైట్లు వెలుగుతున్నాయి తలుపులు మూసేశాను. వెనక్కి తిరిగాను. మంత్రి నూకరాజు ముందుకి నడిచాను.

"మంత్రిగారూ, మీరు గాభరా పడకండి. ప్రతీదీ నేను పరిశీలించాలి. మిమ్మల్ని చంపుతాననే వాళ్ళకు ఎలాంటి అవకాశం లేకుండా మనం జాగ్రత్తపడాలి."

"క్షమించండి. మీ ఇష్టం వచ్చినట్లు చేయండి," అన్నాడు మంత్రి నూకరాజు.

లక్ష్మి కుర్చీలోంచి లేచింది.

"నా కళ్ళు మూసుకుపోతున్నాయి. పడుకుంటాను," అందామె

"మాతో మీరు జాగారం చెయ్యడందేనికి? వెళ్ళి పడుకోండి నిర్భయంగా," అన్నాను. తెరిచివున్న గుమ్మలోంచి లక్ష్మి పక్కగదిలోకి వెళ్ళిపోయింది. పరుపు వైపు చూశాను. అంతవరకూ పత్రిక చదువుతూన్న విజయ పత్రికమీద తలానించి నిద్రపోతోంది. విమల మాత్రం కుర్చీలో అలాగే కూర్చుని వుంది. ఆమె వైపు దీనంగా చూశాను.

"మీరూ వెళ్ళి పడుకోండి," అన్నాను.

ఆమె నా వైపు సూటిగా చూసింది.

"పరశురామ్‌గారూ, నాకు నిద్ర కావాలనుకుంటేగాని రాదు. రాత్రంతా మీతోపే జాగారం చేస్తాను. తెల్లారాలి. ఆయనకు ఆపద తప్పాలి. అటుపైన పడుకుంటాను," అంది విమల.

ఆమె దృఢ నిశ్చయంగల స్త్రీ అని మాటలువింటే తెలుస్తోంది. టైమ్ చూశాను. ఒంటిగంట అవుతోంది. గదిలోని టెలిఫోను మ్రోగసాగింది. విమల లేవబోయి కూర్చుంది. మంత్రి నూకరాజు చేతులు వణుకుతున్నాయి. చటుక్కున వెళ్ళి రిసీవర్ని అందుకున్నాను.

"హలో!" అన్నాను మంత్రి నూకరాజు కంఠాన్ని అనుకరిస్తూ.

అటువైపు నుంచి పిచ్చిగా ఎవరో నవ్వుతున్నారు. పురుషకంఠం కాస్సేపట్లో నాకు వినిపించింది.

"నూకరాజూ, మరి కొంతసేపట్లో నీకు విముక్తి చేకూరుతుంది. నిద్రాహారాలు మాని నీరసించవలసిన అవసరం నీకుండదు. నూకరాజూ, ఈ రాత్రి నువ్వు చస్తావ్! నీకు మరణం తప్పదు!"

"నన్నెందుకిలా బాధిస్తున్నారు? నే చేసిన తప్పేమిటి?"

"నువ్వు గుడ్డివాడివికాదు. ఇరవై ఏళ్ళ క్రితం చేతిలో చిల్లిగవ్వలేక మాసిన గుడ్డలతో తిరిగేవాడివి. అయినా ఆ నాడు నీ కళ్ళల్లో జ్యోతుల్లా వెలిగే ఆశయాలు అనేక మందిని ఆకర్షించేవి ఇప్పుడు నువ్వొక మంత్రివి. రాష్ట్రాన్ని పాలిస్తున్నావు. అధికారంతో, డబ్బుతో మద మెక్కిన మృగంలా ప్రవర్తిస్తున్నావు!"

మరేదేనా అడిగేలోగా అటువైపునుంచి క్లిక్ మన్నశబ్దం వినిపించింది. రిసీవర్ని పెట్టేశాను. మంత్రి నూకరాజు నా వైపు భయంతో చూశాడు.

"మళ్ళా యముడేనా ఫోనుచేస్తే?...." అడిగాడుమంత్రి నూకరాజు.

నవ్వుతూ అవునన్నాను. గదిలో పచార్లుచేస్తున్నాను. గబగబా పక్కగదిలోకి దూరాను. ఒక మంచంమీద లక్ష్మి

నిద్రపోతోంది. ఆ గది తలుపులన్నీ లోపల్నించి మూసి వున్నాయి. కాస్సేపట్లో నూకరాజు వున్న గదిలోకి తిరిగి వచ్చాను నా ఆశ్చర్యాని కంతులేదు. ఫోమ్ బెడ్డుమీద విజయ నిద్రిస్తూనే వుంది. గదిలో మంత్రి నూకరాజు, విమల కనిపించలేదు. ఏమయ్యారు? ఎక్కడికి వెళ్ళారు? గబగబా వెళ్ళి గది తలుపులు తెరిచాను. బయట నిలబడ్డ కాన్‌స్టేబుల్స్ వైపు చూశాను

"మంత్రిగారు యిలా వెళ్ళారా?" అడిగాను

"గదిలో లేరా?" ఆశ్చర్యంగా అడిగాడో కాన్‌స్టేబుల్.

తటాలున తలుపు మూశాను. మళ్ళా గదిని పరిశీలించాను. కుడివైపున ఓ తలుపు నా కవుపించింది. దాని వయిపే చూస్తూ వున్నాను. కాస్సేపట్లో తలుపు తెరవబడింది మంత్రి నూకరాజు బయటకు వస్తున్నాడు. విమల భుజంమీద చెయ్యివేసి నడుస్తున్నాడు. వాళ్ళు బయటకొచ్చిన బాత్‌రూమ్ గదిలోకి ప్రవేశించాను. లైటు వెలుగుతోంది చన్నీళ్ళతో మొహాన్ని కడుక్కున్నాను. గది నలువైపులా చూశాను. చిన్నగది. ఎక్కడా కిటికీలు లేవు. బయటకొచ్చి తలుపు దగ్గరగా మూశాను. నిమిషాలు గడుస్తున్నాయి. మళ్ళా నూకరాజు గదిలో పచార్లు చేయసాగాను.

3

రాత్రి మూడయింది. బయటనుంచి పిస్టల్ పేలిన శబ్దం వినిపించింది. నూకరాజు భయంతో గజగజ వణుకుతున్నాడు. విమల దగ్గరగా వచ్చి అతడిని పట్టుకుంది. గబగబా తలుపులు తెరిచి బయటకు చూశాను. గుమ్మం ముందుండే కాన్‌స్టేబుల్స్ పరుగెడుతున్నారు. ఎటుచూసినా బూట్ల చప్పుళ్ళే పిస్టళ్ళు పేలుతున్నాయి. మంత్రి నూకరాజున్న గది తలుపులు దగ్గరగా మూసి గబగబా పోర్టికో

వైపు పరుగెత్తాను. ఇన్‌స్పెక్టర్ నాయర్ ఒక వ్యక్తిని బలంగా పట్టుకుని నా వద్దకు తోసుకువచ్చాడు. మా చుట్టూ కాన్‌స్టేబుల్స్ నిలబడ్డారు.

"బ్రదర్, మంత్రిగారికి ఆపద తప్పింది. పిస్టల్ జేబులో దాచుకుని యితను ప్రహారీగోడ దూకి భవనంలో ప్రవేశించ డానికి ప్రయత్నిస్తూంటే పరుగెత్తి పట్టుకున్నాం," అన్నాడు యిన్‌స్పెక్టర్ నాయర్.

"నాయర్ భాయ్, యితడిని కస్టడీలో వుంచు" అని గబగబా లోపలకి పరుగెత్తాను. మంత్రి నూకరాజు గది ముందు నిలబడ్డాను. మెల్లిగా తలుపు తెరిచాను. మంత్రి నూకరాజు నా వైపు భయంతో చూశాడు. అతని చేతిలో పాలగ్లాసు వుంది. దగ్గరగా నడిచాను.

"నూకరాజుగారూ, మీకు ప్రమాద తప్పింది. మిమ్మల్ని చంపడానికొచ్చిన వ్యక్తి ఇప్పుడే మాకు దొరకిపోయాడు. ఇప్పుడే బెంగా లేదు" అన్నాను.

"అయితే ఈ పాలు తాగి హాయిగా పడుకుంటాను" అన్నాడు నూకరాజు.

అతని పక్కనే నిలబడ్డ విమల మొహంలోకి చూశాను. మెల్లిగా నా దృష్టి పాలగ్లాసుమీద కెళ్ళింది. చటుక్కున ఆ గ్లాసు నందుకున్నాను.

"ఈ పాలు తాగారా?" అడిగాను.

"పాలిప్పుడే విమలిచ్చింది. తాగమంది. ఇంకా తాగలేదు."

"మీకిప్పుడు పూర్తిగా ప్రమాదం తప్పిందని చెప్ప గలను!" అన్నాను గంభీరంగా.

నా మాటలు అర్థం కానట్టు మంత్రి నూకరాజు నావైపు చూశాడు. విమల పక్కగదిలోకి గబగబా వెళ్ళిపోయింది.

పాలగ్లాసును సమీపంలో వున్న టీపాయ్‌మీద పెట్టాను. పక్క గదిలోకి మెల్లిగా అడుగులేశాను. లక్ష్మి గుర్రుపెడుతూ నిద్రపోతోంది. ఒక సోఫాలో కూర్చుని విమల వెక్కి వెక్కి ఏడుస్తోంది. దగ్గరగా వెళ్ళి ఆమె భుజంమీద చెయ్యి వేశాను. కన్నీళ్ళతో మెరుస్తోన్న కళ్ళతో ఆమె నావైపు చూసింది

"ఎందుకు మీ రింతపని తలబెట్టారు?" అడిగాను మెల్లిగా.

"దేశం కోసం! సంఘం కోసం!" అందామె.

"మీరు పొరబడ్డారు. దేశంలో అందరికీ స్థానముంది. తెలివైన వాళ్ళూ, మూర్ఖులూ, మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ అందరూ దేశంలో వుంటూనే వుంటారు. వాళ్ళను నిర్మూలించడానికి ప్రయత్నించడం చట్టరీత్యా నేరమని మీకు తెలిసే వుంటుంది?"

"పరశురామ్‌గారూ, నేను చెప్పేదంతా వినండి. ఇరవై అయిదేళ్ళ క్రితం నూకరాజుగార్ని నేనెంతో ప్రేమించేదాన్ని. నిజం చెప్పాలంటే అది ప్రేమకాదు. అదొక విధమయిన ఆరాధన రాష్ట్రమంతటా ఆయన తిరుగుతూ ఉండేవారు. ఉపన్యాసాలిచ్చేవారు. మా కాలేజీ కొచ్చి ఆయనిచ్చిన ఉపన్యాసం నన్ను ఉద్రేకంతో నింపింది. అప్పటికి నేను పదహారేళ్ళ కన్యను ఆటోగ్రాఫ్ కోసం ఆయన్ని కలుసుకున్నాను. ఆయన ఓసారి నా వైపు చూశారు. దేశం కోసం నన్ను పాటుపడమన్నారు. ఆయన ఆశయాలు నాకు వివరంగా చెప్పారు. నాకు పిచ్చెక్కిపోయింది. చదువు మానేశాను. తల్లీ, తండ్రినీ మర్చిపోయాను. దేశంకోసం నా సర్వాన్నీ యివ్వడానికి నిశ్చయించుకున్నాను. ఆయనతో కలిసి రాష్ట్రమంతటా తిరుగుతూ వుండేదాన్ని. ఒక నాయకుని పక్కనే అనుక్షణం వున్నాననే తృప్తి నాకుంటూ వుండేది. ఒకనాటి

రాత్రి మే మొక ట్రావెలర్స్ బంగ్లాలో బసచేశాం. ఆ వేళ ఆయన బాగా నడిచారు. కాళ్ళు నొప్పెడుతున్నాయి. నొక్క మన్నారు. అది కూడా దేశసేవగా భావించి ఆయన కాళ్ళు నొక్కసాగాను. ఆ రాత్రి ఆయనలోని మరోరూపం నాకు ప్రత్యక్షమయింది. నా శరీరాన్ని ఆయనకి అర్పించ వలసిన స్థితి ఏర్పడుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఆ రాత్రి ఆయన నన్ను కౌగలించుకున్నారు. నా పెదిమల్ని కొరికే శారు. నా శరీరాన్ని అనేకచోట్ల తడిమి చూశారు. ఇంకా నేను లొంగలేదు.

'విమలా. ఇంత చిన్నదాన్ని గురించి నువ్వూ నేనూ ఎప్పుడూ ఆలోచించకూడదు. ఎంతో కార్యభారం ఇప్పుడు మనిద్దరిమీదా వుంది. అప్పుడప్పుడు దాహం వేస్తే మంచి నీళ్ళు తాగినట్టే, మన శారీరక వాంఛల్నికూడా మనం తీర్చుకుంటూ వుండొచ్చు. ఈ శరీరం ఇవాళ వుంటుంది, రేపు పోతుంది. కాని దేశంకోసం మనం చేసిన త్యాగాలు సువర్ణాక్షరాలతో చరిత్రలో శాశ్వతంగా రాసి వుంటాయి,' అన్నారు ఆయన

"ఆయన మాటలు విన్నాక నా కన్యాత్వాన్ని ఆ రాత్రి ఆయన కర్పించాను. మా యిద్దరికీ పెళ్ళి కాలేదు. అప్ప ట్నించీ నేనాయనతోనే వుంటున్నాను. నిజం చెప్పాలంటే నేనాయనకు రెండో భార్యని."

"ఆయనకు ఎందరు భార్యలున్నారు?"

"ఫోమ్ బెడ్డుమీద పత్రిక చదువుతూ నిద్రించిన యువతి మూడో భార్య. ఇంకా యెందరున్నారో నాకు తెలీదు. ఒక ప్పుడు ఆయనలోని ఆశయాలు, ఆదర్శాలూ నన్ను అమి తంగా ఆకర్షించాయి. ఈ నాడు అవేవీ ఎంత వెతికినా ఆయనలో కనపడ్డం లేదు. నా కిప్పుడు జీవితంతో విసు

గ_త్తింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని ఎందుకూ ఉపయోగించని దానిగా నేను రూపొందాను. మంత్రి అయ్యాక అధికార హోదాలు ఆయన కళ్ళను పూర్తిగా కప్పేశాయి. ధనాశ ఆయన్నిప్పుడు అమితంగా పీడిస్తోంది. ఎన్ని లక్షలున్నా ఇంకా డబ్బుకోసం ఆయన చేతులు చాస్తూనే వుంటాడు. పళ్ళు వూడిపోయి, శరీరం క్షీణించినా ఆయనలోని కామం తగ్గుముఖం పట్టలేదు. వయస్సుతో పెరుగుతోందనుకుంటాను. అందమైన ఏ యువతి కనిపించినా ఆయన నీరయిపోతారు. ఏవో మాటలు చెప్పి ముట్టుకోడానికి ప్రయత్నిస్తాడు. అటువంటి వ్యక్తి లోకంలో వుండాలా? లోకాన్ని విడిచి పోవాలా? మీరే నిర్ణయించండి. అందుకే ఆ పాలలో విషం కలిపాను!"

"బయట పోలీసువాళ్ళకు పిస్టలుతో దొరికిన వ్యక్తి యెవరు? అడిగాను.

"అతను నా మిత్రుడు. చిన్నప్పుడు నన్నెంతో ప్రేమించాడు. కాని నూకరాజుగారిమూలంగా నేనతడిని పెళ్లాడలేకపోయాను. అప్పటినించీ అతను పిచ్చివాడై తిరుగుతున్నాడు. ఈ మధ్య నాకో చోట కనిపించాడు. ఇంట్లో కూర్చుని అతని ద్వారానే నూకరాజుగారిని భయపెట్టే కార్యక్రమం నేను సాగించాను. ఇవాళ రాత్రి మూడింటికి పిస్టల్ పట్టుకుని భవనంలోకి ప్రవేశించమన్నాను. ఎవరికీ దొరక్కుండా పారిపొమ్మన్నాను. అందరూ అతడిని పట్టుకోడంలో నిమగ్నులవుతారు. గదిలో వున్న నేను యిచ్చిన పాలు తాగి ఆయన మరణిస్తారు అనుకున్నాను. ఆఖరి క్షణంలో మీమూలంగా అది జరక్కుండా పోయింది."

"ఆయన చావనందుకు మీరు విచారిస్తున్నారా?" అడిగాను మెల్లిగా.

"ఇప్పుడు విచారించదంలేదు. నిజం చెప్పాలంటే మీరు ఆయన్నీ నన్నూ కూడా కాపాడారు. చావకుండా ఆయన్ని, హంతకురాలు అవకుండా నన్నూ కాపాడినందుకు మీకు నా కృతజ్ఞత తెలుపుకుంటున్నాను."

విమల కళ్ళల్లోకి నవ్వుతూ చూశాను.

"విమలగారూ. ఒకప్పుడు ఆయనలోని ఆశయాలూ ఆదర్శాలూ మిమ్మల్నెంతో ఆకర్షించాయన్నారు. వాటిని మీలో సజీవంగా వుంచుకోండి. వాటికోసం పాటుపడండి. ఆయన్ని మరచిపోండి. జీవితం విచిత్రమైంది. ఓడలు బళ్ళవుతాయి. ఒకప్పుడు పర్వతాలను మోసిన వ్యక్తి ఇప్పుడు పిడకల్ని మోస్తూ వుండొచ్చు."

గబగబా మంత్రి నూకరాజున్న గదిలోకి నడిచాను. టీపాయ్‌మీదున్న పాలగ్లాసు పట్టుకుని బాత్‌రూమ్‌లోకి దూరాను. పాలను బేసిన్‌లో పోసేసి గ్లాసును శుభ్రంగా కడిగాను. చేతులు కడుక్కుని వుడ్‌బైన్ సిగరెట్ పీలుస్తూ బాత్‌రూమ్‌లోంచి బయటకొచ్చాను.

మంత్రి నూకరాజు ఎదురుగా నిలబడ్డాను

"నూకరాజుగారూ, వెళ్తున్నాను. ఇటుపైన మీకే ప్రమాదమూ లేదు. తలుపులు తెరుచుకొని పడుకోవచ్చు."

"పరశురామ్‌గారూ, చాలా థాంక్స్."

గబగబా గదిలోంచి బయటకు నడిచాను బయటనుంచి గది తలుపులు దగ్గరగా మూసి క్షణకాలం సందులోంచి చూస్తూ నిలబడ్డాను. మంత్రి నూకరాజు కుర్చీలోంచి లేచి ఫోమ్ బెడ్డుమీద మేను వాల్చాడు. వణుకుతూన్న అతని కుడి చెయ్యి నిద్రిస్తూన్న విజయ నడుమును పాములా చుట్టేసింది. □

స్కూల్ స్టాక్స్

స్వరూప్

శీతాకాలం—

ఆరు గంటలకే చీకట్లు చిక్కగా ముసురుకున్నాయి పరిసరాల్ని.

బస్సుకోసం ఎదురుచూస్తూ అసహనంగా నిలబడ్డాడు ప్రహ్లాద్. క్షణం గడుస్తుంటే గుండెలు గుబగుబలాడసాగాయి ప్రహ్లాద్‌కు....ఆఫీసు నుండి తండ్రి యింటికి వచ్చివుంటాడేమోనన్న భయంతో....

ప్రహ్లాద్ వయసు పద్నాల్గేళ్ళు. కాన్వెంట్‌లో టెన్త్‌క్లాస్ చదువుతున్నాడు. తండ్రి అంటే భయం. తల్లిని ప్రతిమాలుకుని తండ్రికి తెలియకుండా స్నేహితులతో పిసిమాకి వచ్చాడు. "ఆరుగంటలకల్లా యింటికి వచ్చేస్తాను, నాన్నగారడిగితే ఫ్రెండ్ యింటికి వెళ్ళానని చెప్పు" అని తల్లికి

సలహా యిచ్చి మరీ వచ్చాడు.

అందుకే సమయం గడిచిపోతుంటే ఆదుర్దా చెంద సాగాడు. అసలే తండ్రి చండశాసనుడు. పరీక్షలు దగ్గర పెట్టుకుని షికార్లు కొడితే అసలు సహించడు. 'ఎలాగైనా తండ్రి వచ్చేలోపున ఇంటికి చేరుకోవాలి. లేకపోతే అక్షింతలు తప్పవు....' అనుకుంటూ రాని బస్సుకోసం ఎదురు చూస్తూ నిలబడ్డాడు.

పది నిముషాలు గడిచినా బస్సు రాలేదు. స్కూటర్ వాలాలను, సైకిలిస్టులను లిఫ్ట్ అడిగాడు. వినిపించుకోనట్లే వేగంగా వెళ్ళిపోసాగారు అందరూ.

చిరాగ్గా కాలినడకనే గబగబా నడవసాగాడు—

కొద్దిదూరం నడిచాడో లేదో....ఓ అంబాసిడర్ కారు ప్రహ్లాద్ ప్రక్కగా స్లో అయింది. ముందు సీట్లో ఇద్దరూ, వెనకసీట్లో ఇద్దరూ వున్నారు.

"లిఫ్ట్ ప్లీజ్" అడిగాడు ప్రహ్లాద్ విండోగ్లాస్‌వైపు తల పెట్టి వాళ్ళకు వినిపించేలా.

"ఎక్కడికీ?" కాలిన సిగరెట్ బయటపడేస్తూ అడిగాడు ముందు సీట్‌లోని వ్యక్తి.

"పూల్‌బాగ్" చెప్పాడు ప్రహ్లాద్.

"కమిన్" అని డోర్ తెరిచాడు వెనక సీట్‌లోని వ్యక్తి బయటకొచ్చి.

గభాలున లోపలికెళ్ళి కూర్చుని "థ్యాంక్సండీ" అన్నాడు.

బయటకొచ్చిన వ్యక్తి కూడా లోపలికొచ్చి, డోర్ లాక్ చేసి "పోనీయ్" అన్నాడు.

వేగంగా కదిలింది కారు.

ప్రహ్లాద్ ప్రక్కనున్న రెండో వ్యక్తి జేబునుండి

రుమాలుతీసి హఠాత్తుగా ప్రహ్లాద్ ముక్కు మీద మూశాడు.

ఏం జరుగుతుందో ఊహించేలోపునే మైకం ఆవరించింది ప్రహ్లాద్‌ను.

కారు అంబెత్కర్ స్టాట్యూ ప్రక్కనుండి రిటర్న్ అయి, వచ్చిన దారివైపే తిరిగి ప్రయాణించసాగింది.

2

సమయం ఆరున్నర—

ఆఫీసునుండి వచ్చిన రమణమూర్తి పాంటు విప్పి లుంగీ కట్టుకుంటూ భార్య శ్రీలక్ష్మిని అడిగాడు— "వాడేడీ?" అని.

"ఎవరో ఫ్రెండ్ వస్తే 'ఇప్పుడే వచ్చేస్తానని' బయటికి వెళ్ళాడు. స్నానానికి నీళ్ళు పెట్టాను రండి" అంది టవల్ తీసుకు నడుస్తూ.

"బుద్ధిలేదు వెధవకి. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఇంటి పట్టున వుండి శ్రద్ధగా చదవాలన్న జ్ఞానం లేదు" విసుక్కుంటూ బాత్‌రూమ్ వైపు నడిచాడు.

రమణమూర్తి స్నానం చేస్తుంటే వీధి గుమ్మంలో నిలబడి కొడుకు కోసం ఆతృతగా చూడసాగింది శ్రీలక్ష్మి.

స్నానం చేసొచ్చి ఆరోజు పేపరు అందుకున్నాడు రమణమూర్తి.

గోడగడియారం ఏడుగంటలు కొట్టింది.

"భోజనం వడ్డించనా?" అంది శ్రీలక్ష్మి.

"వాడ్ని రానీ, చేస్తాను" అన్నాడు.

ప్రహ్లాద్ ఇంకా రానందుకు లోలోన బెంబేలు పడసాగింది శ్రీలక్ష్మి. త్వరగా వచ్చేస్తే బావుండ్ను అనుకుంది.

గడియారం మరోగంట కొట్టింది—ఏడున్నర.

పేపరు మడిచి ప్రక్కన పెట్టేస్తూ అడిగాడు—"ఎన్నింటికి వెళ్ళాడు బయటికి?"

"అబ్బే....ఎప్పుడు....మీరొచ్చేముందే" అంది తడబడుతూ.

"సరే—ఆకలిగా వుందిగానీ నాకు వడ్డించు" అన్నాడు పైకిలేస్తూ.

వంటగదిలోకి నడిచింది శ్రీలక్ష్మి. ఓ ప్రక్కన వడ్డిస్తూనే మధ్య మధ్య వీధి గుమ్మంలోకి వచ్చి చూడసాగింది.

భోజనం చేసొచ్చి ఆఫీసు ఫైల్సు కొన్ని ముందేసుకుని చూడసాగాడు రమణమూర్తి.

కాలుగాలిన పిల్లిలా వీధి గుమ్మంవైపు. ఇంట్లోకి తిరుగుతూ ఆందోళన చెందసాగింది శ్రీలక్ష్మి. 'వీడెప్పుడూ ఇలా చేయలేదే....ఈ రోజెందుకింకా రాలేదు? వాడికేం జరగలేదు కదా!' మొదటిసారిగా ఆ ఊహ కలిగే సరికి చిన్నగా వణికింది శ్రీలక్ష్మి.

గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

"అబ్బా!....తొమ్మిదా!...." అన్నాడు అప్పటివరకూ ఫైల్సులో మునిగిపోయిన రమణమూర్తి గడియారం వైపు చూస్తూ.

మాట్లాడకుండా వీధివైపు ఆతృతగా ఎదురుచూస్తోన్న శ్రీలక్ష్మిని చూసి అడిగాడు రమణమూర్తి — "ఏమిటీ! వాడింకా రాలేదా?"

లేదన్నట్లు తలాడించింది. ఓ ప్రక్కన భర్తకు అబద్ధం చెప్పినందుకు. మరోప్రక్క వాడికేమన్నా ప్రమాదం జరిగిందేమోనన్న భయంతో శ్రీలక్ష్మికి దుఃఖం తన్నుకు

రాసాగింది.

"నిజంగా వాడు ఫ్రెండింటికే వెళ్ళాడా?" తీక్షణంగా అడిగాడు రమణమూర్తి శ్రీలక్ష్మి ముఖకవళికలు పసిగట్టి.

నిజం చెప్పేయడం మంచిదనుకుంది శ్రీలక్ష్మి — "లేదండీ! మ్యాట్నీ సినిమాకు వెళ్ళాడు. మీకు తెలిస్తే తిడతా...."

శ్రీలక్ష్మి సమాధానం పూర్తికాకముందే ఆమె చెంప పేలిపోయింది.

"పిల్లలు చెడుమార్గంలో నడుస్తుంటే సరిచేయాల్సింది పోయి ప్రోత్సహిస్తావా?" అన్నాడు కోపంగా.

"నెలకోసారి సినిమా చూడటం కూడా తప్పేనా?" చెంప నిమురుకుంటూ కన్నీరు కారుస్తూ అడిగింది శ్రీలక్ష్మి.

"సినిమా చూడటం తప్పుకాదు. మనుష్ఖుల్ని మోసం చేయటం తప్పు. ఇంకోసారి ఇలాంటి పొరపాటు ఈ ఇంట్లో జరిగిందా.... సహించను. ఇంతకూ వాడొక్కడే వెళ్ళాడా, వాడి స్నేహితులతో వెళ్ళాడా?...." ప్యాంటు వేసుకుంటూ అడిగాడు.

"రాజశేఖర్, భరత్‌లతో కలిసి వెళతానన్నాడు."

"సరే. తలుపేసుకో" అని స్కూటర్ స్టార్ట్‌చేసి బయల్దేరాడు.

3

అంతా నిర్మానుష్యం....గాఢాంధకారం....

అంబాసిడర్ కారుచీకట్లను చీల్చుకుంటూ పార్వతీపురం కురుపాం దాటి ప్రయాణించసాగింది.

మరో అర్ధగంట ఆ అడవిప్రాంతంలో ప్రయాణించి ఓ పాడుపడిన పురాతన భవనం ముందు ఆగింది కారు.

అప్పుడే స్పృహలోకి రాబోతున్న ప్రహ్లాద్‌ని ఆ భవనం

లోకి తరలించారు నలుగురూ.

అగ్గిపుల్ల వెలిగించి ఓ మూలనున్న దీపంబుడ్డి అంటిం చాడు ఒకడు. మంద్రంగా కాంతిని అలుముకుంది గది.

మెల్లగా కళ్ళు తెరచిన ప్రహ్లాద్ ఏదో వింత వాతావర ణంలో వున్నట్లనిపించేసరికి అదిరిపడి పైకి లేచాడు.

రుమాలుతో తన ముక్కు మూసిన వ్యక్తి సగం కూలిన గోడమీద కూర్చుని తాపీగా సిగరెట్ కాల్చుతూ కనిపిం చాడు.

చేతిలో పొడవాటి రాడ్ గుండ్రంగా త్రిప్పుతూ తననే చూస్తున్నాడు కారులోకి ఆహ్వానించిన వ్యక్తి.

కూలిన దూలాలమీద కూర్చుని విలాసంగా చూస్తున్నారు మిగిలిన ఇద్దరూ.

వాళ్ళనలా చూసేసరికి గుండెల్లో దడ పుట్టుకొచ్చింది ప్రహ్లాద్‌కు.

తనని వాళ్ళెందుకు తీసుకొచ్చారో....ఏం చేయబోతు న్నారో అర్థంగాక తెల్లబోయి అడిగాడు—"ఎవరండీ మీరు?....నన్నిక్కడి కెందుకు తీసుకొచ్చారు?"

"నువ్వు మంచిపిల్లాడివని, మా మాట వింటావని నిన్ను తీసుకొచ్చాం" చిన్నగా నవ్వి అన్నాడు రాడ్ త్రిప్పుతోన్న వ్యక్తి.

ఆ చిరు వెలుగులో ఆ చిర్నవ్వు ఎంతో భయంకరంగా కన్పించింది ప్రహ్లాద్‌కు.

భయంతో దుఃఖం తన్నుకొస్తుండగా వణికిపోతూ అన్నాడు—"మీకు దండం పెడతాను. నన్ను వదిలేయండి."

"ఇంత అవస్థపడి నిన్ను తీసుకొచ్చింది విడిచి పెట్టేయ టానికా? లాభంలేదు బాబూ! ఇక మేం చెప్పినట్లు వినా ల్సిందే" అన్నాడు ముందుకొస్తూ.

"నేనేం చేయాలి?" బెదిరిపోతూ అడిగాడు ప్రహ్లాద్.

"రేపట్నుండి మీవాళ్ళు బయట యెక్కడ కనిపించినా వాళ్ళని తప్పించుకు తిరగాలి. వాళ్ళతో మాట్లాడినా....మా విషయాలు వాళ్ళకు చెప్పినా...మీ అమ్మా, నాన్నల ప్రాణాలు తీసేస్తాం. మేము నలుగురమే కాదు, బయట ఇంకా చాలా మంది వున్నాం. అనుక్షణం నిన్ను వెంటబడి కాపలా కాస్తూంటాం. ఏ మాత్రం మా విషయం చెప్పాలని ప్రయత్నించినా అక్కడికక్కడే నిన్నూ, మీవాళ్ళనీ చంపేస్తాం. జాగ్రత్త!" కరకుగా హెచ్చరించాడు దూలంమీద కూర్చున్న వాడు క్రిందకు దిగి మొలలోని కత్తిని బయటకు తీసి చూపిస్తూ....

ఆ కొద్ది వెలుగులోనే ఆ కత్తి మిలమిలా మెరిసింది.

"ఇంతకూ నేనేంచేయాలి?" దుఃఖంతో మాటలకు బ్రేక్ పడుతుండగా అడిగాడు ప్రహ్లాద్.

"చేయిచాపి వెనక్కి తిరిగి నిలబడు" ఆజ్ఞాపించాడు గోడమీద కూర్చున్నవాడు సిగరెట్ దమ్ము గట్టిగా లాగి.

వాళ్ళెందుకలా చేయమన్నారో అర్థం కాలేదు. చెప్పినట్లు చేయకపోతే చంపేస్తారన్న భయంతో ఎడంచేయిచాపి వెనక్కితిరిగి నిలుచున్నాడు.

అంతే—

ఒక్కసారిగా గుండెల్లోనుండి గొంతును నెట్టుకొచ్చిందో ఆర్తనాదం.

రాడ్ దెబ్బతిన్న ఎడంచేయి వ్రేలాడబడిపోయింది.

4

ఎమ్.ఐ.జి. కాలనీలో రాజశేఖర్, భరత్‌ల ఇళ్ళకువెళ్ళి విచారించాడు రమణమూర్తి.

తమతో సినిమాకు వచ్చాడని, కాంప్లెక్స్ దగ్గర

బస్సెక్కి వెళతానని చెప్పటంతో వాళ్ళు వచ్చేశామని చెప్పారు.

పిచ్చిగా రోడ్లన్నీ తిరిగి పదకొండు అవుతుండగా ఇంటికి వచ్చాడు. తను వచ్చేసరికి ఇంట్లో ప్రహ్లాద్ వుంటాడన్న ఆశతో వచ్చాడు రమణమూర్తి. గుమ్మంలోనే నిలబడి ఆదుర్దా చెందుతూ కన్పించిన శ్రీలక్ష్మిని అడిగాడు.

"రాలేదా వాడు?"

"కన్పించలేదా?" ఎదురు ప్రశ్నించింది శ్రీలక్ష్మి.

"లేదు. సినిమానుండి యెప్పుడో బయల్దేరాడట."

గుమ్మంలోనే కూలబడిపోయి ఏడవసాగింది శ్రీలక్ష్మి.

"శ్రీ....ఊరుకో. మరేం భయంలేదు. నేను వెదికి తెస్తాగా వాడ్ని" భార్యను అనునయించి తిరిగి బయల్దేరాడు రమణమూర్తి.

ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో తప్పని సరై పోలీసు రిపోర్టిచ్చాడు.

వివరాలడిగి నోట్ చేసుకున్నారు ఎస్.ఐ.

"ఈ మధ్య వైజాగ్ పరిసర ప్రాంతాల్లో చిన్నపిల్లల్ని, హైస్కూల్ పిల్లల్ని ఎత్తుకుపోయే గ్యాంగ్ తయారైనట్లు మాకు సమాచారాలు అందుతున్నాయి. మేం జాగ్రత్తగా వాచ్ చేస్తున్నాం. ఇంత త్వరగా వాళ్ళు విజయనగరంలో కూడా విజృంభిస్తారనుకోలేదు. ఎనీహౌ....ఇక్కడమాత్రం వాళ్ళ ఆటలు సాగవు" అన్నాడు.

"పిల్లల్నిపట్టి ఏంచేస్తారు?" అర్థంగాక అడిగాడు రమణమూర్తి.

"కళ్ళుపీకి విదేశాలకు పంపిస్తున్నట్లు తెలిపింది."

ఆ మాట వినగానే ఎముకల్లోనుండి చలిపుట్టుకొచ్చింది రమణమూర్తికి "మైగాడ్" అన్నాడు.

"భయపడకండి. మీ బాబుకు ఏ హానీ జరక్కుండా పట్టుకోవటానికి ప్రయత్నిస్తాం" అన్నాడు.

శెలవు తీసుకుని బయల్దేరాడు రమణమూర్తి.

5

వేగంగా దూసుకుపోతోంది మద్రాస్ టు హౌరా మెయిల్—

కంపార్ట్‌మెంట్లో ప్యాసింజర్స్‌ని తప్పించుకుంటూ.... "ధర్మంచేయండి బాబూ!" అని అడుక్కుంటూ వస్తున్నాడు ఓ పద్నాల్గేళ్ళ కుర్రాడు.

వళ్ళంతా మట్టి కొట్టుకుపోయి, బట్టలు చిరిగిపోయి వున్నాయి. ఎడంచేయి చుట్టూ గుడ్డచుట్టబడి, మెడనుండి చేతికి కలిపి కట్టుకట్టి వుంది. కుడికాలు వాచి వుండటంతో నడిచేటప్పుడు భారంగా అడుగులువేస్తూ బాధపడుతూ అడుక్కుంటున్నాడు.

కొందరు కళ్ళుమూసుకు నిద్రపోతున్నట్లుగానో, లేక ప్రక్కవాళ్ళతో మాటల్లో పడిపోయినట్లుగానో నటిస్తుంటే జాలి, సానుభూతి కలవారు తోచినంత సాయం ఆ పిల్లాడి రేకు డబ్బాలో పడేస్తున్నారు.

రైలు రాజమండ్రికి చేరువ కాబోతోంది.

"బాబూ! పుణ్యముంటుంది. ఓ పదిపైసలు ధర్మం చేయండి" దాదాపు ఏడుస్తున్నట్లు అర్థించిన ఆ పిల్లాడివైపు చదువుతున్న పుస్తకం నుండి తలపైకెత్తి చూశాడు అర్జున్.

ఉలిక్కిపడినట్లు అన్నాడు—"ఒరేయ్ ప్రహ్లాద్!" అని.

ఆ పిలుపుకు ఆ పిల్లాడు కూడా ఉలిక్కిపడి వెంటనే ప్రక్కకు తిరిగి, ప్రక్కవాళ్ళని అడుక్కుంటూ మెల్లగా అక్కడ్నుంచి కదిలిపోయాడు.

వెళ్ళిపోతున్న ఆ కుర్రాడివైపు అలా చూస్తుండిపోయిన అర్జున్‌ని "ఎవరండీ అతను?" అని ప్రశ్నించాడు ఎదుటి సీటులోని బట్టతల వ్యక్తి.

"మా అన్నయ్య కొడుకు పోలికలుంటే పొరబడ్డాను. వాడు కాదు" అన్నాడు అర్జున్. అంతమందిలో ఓ బిచ్చగాడ్ని అలా పిలిచినందుకు కొద్దిగా సిగ్గుగా ఫీలయ్యాడు. అయినా ప్రహ్లాద్ గాడికిలా అడుక్కోవలసిన ఖర్మేందుకొస్తుంది?....అన్నయ్య వాడికేలోటూ రాకుండా చూసుకుంటుంటే....అనుకుని పుస్తకం చదవటంలో లీనమయ్యాడు.

అర్జున్ మద్రాసులో ఓ ప్రైవేట్ ఫర్మ్‌లో డిజైన్ ఇంజనీర్. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఇంటర్వ్యూ రావటంతో అనుకోకుండా వైజాగ్ ప్రయాణమయ్యాడు. అటునుండి విజయనగరం వెళ్ళి అన్న రమణమూర్తికూడా కనపడి రావాలని బయల్దేరేముందే అనుకున్నాడు.

రైలు రాజమండ్రిలో ఆగింది.

'ఛాయ్' వాడొస్తే....ఓ ఛాయ్ తాగి తిరిగి పుస్తకంలో తలదూర్చాడు.

ఇంతలో క్రిందకు దిగిన యెదుటి సీట్‌లోని బట్టతల వ్యక్తి ఆదరా బాదరా పరుగెత్తుకు వచ్చి...."సార్! మాట ఇటురండి" అని, టాయ్‌లెట్ వైపు లాక్కెళ్ళాడు అర్జున్‌ని.

బట్టతల వ్యక్తి ప్రవర్తనకు విస్తుపోతూ అతని వెనకాలే వెళ్ళాడు అర్జున్.

టాయ్‌లెట్ దగ్గర అంతగా ప్యాసింజర్స్ లేరు.

బట్టతల వ్యక్తిలోని కంగారు చూసి...."ఏమిటండీ?" అని ప్రశ్నించాడు అర్జున్.

"ఇందాక మీరు చూపింది మీ అన్నయ్య కొడుకునే"

అన్నాడు ఊపిరి పీల్చుకోవటానికి ఓ క్షణం ఆగి.

"వాట్...." అని అరిచాడు అర్జున్. మతి స్థిమితం తప్పినవాడిలా బట్టతల వ్యక్తి ముఖంలోకి చూస్తూ.

"నిజంగానండీ బాబూ!" అన్నాడు బట్టతల వ్యక్తి ఇంకా అదోరకమైన ఉద్వేగంతో.

"వాడు మా అన్నకొడుకే అని మీకెలా తెలుసు?" అనుమానంగా ప్రశ్నించాడు అర్జున్.

"టిఫిన్ చేద్దామని కాఫ్టేరియావైపు వెళితే—ఎవడో హిందీ సినిమాలో సెట్టీలాంటి గుండూగాడు ఆ కుర్రాడ్ని పట్టుకుని అడుగుతున్నాడు.

"ఏరా? ఆ రెండ్రూపాయల నోటిచ్చాడా అతను?" అని.

"మీరు ఫొటోలో చూపించిన వ్యక్తి ప్రక్కనే మా బాబాయి కూర్చుని వున్నాడు. నన్ను పోల్చినట్లున్నాడు. అనుమానం రాకుండా గబగబా వచ్చేశాను. మా బాబాయ్ నన్ను గుర్తిస్తే మీరు....మీరు....మా ఇద్దర్నీ చంపేస్తారుగా...." ఏడుస్తూ చెప్పాడా కుర్రాడు.

గుండూగాడు చిరాగ్గా ఓసారి గుండు రుద్దుకుని కోపంగా అన్నాడు—

"ఆ కంపార్ట్‌మెంట్లోకి మరలా వెళ్ళావంటే ఆ రెండో చేయి కూడా విరిగిపోద్ది. నిన్ను మావాళ్ళంతా కనిపెట్టి చూస్తూంటారు. జాగ్రత్త. ఆ కంపార్ట్‌మెంట్ వదలి.... అన్ని కంపార్ట్‌మెంట్లూ వెదుకు. మేము ఫోటోలో చూపించిన వ్యక్తి ఇప్పుడు వేషంమార్చి వుండొచ్చు. ఎవరైతే నిన్ను 'రెండ్రూపాయల చిల్లరుందట్రా అబ్బీ!' అని అడుగుతారో....ఆ వ్యక్తికి మేమిచ్చిన రూపాయి నోటు, నీ దగ్గర చిల్లరా ఇవ్వు. ఆ రెండ్రూపాయల నోటుమాత్రం

జాగ్రత్త. ఫో .... వైజాగ్ వెళ్ళేలోపున అతన్ని వెదికి పట్టుకుని మాకా నోటు అందించకపోతే నీ రెండో చేయి కూడా విరిగిపోతుంది. మీ బాబాయ్ కంపార్ట్మెంట్లో నేనుంటాను. మీ బాబాయ్‌తో మాట్లాడాలని ప్రయత్నిస్తే ఇద్దర్నీ అక్కడికక్కడే సఫాచేస్తాను. వెళ్ళు" అని లోగొంతుకతో హెచ్చరిస్తుంటే విని .. వెంటనే ఈ విషయం మీకు చెప్పాలని పరుగెత్తుకొచ్చాను. అందరూ ఎవరి గొడవలో వాళ్లుండటం వల్ల వాళ్ళిద్దరి సంభాషణా యెవరూ పట్టించుకోలేదు. నేను వాళ్ళకు అనుమానం రాకుండా వీపు వాళ్ళవైపువుంచి. ఎవరికోసమో చూస్తున్నట్లు నటిస్తూ విన్నాను" చెప్పటం ఆపి అర్జున్ ముఖంలోకి చూశాడు బట్టతల వ్యక్తి.

అర్జున్ ముఖంలో రంగులు మారుతున్నాయి.

ప్రహ్లాద్ గూండాల చేతిలో చిక్కినట్లుగానీ ...ఇంటి నుండి మాయమైనట్లు గానీ అర్జున్‌కు తెలియదు. అర్జున్ రమణమూర్తిని కలిపి ఆర్నెల్లు దాటింది. మధ్యలో ఒకటి రెండు ఉత్తరాలు తప్ప అన్న ఇంటి విషయాలేం తెలియవు అర్జున్‌కు.

వెంటనే ఓ నిర్ణయానికి వచ్చాడు అర్జున్.

"మీరు నాకొక్కించెం సహాయం చేయగలరా?" ప్రాధేయకంగా అడిగాడు.

"ఏం చేయాలి?" సంకోచిస్తూనే అడిగాడు బట్టతల వ్యక్తి.

"ఆ గూండాలు ఎంతమంది వున్నారో తెలియదు. మనం వెంటనే వెళ్ళి వ్రాడ్ని పట్టుకుంటే వాడికైనా, మనకైనా ఆపద తలెపెట్టొచ్చు ఒకవేళ వాడే వాళ్ళ భయానికి నేను వాడి బాబాయిని కానని చెప్పొచ్చు" అన్నాడు అర్జున్.

"అదీ నిజమే. అయితే ఏం చేద్దాం?" ఏదో ఒక ఏర్పాం

చర్ చేసి ఆ కుర్రాడ్ని ఈ గూండాల బారినుండి బయట పడేయాలన్న నిర్ణయానికొచ్చాడు బటతల వ్యక్తి.

"మీరూ వైజాగ్‌వరకే కదా ప్రయాణం."

"అవును"

"అయితే నేచెప్పినట్లు చేస్తారని ఆశిస్తాను"

"తప్పకుండా"

ఏం చేయాల్సిందీ ఆయన చెవిలో చెప్పాడు అర్జున్.

ఉత్సాహంగా తల పంకించాడు బట్టతల వ్యక్తి.

ఇంతలో మెల్లగా కదిలింది రైలు—

"ఇద్దరం ఒకేసారి వెళితే అనుమానం రావచ్చు. ముందు మీరెళ్ళి మీ సీట్లో కూర్చోండి. తర్వాత నేనొస్తాను." అని బట్టతల వ్యక్తిని పంపించేసి, టాయ్‌లెట్ డోర్ త్రోసుకుని లోపలికెళ్ళాడు అర్జున్.

రెండ్నిమిషాలు పోయిన తర్వాత టాయ్‌లెట్ నుండి బయటపడి తన సీటువైపు నడిచాడు.

అంతకు ముందు తన సీటు ప్రక్కన ఉండాల్సిన గడ్డపు వ్యక్తి బదులు, బట్టతల వ్యక్తి వర్ణించిన గుండూగాడు సిగ రెట్ కాల్చుతూ కూర్చుని వున్నాడు.

మెల్లగా వెళ్ళి గుండూగాడి ప్రక్కన కూర్చున్నాడు అర్జున్.

6

అన్నవరంలో ఆగింది రైలు—

బట్టతల వ్యక్తి చిన్న సంచి భుజాన వేసుకుని క్రిందకు దిగి అన్ని కంపార్ట్‌మెంటులూ వెతుక్కుంటూ నడవ సాగాడు.

అర్జున్ మాత్రం పుస్తకంలో తలదూర్చి చదువుతున్నట్లు నటించసాగాడు. ప్రహ్లాద్‌ని తను గుర్తించినట్లు గుండూ

గాడికి అనుమానం రాకూడదని అతని ఆలోచన.

బట్టతల వ్యక్తి వైజాగ్ వచ్చేంతవరకూ ప్రహ్లాద్‌ని ఫాలో అయి...వైజాగ్‌లో ఏదోవిధంగా కుర్రాడితో గొడవ పెట్టుకోవాలి. అప్పుడు అర్జున్‌గూడా రంగంలో దిగి, ప్రహ్లాద్‌ని రైల్వే పోలీసుల ద్వారా గూండాలనుండి రక్షిం చాలన్నది అర్జున్ బట్టతల వ్యక్తికిచ్చిన ప్లాన్.

బట్టతల వ్యక్తి మూడ్నాల్గు కంపార్ట్‌మెంట్‌లు వెదికే సరికి ట్రైన్ సిగ్నల్ అందుకుని కదిలింది. గబగబా ఓ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి అందులో వెదకసాగాడు.

అందులోగూడా ప్రహ్లాద్ లేడు.

రైలు ఆగినపుడల్లా వెదుతూనే వున్నాడు. అయినా ప్రహ్లాద్ కనిపించలేదు.

బట్టతల వ్యక్తి కంగారుపడసాగాడు. తర్వాత స్టేషన్ వైజాగ్. ప్రహ్లాద్ వెతుకుతున్న వ్యక్తి అతనికి రెండ్రూపాయల నోటు ఇచ్చేశాడేమో! మిగిలిన వాళ్ళు ప్రహ్లాద్‌ని ఎలాగైనా తప్పించి తీసుకుపోయారేమో! అలా ఆలోచిస్తున్నంతలోనే దయనీయంగా వినిపించింది — "బాబూ! ధర్మం చేయండి కళ్ళు తిరుగుతున్నాయి. ఓ పదిపైసలు ధర్మం చేయండి పుణ్య ప్రభువులు" నీరసంగా వినిపించిన ఆ పిలుపు దిక్కుకు గబగబా నడిచాడు బట్టతల మనిషి.

ఆ రెండ్రూపాయల నోటు ప్రహ్లాద్‌చేతికి ఇంకా అందనట్లు ఆందోళన చెందుతోన్న ప్రహ్లాద్ ముఖం చూసి పోల్చుకున్నాడు బట్టతల మనిషి.

చేతిలోని డబ్బా చాచి "బాబూ ధర్మం" అన్నాడు బట్టతల మనిషివైపు తిరిగి.

వెంటనే బట్టతల మనిషికో ఆలోచన వచ్చింది. ప్రహ్లాద్ వెదికే రెండ్రూపాయల నోటిచ్చే మనిషిలా తనే నటించి..

రెండ్రూపాయల నోటుమీద 'మీ బాబాయి నిన్ను గుర్తుపట్టాడు. నీకేం భయంలేదు, నీవు రైల్వే పోలీస్ స్టేషన్ దగ్గరకు వెళ్ళిపో" అని రాసి ఇస్తే ...అనుకున్నాడు.

దానివల్ల లాభంలేదని గ్రహించాడు.

ప్రహ్లాద్ ఆ నోటులో ఏముందీ చూడకుండా దాన్ని వాళ్ళ చేతికిచ్చేసినా, లేక వాళ్ళబాబాయినీ, తననీ చంపేస్తారన్న భయంతో పారిపోయినా లేనిపోనిచిక్కులు వస్తాయని ఊహించి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

"బాబూ ధర్మం"

పదిపైసల నాణెం తీసి డబ్బాలో పడేసి, వెళ్ళి ప్లాట్‌ఫాం వచ్చే డోర్‌వైపు నిలబడ్డాడు బట్టతల మనిషి.

వైజాగ్ స్టేషన్లో ట్రైన్ ఆగింది—

ప్రహ్లాద్ క్రిందకు దిగి మెల్లగా అడుగులు వేస్తున్నాడు.

గబగబా వెళ్ళి అమాంతం చిరిగిన ప్రహ్లాద్ షర్టు పట్టుకుని గర్జించాడు బట్టతల మనిషి—"ఏరా రాస్కెల్! అడుక్కుంటూ పర్సు కొట్టేస్తావట్రా?....చంపేస్తాను వెధవా మర్యాదగా నా పర్సు ఇచ్చెయ్!" అని గట్టిగా అరవసాగాడు.

"నాకేం తెలియదు బాబూ!" అని వణికిపోతూ బిక్కముఖం పెట్టాడు ప్రహ్లాద్.

ఛడేల్‌మని ప్రహ్లాద్ చెంపమీద కొట్టాడు బట్టతల మనిషి.

వెనక్కి పడ్డాడు ప్రహ్లాద్. కాలూ, చేయి నేలకు తగిలి విపరీతంగా బాధకల్గించటంతో గిలగిలలాడిపోయాడు.

అలా క్రిందపడతాడని ఊహించని బట్టతల మనిషి కూడా అందుకు బాధపడ్డాడు.

చుట్టూ జనం క్రమ్ముకుని "ఏం జరిగిందంటూ"

ప్రశ్నించసాగారు.

"వెధవ వేలెడు లేడు, జేబులో నుండి పర్సు లాక్కు-పోతున్నాడండీ. ఎక్కడన్నా పడేశాడో, లేకపోతే ఎవరి చేతుల్లోకన్నా మార్చేశాడో చెప్పి చావటం లేదు" మరో సారి కొట్టడాన్కి చేయి ఎత్తబోయాడు ఆవేశోద్రిక్తుడౌతూ.

"బాబూ! మీ కాళ్ళు పట్టుకుంటా. నాకేం తెలియదు" ఏడుస్తూ వచ్చి బట్టతల వ్యక్తి కాళ్ళు పట్టుకోబోయాడు ప్రహ్లాద్.

"తన్నండి. పోలీసులకు అప్పజెప్పండి వెధవని" అని ఒక్కొక్కరూ ఒకో రకమైన సలహా ఇవ్వసాగారు.

"పాపం....నిజంగా వాడు తీసుండడండి. వదిలేయండి" అని నచ్చజెప్పబోయారు ఒకరిద్దరు. గ్రహించాడు బట్టతల వ్యక్తి వాళ్ళంతా అదే గ్రూపుకు చెందిన గూండాగాళ్ళని.

ఈలోపు తన సూట్ కేస్, బట్టతల వ్యక్తి సూట్ కేస్‌తో రైల్వే పోలీసులను వెంటబెట్టు కొచ్చాడు అర్జున్.

ముందుగానే లోపల అన్ని విషయాలూ చెప్పిరావడంతో వస్తూనే ప్రహ్లాద్‌ని జుత్తు పట్టుకుని పైకి లేపి—"పదరా నా కొడకా! నాల్గు దెబ్బలు తగిలిస్తే గానీ అసలు నిజం చెప్పవు. మీరూ రండి" అని బట్టతల వ్యక్తిని కూడా తీసుకుని స్టేషన్ వైపు నడిచారు రైల్వే పోలీసులు.

వాళ్ళని చూడటంతో ప్రహ్లాద్‌ని విడిచిపెట్టేయమని చెప్పినవాళ్ళు మెల్లిగా జారుకున్నారు.

కేసు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు హాండోవర్ చేయబడింది.

ప్రహ్లాద్ ఆ గూండాగాళ్ళ చేతికి దొరికి అప్పటికి వారం రోజు లయింది. ఓ ప్రక్కన విరిగిన చేయి,

వాచిన కాలు బాధతో విపరీతమైన జ్వరంతో వున్నాడు. దానికి తోడు బట్టతల వ్యక్తి త్రోసినపుడు క్రిందపడటంతో ఆ చేతికి తీవ్రంగా వత్తిడి తగిలి తిరిగి బాధ విజృంభించ టంతో తట్టుకోలేక అర్జున్‌ని చుట్టుకుని ఏడ్వసాగాడు.

పోలీసుల సహాయంతో ప్రహ్లాద్‌ని కె. జి. హెచ్.లో స్పెషల్‌వార్డులో జాయిన్ చేశాడు అర్జున్.

బాధ తగ్గటానికి మత్తుమందిచ్చి ట్రీట్‌మెంట్ ప్రారం భించారు డాక్టర్స్.

7

కళ్ళు తెరచిన ప్రహ్లాద్‌కు ఎదురుగా తల్లీదండ్రీ కని పించేసరికి ఒక్కపెట్టున ఏడ్చాడు

శ్రీలక్ష్మి శోకమూర్తియే అయింది. ప్రహ్లాద్‌కు మోచేయి దగ్గర జాయింట్ విరిగిపోయిందనీ, ఆ చేయి ఇక పని చేయదని డాక్టరు చెప్పడంతో ఆ తల్లి హృదయం తల్లడిల్లగా ప్రహ్లాద్ తలని గుండెల కదుముకుని ఏడ్వ సాగింది.

రమణమూర్తి పైకి గంభీరంగా కనిపించినా మనసు లోనే మూగగా ఏడుస్తూ ప్రేమగా ప్రహ్లాద్ శరీరాన్ని నిమరసాగాడు.

"చూడు బాబూ! నిన్ను ఎవరు ఎలా తీసుకెళ్ళారో, వాళ్ళెలా వుంటారో, నిన్నేం చేశారో వివరంగా చెప్పు. వాళ్ళని పట్టుకుందాం" లాలనగా అడిగాడు ఇన్స్‌పెక్టర్ అమర్‌నాధ్.

"వాళ్ళెవరో నాకు తెలియదు. నాకేం తెలియదు.... నాకేం తెలియదు...." భయంతో వణికిపోతూ గట్టిగా రోదించ సాగాడు.

"నీకేం భయం లేదమ్మా! వాళ్ళు నిన్నేం చేయలేరు.

మేము వాళ్ళని పట్టుకుంటాం కదా! భయపడకుండా చెప్పు" అడిగాడు అమర్‌నాథ్.

"నాకేం తెలియదు....నాకేం తెలియదు...." ఏడుపు మరింత పెంచాడు ప్రహ్లాద్.

ఎవరెంత నచ్చచెప్పినా — "నాకేం తెలియదన్న" ఒక్క మాట తప్ప మరింకేం చెప్పలేదు ప్రహ్లాద్.

8

సమయం రాత్రి పదకొండు దాటుతోంది—

ప్రహ్లాదున్న స్పెషల్‌వార్డు ప్రశాంతంగా ఉంది.

మంచం మీద మత్తుగా నిద్రపోతున్నాడు ప్రహ్లాద్. మంచంకు కొంచెం దూరంలో ఈజీఛైర్‌లో నిద్రపోతున్నాడు అర్జున్. ప్రహ్లాద్‌కు తోడుగా తను పడుకుంటానని అన్ననీ, వదీన్ని బలవంతంగా ఇంటికి పంపేశాడు అర్జున్.

స్పెషల్‌వార్డులోకి ఓ అకారం మెల్లగా ప్రవేశించింది.

అడుగులో అడుగు వేస్తూ ప్రహ్లాద్ మంచాన్ని సమీపించింది. జేబులో నుండి బటన్‌నైఫ్ బయటకు తీసిందా అకారం.

అరసెకనులో చేయి పైకి లేచి బలంగా ప్రహ్లాద్ వైపు దూసుకురాబోయింది.

కానీ_అదే క్షణంలో ఆ అకారం నున్నటి గుండుమీద గట్టి దెబ్బ పడేసరికి "బాప్‌రే" అంటూ రెండు చేతులతో గుండు గట్టిగా పట్టుకుని నేలమీద కూలబడిపోయింది.

ఆ శబ్దానికి నిద్రమత్తు వదిలిన అర్జున్ గభాలున లేచి స్విచ్ ఆన్ చేశాడు.

ఆ వెలుగులో గుండుగాడ్ని చూసి అదిరిపడ్డాడు అర్జున్. ట్రెయిన్‌లో తన ప్రక్కను కూర్చున్న గుండుగాడే వాడు కావటంతో.

క్రిందపడిన గుండూగాడి బనియన్ పట్టుకుని పైకి లేపాడు ఇన్స్పెక్టర్ అమర్‌నాధ్.

"మీ లిలాంటి నిర్ణయానికి వస్తారని నాకు తెలుసురా. నువ్వెవరో, మీ ముఠా వివరా లేమిటో మర్యాదగా చెప్పేయ్" అన్నాడు పెడ రెక్కలు విరిచిపట్టుకుని.

"నాకేం తెలియదు" గింజుకున్నాడు గుండూవాల.

"నీకన్నీ తెలుసని నాకు తెలుసు. అవి నేనెలా తెలుసుకుంటానో పాపం....నీకే తెలియదు" ఆ మాటంటూ. గుండూగాడి చేతిమీదున్న 'పుర్రె' పచ్చబొట్టు చూసి ఉలిక్కిపడ్డాడు అమర్‌నాధ్.

'స్కల్ స్టార్స్' పెద్ద స్మగ్లర్స్ ముఠా. వాళ్ళంతా కర్కోటకులు హత్యలు చేయటంలో వాళ్ళకు వాళ్ళే సాటి. వాళ్ళని పట్టుకోవాలని గత ఏడాది నుండీ పోలీస్ డిపార్టుమెంట్ తీవ్రంగా కృషి చేస్తోంది ఈ దెబ్బతో ప్రమోషన్ ఖాయం అనుకున్నాడు అమర్‌నాధ్.

అంతలోనే ఊహించని సంఘటన జరిగిపోయింది.

గుమ్మంలో నుండి దూసుకొచ్చిన పదునైన బాకు గుండగాడి గుండెల్లో బలంగా దిగబడిపోయింది. వాడు బాధగా అరుస్తూ గిలగిలలాడి ప్రాణాలు వదిలేశాడు.

అర్జున్ గబ గబా గుమ్మం వైపు పరుగెత్తాడు ఎవ్వరూ కన్పించలేదు.

నిరాశగా గుండూగాడ్ని వదిలేశాడు అమర్‌నాధ్.

9

ప్రహ్లాద్ గది బయట పోలీసుల సెక్యూరిటీ వుంచాడు అమర్‌నాధ్.

'హాస్పిటల్లో హత్య' గురించి పేపర్లో వచ్చేసింది.

రాత్రి సంఘటన యథాతథంగా ప్రచురింపబడింది గానీ—'స్కాల్‌ప్టార్స్' ముఠాయే ఆ పనికి తలపడిన విషయం మాత్రం అందులో లేదు. ఆ విషయం అమర్‌నాథ్ గోప్యంగా వుంచాడని గ్రహించాడు అర్జున్.

రెండో పేజీ త్రిప్పగానే బట్టతల వ్యక్తి ఫోటో కనిపించ డంతో దృష్టి అటుసారించి ఉలిక్కిపడ్డాడు అర్జున్.

"సుందరరామయ్యా అనే నలభై ఏళ్ళ వ్యక్తిని నిన్న రాత్రి ఏడుగంటల సమయంలో పూర్ణా మార్కెట్ వద్ద గుర్తుతెలియని కొందరు వ్యక్తులు మారణాయుధాలతో హత్యచేసి పారిపోయారనీ, కె జి హెచ్. హాస్పిటల్లో హత్యకూ, ఈ హత్యకూ సంబంధం వుందేమోనని పోలీసు శాఖ అనుమానిస్తోంది" అని ప్రచురించి వుంది.

ఆ వార్త చదువుతూనే కసీ, బాధ కలగలితమై కంపించి పోయాడు అర్జున్.

'నాకు సహాయపడినందుకు ఆ దుర్మార్గులకు మీరు బలై పోయారా సార్!' అనుకున్నాడు బాధగా.

ఇద్దరు కాంపౌండర్స్ ట్రేలో టేబ్‌లెట్స్, సిరెంజ్, ఇంజక్షన్‌బోటిల్స్ తీసుకురావటంతో అన్యమనస్కంగా వెళ్ళి నిద్రపోతున్న ప్రహ్లాద్ మీద దుప్పటి తొలగించి, కుడిచేతి భుజంపైకి చొక్కా లేపి పట్టుకున్నాడు అర్జున్.

సిరెంజ్‌లోకి ఇంజక్షన్ చేయాల్సిన ప్రాంతాన స్పిరిట్ కాటన్‌తో తుడిచి సిరెంజ్ నీడెల్ ప్రహ్లాద్ భుజంవైపు తీసుకు రాబోయాడు కాంపౌండర్.

సరిగ్గా అదేసమయంలో ఆ కాంపౌండర్ మోచేతిపైన 'పుర్రె' పచ్చబొట్టు చూశాడు అర్జున్.

అంతే—మెరుపు వేగంతో ఆకాంపౌండర్ ముక్కు మీద గుద్దాడు. సిరెంజ్ క్రిందపడి ముక్కలై పోయింది.

కాంపౌండర్ వేషంలో వున్న స్కాల్‌స్టార్ వెనక్కి పడ్డాడు.

అర్జున్ ప్రక్కగా నిలబడిన రెండో స్కాల్‌స్టార్ .... గభాలున బెడ్‌మీద దుప్పటి అర్జున్ మీదకు లాగి, ఓ చేత్తో నోరుమూసి, రెండోచేత్తో అర్జున్ మెడని గట్టిగా నొక్క సాగాడు.

ఊపిరి అందక ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు అర్జున్.

అర్జున్ దెబ్బకు తేరుకున్న మొదటి స్కాల్‌స్టార్ జేబులో నుండి కత్తి బయటకు తీసి, గింజుకుంటున్న అర్జున్ కడుపులో పొడవబోయాడు.

అప్పుడే వచ్చి ప్రహ్లాద్‌కు సెక్యూరిటీగా వున్న కానిస్టేబుల్స్‌కు కొన్ని ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తున్న అమర్‌నాథ్ లోపల ఏవో శబ్దాలు వినిపించేసరికి గభాలున లోపలకు నడిచాడు.

అర్జున్‌ని పొడవబోతోన్న స్కాల్‌స్టార్ మీదకు చేతిలోని లాఠీ విసిరికొట్టి, అర్జున్ మెడ నొక్కేస్తున్నవాడి మీదకు వెళ్ళి పడ్డాడు.

ముఖానికి మరలా దెబ్బతగలటంతో కత్తి వదిలిపెట్టి, ముఖాన్ని రెండుచేతులతో పట్టుకుని బాధతో చిందులేయ సాగాడు స్కాల్‌స్టార్.

అమర్‌నాథ్ వెనుకనే లోపలకొచ్చిన కానిస్టేబుల్స్ వాళ్ళని లొంగదీసుకున్నారు.

స్కాల్‌స్టార్స్ ఇద్దర్నీ స్టేషన్‌కు తీసుకువెళ్ళి టార్చర్ ప్రారంభించాడు అమర్‌నాథ్.

* * *

హోటల్ 'మూన్‌లాండ్'పై తన సిబ్బందితో రైడ్ చేశాడు అమర్‌నాథ్ —

మూన్‌లాండ్ హోటల్ ప్రొప్రయిటర్ మన్‌మోహన్ మిత్రా. అతను పెద్ద పారిశ్రామికవేత్త, పొలిటికల్ లీడర్.

ఆ హోటల్ అండర్‌గ్రౌండ్‌లో దాదాపు ఇరవై మందికి పైగా బలవంతంగా అంగవైకల్యం కల్పించబడిన పిల్లలున్నారు. కళ్ళు పీకేయబడిన ఏడెనిమిదేళ్ళ పిల్లల శవాలు నాలుగు దొరికాయి. ఎదురు తిరగబోయిన స్కార్‌స్టార్‌ని అదుపులోకి తీసుకుని అందర్నీ పోలీస్ వ్యాన్‌లోకి ఎక్కించాడు అమర్‌నాథ్.

* * *

అదేపనిగా ఫోన్ మ్రోగటంతో బయటకెళ్ళటానికి డ్రస్ చేసుకుంటోన్న మన్‌మోహన్‌మిత్రా చిరాగ్గా రిసీవర్ అందుకున్నాడు.

ఫోన్లోవార్త వినటంతోనే మెషిన్‌గన్‌తో వళ్ళంతా తూట్లు దిగినట్లు ఫీలయ్యాడు.

అప్రయత్నంగా రిసీవర్ జారి క్రిందపడిపోయింది.

మెల్లిగా నడిచి తన డబల్‌కాట్‌కున్న సీక్రెట్ సెల్ తెరచి రివాల్వర్ బయటకు తీశాడు.

నల్లగా నిగనిగలాడుతోందది.

10

మన్‌మోహన్‌మిత్రా బంగ్లాముందు పోలీస్‌జీప్ ఆగింది.

కొద్దిమంది కానిస్టేబుల్స్‌ను బంగ్లా బయట కాపలా వుంచి, ఇద్దరు కానిస్టేబుల్స్‌తో గబగబా మిత్రా గదివైపు నడిచాడు అమర్‌నాథ్.

తలుపుమూసి వుండటంతో మెల్లగా త్రోశాడు.

ఆహ్వానిస్తున్నట్లుగా తెరచుకుంది పుష్‌డోర్. ఎదురుగా కనిపించిన దృశ్యానికి అవాక్కై నిలబడిపోయాడు అమర్‌నాథ్.

రక్తం మడుగులో పడివున్నాడు మన్‌మోహన్‌మిత్రా.

అతని చేతిలో రెపరెపలాడుతోన్న కాగితం—

మెల్లగా నడిచి మిత్రా చేతిలోని కాగితం తీసుకుని చదవసాగాడు అమర్‌నాధ్.

"ఇన్‌స్పెక్టర్!

నువ్వు నన్ను అరెస్టు చేయటానికి వస్తావని నాకు తెలుసు. తలదించుకు బ్రతికే పరిస్థితికన్నా....తల పగల కొట్టుకు చావటాన్నే హర్షిస్తాను.

మనిషినై పుట్టి రాక్షసుడిలా ప్రవర్తించాను.

రాక్షసుడిలా మారటానికి ఈ మిత్రా వెనుక ఓ విషాద చరిత్ర వుంది.

ఊహ తెలియకుండానే తండ్రిని పోగొట్టుకున్నాను. తెలిసేసరికి తల్లిని కోల్పోయాను. ఏకాకిగా....బికారిగా ఈ ప్రపంచంలో మిగిలిపోయాను.

ఆకలి....విపరీతమైన ఆకలి...పట్టెడు మెతుకులకోసం పరితపించిపోయే ప్రాణం. శోషవచ్చి పడిపోయిన రోజు లనేకం.

ఆకలి....ఆకలి....

దాన్ని చంపే ఏకైక ఆయుధం డబ్బు...

అదిలేని నా నిస్సహాయస్థితి....దేనిమీదో చెప్పలేని కసి.

అదే సమయంలో నాలో ఓ దృఢ నిర్ణయానికి అంకు రార్పణ జరిగింది. ఎలాగైనా సరే సంపాదించాలి. వేలు... లక్షలు....కోట్లు .... లెక్కలేనంత డబ్బు సంపాదించాలి. చేతిలో పైసాలేని ఈ దరిద్రుడే దేశంలోని ధనవంతుల్లో కెల్లా అగ్రగణ్యుడిగా నిలవాలన్న అభిలాష.

చేతిలో పైసాలేదు...ఆశలనేకం అనుకున్నాను.

కానీ—అప్పుడే నా జాతకం మారి నాకో పర్సు దొరికింది. మూడొందల చిల్లరవుంది అందులో.

ఇప్పుడు నా ఆస్తి కొన్నికోట్లలో వుంది. ఇంత ఆస్తి సంపాదించటాన్కి పెట్టుబడి కల్పించింది మాత్రం ఆ మూడొందలే. ఎన్నో మోసాలు చేశాను. మరెన్నోగారడీలు చేశాను.

కొంచెం ఉన్నతస్థితికి చేరేసరికి స్మగ్లర్స్‌తో స్నేహం కలిపింది. దానితో మరింతగా విజృంభించాను. ప్రభుత్వానికి తెలిసేట్లు వ్యాపారాలు కొన్ని తెలియకుండా మరెన్నో....

తిండిలేక మలమలా మాడే కొందరు దరిద్రుల్ని కూడ గట్టుకుని 'స్కల్‌స్టార్స్' పేరున ఓ గ్రూపును తయారు చేసుకుని మరిన్ని అరాచకాలు కొనసాగించాను. ముఖ్యంగా చిన్నపిల్లల కనుగ్రుడ్లు పెకిలించి విదేశాలకు పంపించటం. కొంతమంది కుర్రవాళ్ళకి అంగవైకల్యం కల్పించి ఎవరికీ అనుమానం రాని విధంగా మాకు మీడియేటర్స్‌గా ఉపయోగించుకున్నాం. వాళ్ళని వాచ్ చేస్తూ కొద్దికాలం జాగ్రత్త పడితే చాలు. ఆ తర్వాతవాళ్ళే మా మనుషులుగా, మా చెప్పుచేతల్లో నడవటాన్కి అలవాటుపడిపోతారు.

ప్రహ్లాద్ విషయంలో నా 'స్టార్' తప్పటడుగువేశాడు. ఫలితం-నన్ను నమ్మకున్న నా స్టార్స్ అందరూ నీ ఆధీనం లోకి, నేనిలా....

నాలాంటి అత్యాశాపరులంతా చివరి కిలాంటి చావే చస్తారేమో!

—మన్‌మోహన్‌మిత్రా."

చదవటం పూర్తికాగానే భారంగా నిట్టూర్చి ఫోన్‌వైపు నడిచాడు అమర్‌నాథ్ తర్వాత ఏర్పాట్లు చేయటాన్కి. □

ఆటోడ్రైవర్

బి.రాజేశ్వరి

బస్‌కోసం ఎదురుచూపి చూపి విసిగిపోయింది అరుణ.

టైం చూడబోతే సాయంత్రం ఆరుగంటలుదాటి ఇరవై నిమిషాలయింది.

అసలే ఆయనకు కోపం, దాంతోపాటు అనుమానం పాలు ఎక్కువ అయిదున్నరకు ఇంట్లోవుండి తీరాలంటాడు. ఓ పదనిమిషాలు ఆలస్యమైనా యిప్పటిదాకా ఏంచేస్తున్నావు, ఎక్కడ వూరేగివచ్చావు? అంటూ ప్రశ్నలతో వేటాడి చూపుల్తో వేధించి, తనని ముద్దాయిని చేసి చెండుకు తింటాడు.

తను బస్‌లో పదికిలోమీటర్లు ఆఫీసునించి యింటికి ప్రయాణంచేసి వెళ్ళటానికే అరగంటపడుతుందని తెలీదా? ఆఫీసునుంచి బయటికి రాగానే బస్‌దొరికినా, ప్రయాణం చేసి కాలనీకి చేరేసరికి కనీసం నలభై నిమిషాలు పడుతుంది. ఈ మనిషికి నచ్చచెప్పేదెలా?

భర్తమీద కోపం తన పరిస్థితికి తనమీద తనకే జాలి ఒకేసారి పుట్టాయి అరుణకు.

మొదట్లో తనపట్ల చాలా ప్రేమగా, సరదాగా వుండే వాడు తన భర్త. అయితే అతనికున్న ఒకే ఒక వ్యసనం పేకాట. రాత్రింబవళ్ళు పేకాడమన్నా నిద్రాహారాలు అక్కర్లేకుండా ఆటలో కూర్చుంటాడు. ఆ వ్యసనమే చివరికి అతని ఉద్యోగం పోగొట్టింది.

ఆఫీసుసొమ్ము పెట్టి పేకాడి పోగొట్టుకున్నాడు. ఒకటి రెండు కాదు, పదివేలు! ఒక్కసారిగా అంత డబ్బు సమ కూర్చలేకపోయాడు. ఆఫీసరుకి నిజం తెలిసిపోయింది. పోలీసు రిపోర్టు యివ్వబోతుంటే కొలీగ్స్ అడ్డుపడి రక్షిం చారు. డబ్బు కట్టేస్తే రిపోర్టు యివ్వనని ఆఫీసరు మధ్య మార్గం సూచించాడు.

తనభర్త సూర్యం ఇంట్లోని విలువైనవస్తువులు, తన మెళ్ళోని మంగళసూత్రాలతో బాటు బంగారు వస్తువులు తెగనమ్మేసి పదివేలు కట్టేశాడు. పోలీసుకేసు లేకుండా కనికరించాడేగాని, ఉద్యోగంలో కొనసాగటానికి అంగీక రించలేదు ఆఫీసరు.

ఫలితంగా సూర్యం రోడ్డుమీద నిలబడవలసి వచ్చింది. ఇద్దరు పిల్లల్ని, తనని అన్యాయం చెయ్యలేక ఆత్మహత్య ప్రయత్నం చేయబోయిన భర్తను కాళ్ళా వేళ్ళాపడి బతి మాలుకుని, ఆపగలిగింది. కాని, రేపు గడిచేదెలా? అనే

ప్రశ్న తేలుకొండీలా ఆమె కళ్ళముందు నిలిచి భయ పెట్టింది.

అయితే ఆ తర్వాత నాలుగురోజుల్లోనే ఆమెకు పరిష్కారం లభించింది. ఆమె భర్తకు తెలీకుండా ఓ ఉద్యోగ ప్రకటన చూపి అప్లై చేసింది. అతనికి తెలిస్తే అంగీకరించడని ఆమెకు తెలుసు. వున్న అర్హతలను, చదువును సద్వినియోగం చేసుకోవటమేకాక, భర్త సంపాదనకు వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడన్నట్టు తనూ పాలుపంచుకోవాలని చేసిన ఉద్యోగ ప్రయత్నం, భర్త ఉద్యోగం పోయాక ఫలించింది.

తనకి ఉద్యోగం వచ్చిన వార్త చెప్పగానే భర్తముఖం సంతోషంతో వెలగటం తనకి బాగా గుర్తు! వద్దంటాడను కొందిగాని, అవసరం భర్తని మూగవాడిగా చేసేసిందని గ్రహించింది.

అయితే, ఉద్యోగంలో చేరిన వారంరోజులకే భర్త సాధింపు మొదలయింది తనకు. ఓ పదినిమిషాలు ముందుగా వెళ్ళే తప్పు, ఓ పదినిమిషాలు యింటికి రావటం ఆలస్యమైతే తప్పు! ప్రతిదానికీ ఆరాలు! అయినా భర్తకెదురు చెప్పకుండా పెదవి కదపకుండా తనపని తాను యంత్రంలా చేసుకుంటూ పోతోంది. ఆమె కళ్ళముందు ఒకే ఒక దృశ్యం—తన బిడ్డలు అనాధలుగా రోడ్లమీదపడి అడుక్కు-తినటం—కనిపించి, ఒళ్ళు జలదరింప జేస్తుంది. ఆ దృశ్యం నిజం కాకూడదనే ఆమె గడపదాటి ఉద్యోగంలో చేరింది!

ఆరుగంటల ఏభై నిమిషాలయింది. అరుణ విసుగ్గా వాచీ వంక, రాని బస్సువంక చూసుకుని గాఢంగా నిట్టూర్చింది. ఆటో పిలిచి వెళ్ళిపోదామనుకుంది ఓ క్షణం! కాని, ఆమె పర్సు అందు కంగీకరించలేదు.

పాపం, ఆయనమాత్రం ఏం చేస్తాడు? దర్జాగా ఆఫీసుకి వెళ్ళొచ్చే మనిషి. బయటిప్రపంచంతో సంబంధం తెంచుకుని యింట్లో కూచోవాలంటే నిజంగా రంపపుకోత। తన భర్త ఆ రంపపుకోతను, మనోక్షోభను అదుపులో పెట్టుకోలేకనే తనమీద ప్రతిరోజు విరుచుకుపడుతున్నాడు. ఆ విషయం తనకి తెలుసు।

అందుకే తను భర్తమీద కోపం తెచ్చుకోవాలన్నా తెచ్చుకోలేకపోతోంది। పైగా అతనిపట్ల జాలితోను, ఆర్ద్రతతోను మనసు కరిగి నీరైపోతుంటుంది. తన ఇద్దరి పిల్లలి మనస్తత్వం కన్న అతనిది భిన్నంగా లేదనిపిస్తుంది అప్పుడప్పుడు। అతనిపట్ల అభిమానం మనసు పొరల్లోంచి బయటకి ఉరకలువేస్తుంది....

టైం చూసుకుంది. ఏడూ పదినిమిషాలు।

తన రూట్ బస్సులు నాలుగు వెళ్ళాయి. కాని ఒక్కటీ ఆ స్టేజిలో ఆగలేదు. జనం ఫుట్‌బోర్డుమీద నిల్చుని వేలాడుతున్నారు. ప్రాణాలకి తెగించి వాళ్ళెందుకు అలా వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు? బస్సులకొరతవల్లనా? పెరిగిపోతున్న జనాభా కారణంగానా? ఎందుకిలా జరుగుతోంది? ఆమె తనని తాను ప్రశ్నించుకున్నది.

పదినిమిషాలు తక్కువగా ఎనిమిదయింది.

అప్పుడు గమనించింది అరుణ, తను నిల్చున్న స్టేజీ దాదాపు నిర్మానుష్యంగా తయారైన విషయం। అసలే, పగలే సందడిగా వుండదా ప్రాంతంలో. అలాంటిది రాత్రి ఎనిమిదిగంటలకు నిర్మానుష్యంగా వుండక ఏమవుతుంది?

ఆమెలో అలజడి మొదలయింది. తన దగ్గిర బంగారు వస్తువులేంలేవు. దొంగలభయంలేదు. కాని, అంతకన్న విలువైన మానాభిమానాలు పోతే రావు. ఆమె భయం

నిజమయి, అదే సమయానికి తన ఇరువైపులా యిద్దరు వ్యక్తులు వచ్చి నిల్చొని ఆమెవంకే తదేక దీక్షతో చూడ సాగారు.

అరుణ ఉలిక్కిపడింది! అనుమానంలేదు. వాళ్లు పచ్చి నెత్తురు తాగే గూండాల్లావున్నారు. తనవైపు ఆకలి చూపులు ప్రసరిస్తున్నారు. తనిక్కడ మరోక్షణం కూడా వుండకూడదు! ఆమె అంతరాత్మ హెచ్చరిస్తోంది! ఆమెకు మెరుపులా ఓ ఆలోచనవచ్చింది. తన పర్సులో ప్రస్తుతం డబ్బులేకపోయినా యింటిదగ్గర డబ్బు ఇవ్వొచ్చుగా ఆటో వాడికి!?

ఆ ఆలోచనరాగానే ఇక ఆలస్యం చెయ్యలేదామె. అప్పటికే వాళ్ళిద్దరు ఆమెను రాసుకున్నంతదగ్గరగా వచ్చేశారు. నాటుసారా వాసన గుప్పున కొట్టింది.

"ఆటో!" పిలిచిందామె.

ఆటో సర్రునవచ్చి పక్కనే ఆగింది. ఆమె మెరుపు వేగంతో దాంట్లో ఎక్కింది.

"కహా(ఁ జానా?" అన్నాడు ఆటోవాలా ఏమాత్రం గౌరవం చూపకండా. అరుణ అవన్నీ గమనించేస్థితిలో లేదు.

వణుకుతున్న శరీరాన్ని అదుపులోపెట్టుకుంటూ "విజయ నగర్ కాలనీ!" అన్నది.

ఆటో ముందుకురికింది. పదినిమిషాల తర్వాత గ్రహించిందామె, ఆటో విజయనగర్ కాలనీ వైపుకాకుండా మరో దారిన పోతున్నట్టు!

"ఆటో. నేను చెప్పింది విజయనగర్ కాలనీ! ఈ రోడ్ పాతబస్తీకిపోతుంది. లక్డీకాపూల్ వైపు వెళ్ళాలి!" అన్నది ఆందోళనగా.

"నీకు తెల్వాదులేమ్మా. ఒన్‌వేవుంటుండ్లా. నయాపూల్ మీదెళ్ళి ఎల్లాలి!" అన్నాడు ఆటోవాలా తలకూడా తిప్పకుండా.

అరుణ అమాయకురాలుకాదు. నయాపూల్‌మీదుగాపోతే పాతబస్తీ వస్తుందిగాని, తన కాలనీరాదు. పాతబస్తీ మీదుగా విజయనగర్‌కాలనీ వెళ్ళవలపిన పనిలేదు. అసలు ఆ వైపు ఒన్‌వేట్రాఫిక్ సమస్యేరాదు. లక్డీకాపూల్ వెళ్ళితీరాలి!

"ఇక్కడ ఆపెయ్! దిగిపోతాను" ఆమె ఆటోలోనుంచి దూకినంతపని చేసింది.

ఆటోవాడిలో ఆపేసూచనలు కనిపించకపోగానే "పోలీస్‌ని పిలుస్తాను. ఆపుతావా, లేదా?" అన్నది అరుణ కోపంగా. ట్రాఫిక్ కానిస్టేబుల్సు ఇంకా డ్యూటీ దిగలేదు. చౌరస్తాలో బీటుకానిస్టేబిలున్నాడు. ఆటో అతన్ని సమీపించబోతుండా ఆటోవాడితో ఆ మాటన్నది ఆమె.

ఆటోవాడు ఏమనుకున్నాడో ఆటో చటుక్కున వెనక్కి తిప్పి, "చెప్పమ్మా, ఎటుబోవాల మల్ల?" అన్నాడు.

"కోఠీ, ఆబిడ్స్‌మీదుగా లక్డీకాపూల్, మాసబ్‌టాంక్." చెప్పింది అరుణ.

ఆటోవాలా బాదర్‌ఘాట్ బ్రిడ్జి ఎక్కాడు. "ఇదిగో, యిందాకా నేను ఆటోఎక్కిన చోటికి రాగానే నీ మీటరు వెనక్కితిప్పు. మినిమమ్‌లో పెట్టి వుంచు. పాతికరూపాయలయింది, యిమ్మంటే యిచ్చేదాన్నికాదు. మా ఆఫీసునించి కాలనీకి సరిగ్గా అయిదురూపాయల ఎనభైపైసలవుతుంది. అంతకుమించి పదిపైసలు కూడా ఎక్కువిచ్చేదిలేదు" అన్నది అరుణ ఖచ్చితంగా.

ఆటోవాలా చిత్తయిపోయాడు. ఎంతో అమాయకంగా

కనిపిస్తున్న ఆ యువతి ఘటికురాలే అనుకున్నాడు. తను ఊహించిందొకటి, జరిగింది మరొకటి!

"మీటర్‌మీద అయిదురూపాయ లెక్కువివ్వాలి!" అన్నాడు వాడు మడతపేచీకి దిగుతూ.

అరుణకి అరికాలిమంట నెత్తికెక్కింది "మరోసారి చెప్తున్నాను: మీటర్‌మీద పదిపైసలు కూడా ఎక్కువిచ్చేది లేదు!" అన్నది.

ఆటో షడన్‌గా ఆపేసి క్రూరంగా చూశాడు ఆటో వాలా. అరుణ ప్రమాదం శంకించింది. అతనాగినచోట దాదాపు పది పదిహేను ఆటోలు ఆగిన స్టాండుంది. తన వాళ్ళతో కలిసి అతనేదయినా అఘాయిత్యం చేస్తే....?

"సరే... సరే... పోనివ్వు, అలాగే యిస్తాను!" అన్నది అతనికి నమ్మకం కలిగేలా చెప్పి.

ఆటోవాలా విజయగర్వంతో ఆటో స్టార్టుచేసి ముందుకు పోనిచ్చాడు. ఆమె యింటాకా ఎక్కిన స్టేజిదగ్గర కొచ్చాక మీటరు మినిమమ్‌కి తిప్పాడు.

అరుణ మనసులోనే నిర్ణయించుకుంది —యింటికి చేరాక కేవలం మీటర్ ఛార్జిమాత్రమే యిచ్చి ఆటోవాలాని దెబ్బతియ్యాలని!

ఆమె యింటికి చేరేసరికి వీధిలోనే ఆమెకోసం ఎదురు చూస్తూ చిందులు తొక్కుతున్నాడు సూర్యం.

అరుణ అతన్ని దాటుకుని లోనికివెళ్ళి అల్మయిరాలో నుంచి అయిదురూపాయల కాగితం తెచ్చింది. తన దగ్గిరున్న రూపాయితో కలిపి, "ఇదిగో నీ మీటర్‌ఛార్జి!" అన్నది ఆటోవాలాతో.

సూర్యం అప్పటికే బాగా వేడిమీదున్నాడు. "ఇంత సేపూ ఎక్కడ వూరేగివచ్చావు? అసలు నీకు భయంభక్తి

లేకుండా పోతున్నాయి....” అంటూ చిందులు వేయ సాగాడు.

అరుణ ఆటోవాలాముందు అల్లరిపడటం యిష్టంలేక మౌనంగా డబ్బుతీసుకుని బయటికొచ్చింది.

“ఇదేందమ్మో, మీటరుమీద అయిదురూపాయలు కూడా యిమ్మంటివిగాదా.” అన్నాడు ఆటోవాలా.

“ఎందుకివ్వాలి? ఇప్పుడు తొమ్మిదిగంటలేగా యింది. పదకొండు దాటితేనే నీకు అదనపుఛార్జి యివ్వాలి! మీటర్ మీద ఎక్కువెందుకివ్వాలి?” అన్నది ఆటోవాలా వంక నేనే గెలిచానన్నట్టు చూస్తూ.

సూర్యం “ఎందుకు గొడవ? అదేదో యిచ్చిపడెయ్యి!” అన్నాడు. అరుణ చురుగ్గా చూసింది భర్తవంక. వాడితో దెబ్బలాడవలసిందిపోయి పిరికివాడిలాగా డబ్బిచ్చెయ్య మంటున్న భర్తనేమనాలో అర్థంకాలేదామెకు.

చుట్టుపక్కలవాళ్ళు గుమిగూడేలోపలే ఆటోవాలాస్టార్టు చేసుకుని “ఆ ఆర్రూపాయలు కూడా నీ దగ్గరేవుంచుకో!” అంటూ వెళ్ళిపోయాడు వేగంగా.

ఒక్క క్షణం తడబడింది అరుణ. ఆటోవాళ్ళపట్ల సదభిప్రాయం లేదామెకు. వాళ్ళల్లో చాలా దుర్మార్గులుంటా రని విన్నది. వీడుపోయి మూకను వేసుకొనివచ్చి గొడవ పెడతాడని భయపడది.

దానికి తోడు సూర్యం చిందులు ఎక్కువయిపోయాయి. “అర్ధరాత్రిదాకా ఆడది ఊరుమీద బలాదూరు తిరిగివస్తే యింట్లో చిన్నపిల్లలేమయిపోతారు? వాళ్ళ ఆలనా పాలనా ఎవరు చూస్తారు? అసలు తొమ్మిదిగంటలవరకు ఎక్క డున్నావు? ఏం చేస్తున్నావు?” ప్రశ్నలతో వేధించసాగాడు సూర్యం.

అరుణ వివరించబోయింది. కాని అతను వినటానికి సిద్ధంగా లేడు. "వాడెవడితోనో గొడవకూడా పెట్టుకున్నావు. మనబతుక్కి సిటీబస్ చాలదా? ఆటో కూడానా!" అన్నాడు వ్యంగ్యంగా.

అరుణ మౌనంగా తన పనుల్లో పడిపోయింది.

2

తెల్లవార్లూ కలతనిద్రతోనే గడిపింది అరుణ. అర్ధరాత్రి ఎప్పుడొచ్చి గొడవచేస్తాడోనని ఆమె మనసు పీచుమం టూనే వున్నది! కాని, ఆటోవాలా మళ్ళీ రాలేదు. తనకి కాలనీలో స్థానబలముంది. అందుకే వాడు రాలేదు

"ఈ రోజైనా పెందలాడే వస్తావా, పెత్తనాలు చేసు కుని అర్ధరాత్రొస్తావా!" కోపం ధ్వనించింది సూర్యం గొంతులో.

చీరకుచ్చిళ్ళు బొడ్డులో దోపుకుంటూ. "వచ్చేస్తానండీ! నిన్న బస్ దొరక్క దానికోసం యెదురుచూసి చూసి చివ రకు...." ఆమె చెప్తుండగానే, "వెళ్ళు. నాకు కథలొద్దు!" అంటూ లోనికి వెళ్ళిపోయాడు హడావిడిగా సూర్యం.

గాఢంగా నిట్టూర్చి బయలుదేరింది అరుణ. అంత క్రితం ఓ అరగంట ముందే పిల్లలిద్దర్నీ కాన్వెంటుకి పంపే సింది. మామూలుగా తనెక్కే బస్ యెక్కి ఆఫీసుకి వెళ్ళిపోయింది.

సాయంత్రం మళ్ళీ అదే స్టాప్‌లో నిల్చుంది.

అకస్మాత్తుగా ఓ సంఘటన జరిగిపోయింది.

ఎవడో ఓ వ్యక్తి అకస్మాత్తుగా ఆమెను ఒడిసి పట్టుకుని గుండెలమీదికి లాక్కున్నాడు. అదే సమయానికి ఎక్కడో మెరుపులు మెరిశాయి. ఆ వ్యక్తి ఆమె నొదిలేసి అప్పుడే పక్కకొచ్చి ఆగిన ఆటోలో వెళ్ళిపోయాడు.

అంతా క్షణాలమీద జరిగిపోయింది.

అరుణ అనుకోని యీ సంఘటనతో నిర్ఘాంతపోయింది. సర్దుకోవటానికి రెండు నిమిషాలు పట్టింది. ఇంకా చీకటి కూడా పడలేదు. అలాంటి సమయంలో ఆ దుండగుడు యెంత ధైర్యంగా తనమీద అత్యాచారం జరిపాడు? ఛ. ఛ, చాలామంది చూశారా సంఘటన. కాని ఒక్కళ్ళూ యిదే మన్యాయమని వాళ్ళను అడిగిన వాళ్ళులేరు. అంతా చోద్యం చూస్తూన్నట్టుండిపోయారు.

అరుణ కళ్ళు సంతతధారగా వర్షిస్తున్నాయి. ఇంతలోనే ఆమె ఎక్కాల్సిన బస్ వచ్చేసింది. కళ్ళు తుడుచుకుని బస్ యెక్కేసింది. యెలా వచ్చిపడిందో యింటికి ఆమెకే తెలియదు

పడగ్గదిలో మంచంమీద బోర్లా పడుకుని కరువుతీరా వెక్కి వెక్కి ఏడ్చింది. సమయానికి సూర్యం ఇంట్లోలేడు. పిల్లల్నిద్దర్నీ తీసుకుని ఎటో షైరుతీసుకుని వెళ్ళుంటాడు. కమ్యూనిటీ హాలుదగ్గిర పార్కుంది. సాయంకాలాలు పిల్లల్ని అక్కడికి తీసుకువెళ్ళడం అతని కలవాటే!

హృదయ భారం తీరేవరకు ఏడ్చి లేచి బాత్‌రూంలో మొహం కడుక్కుని వచ్చింది అరుణ. ఇంతలో భర్త, పిల్లలు వస్తున్న అలికిడి అయింది. లేచి టీ పెట్టడానికి ప్రయత్నాలు చేసింది.

రాత్రి నిద్రకుపక్రమించబోయే ముందు, ఆ దుండగుడు తనమీద అఘాయిత్యమెందుకు చేయబోయాడని ఆలోచించింది. కారణం బోధపడలేదు.

ఆటోవాలాకి, యీ సంఘటనకు ఏదైనా సంబంధముందా అని ఆలోచించింది. కంగారులో ఆటో డ్రయివర్‌ను చూడలేదు తను. ఆటోడ్రైవర్ తనమీద పగ తీర్చు

కొందలచుకుంటే అతనే తనని పట్టుకుని వుండేవాడు. కాని తనను పట్టి మీదకు లాక్కున్న వ్యక్తి పరాకడు. వాడ్ని తనెప్పుడూ చూళ్ళేదు!

ఆటోవాలా యెవర్నయినా నియోగించాడా? తననేం చెయ్యాలని వాడి ఉద్దేశ్యం? కేవలం నడిరోడ్డుమీద తనని తాకి అవమానించడమేనా? లేక పరేదైనానా? ఏదో అయితే, తనని అందరూ చూస్తూండగా పట్టుకుని వెంటనే వదిలేసి ఆటోలో యెందుకు పారిపోయినట్టు?

అరుణ మనసంతా చికాకుగా తయారయింది ఆమె కళ్ళనుంచి నీళ్ళు రావడంలేదు. గుండెల్లో దుఃఖం పేరుకు పోయింది.

ఎప్పటికో నిద్రపోయింది.

3

మర్నాడు సాయంతం ఆమె ఆఫీసునుంచి తిరిగొచ్చే సరికి సూర్యం ముందుగదిలో పచార్లు చేస్తున్నాడు. పిల్లలిద్దరు బిక్కచచ్చిపోయి, పుస్తకాల బాక్సులు ముందేసుకుని కూచుని భయం భయంగా తండ్రివంక చూస్తున్నారు.

సూర్యం బోనులో పడ్డ పులిలా మహోద్రేకంతో గదంతా కలియ తిరిగేస్తున్నాడు.

అరుణని చూడగానే ఒక్క అంగలో ఆమె ముందు కురికి, "ఏమే. ఏమో అనుకున్నాను గ్రంథసాంగురాలివే?" అన్నాడు.

అరుణ నిశ్చేష్టురాలై నిల్చొండిపోయింది. ఎలాగో గొంతు పెకల్చుకుని, "ఏమిటి. ఏమిటండీ మీరంటున్నది?" అన్నది. ఆమె గొంతు ఆమెకే కొత్తగా ధ్వనించింది.

"ఏమిటా? చూడు నీ రాసక్రీడల ఫోటోల్లో అందంగా

చోటు చేసుకున్నాయి" ఆమె కళ్ళముందు వెక్కిరిస్తూ ఫోటోలు!

ఆమె వాటివంక చూసి పక్కలో బాంబు పేలినట్టు అదిరిపడింది. మొన్న సాయంత్రం బస్టాపులో తనని అ దుండగుడు వాటేసుకుని మీదికిలాక్కున్నపుడు యెవరో ఫోటోలు తీశారు. మూడు భంగిమల్లో తీసిన ఆ ఫోటోలు అతనితో తనెంతో సన్నిహితంగా వున్నట్టు భ్రమ కలిగిస్తున్నాయి.

సూర్యమేకాదు, అతని స్థానంలో యెవరున్నా వాటిని చూపి అనుమానించక మానరు!

"వీటిని మీరు నమ్ముతున్నారా? అసలేం జరిగిందంటే...."

"కథ చెప్పాలని ప్రయత్నించకు. నేను మొదట్నుంచీ అనుమానిస్తూనే వున్నాను. నువ్వు ఆలస్యంగా యింటి కొస్తూంటే యెన్నోసార్లు హెచ్చరించాను. కాని రంకు నేర్చిన ఆడది బొంక నేర్చుతుందని నిరూపించావు...."

"ఏమండీ అంత అన్యాయంగా మాట్లాడకండి. నా సంగతి పూర్తిగా తెలిసే యిలా అభాండం వెయ్యడం ధర్మంకాదు....అసలు ఆరోజు ఆటోవాడు...."

"నాకేం చెప్పొద్దు. నేను వినను. నువ్వు గడప దాటినప్పుడే నీ సంగతి నాకు అనుమానాస్పదంగా వుంటూ వచ్చింది. నా ఉద్యోగం పోవటంతో నేను నీకు అలుసైపోయాను. నీ కంటికి నలుసులా కనిపించడం మొదలెట్టాను. నా చాటున నువ్వు నీ యిష్టమొచ్చినట్టు వేషాలేస్తున్నావు. ఛీ, నీ మొఖం నాకు చూపించకు. వెళ్ళు నా ముందునుంచి. మరోక్షణం నా ఎదట వుంటే నిన్నేం చేస్తానో నాకే తెలియదు."

సూర్యం హుంకరింపు వీధి బయటకు వినిపిస్తోంది. రచ్చ చేసుకోవటం యిష్టంలేక లోపలికి పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది అరుణ.

ఎంతసేపు తలగడలో మొహందూర్చి ఏడ్చిందో ఆమెకే తెలీదు. పిల్లలు ఆకలి విషయంకూడా మరచి లోనికొచ్చి నిద్రలకు పడిపోతుంటే, చటుక్కున లేచి వంటింట్లోకి నడిచింది.

హాల్లోకి తొంగిచూసింది. కాని సూర్యం జాడ కపపడలేదు. పిల్లల్ని అడిగితే తననితిట్టాక బయటికి వెళ్ళిపోయారని చెప్పారు. ఆమె గుండె గుభిల్లుమంది. ఆయన ఉద్రేకంలో ఏదైనా అఘాయిత్యానికి పూనుకోరుకదా అనుకుంది. కాసేపు తనకితానే ధైర్యం కూడా చెప్పుకుంది.

రాత్రి పదకొండు దాటాక సూర్యం వచ్చాడింటికి. అన్నం తినమంటే ఆమెను కొట్టినంత పని చేశాడు. ఆ రాత్రి ఆ యింట్లో ఎవరూ అన్నాలు తినలేదు.

అరుణకి ఆ రాత్రంతా కంటిమీద కునుకులేదు. తెలతెలవార్తుండగా ఆమె ఓ నిర్ణయానికొచ్చింది.

4

"మేమేసాబ్, మంచిగుండారా?" అని కుశలప్రశ్న వేసిన మనిషివంక చురుగ్గా చూసింది అరుణ.

ఆటోవాలా! తనని అవమానాలపాలుచేసి, తన భర్తలో అనుమాన బీజం నాటిన ఆటోవాడు.

'రాస్కెల్, దొరికావు' అనుకుంది మనసులో.

వాడ్ని చూసి చిన్నగా నవ్వింది. "మంచిగానే వున్నాను. మొన్న డబ్బిస్తుంటే వెళ్ళిపోయావు!?" అన్నది.

"నాతో కజ్జా పెట్కుంటే ఏటయిందో యాదేనా? ఆటోవాడికి ఇజ్జత్ లేదనుకున్నావా మల్లా?"

"అబ్బే, నేనలా అనుకోలేదు. నువ్వే అనవసరంగా నన్ను అపార్థం చేసుకున్నావు."

"నీ మొగతనేమన్నా అన్నాడా? ఉన్నాడా, నిన్నొదిలేశాడా?" మోటుగా అడిగాడు ఆటోవాలా.

ఎగదన్నుకొని వస్తున్న ఆవేశాన్ని బలవంతాన అణచుకుని, చిర్నవ్వు నవ్వింది. "నువ్వు యింత మొనగాడివనుకోలేదు ...ఇక్కడ అంతా చూస్తున్నారు. ఆ ప్రక్కగా వెళ్ళి మాట్లాడుకుందాం రా!" అన్నది.

"ఆటోలో వెళ్దామా?" స్టార్టుచేయబోయాడు.

"వద్దు. దాన్ని అలా వుంచి, నాతో రా. నీతో చాలా ముఖ్యమైన సంగతులు మాట్లాడాలి."

"హోటల్ కెళ్దామా?"

"ఒద్దు. పిల్లలు యింట్లో యెదురుచూస్తుంటారు. ఆ పాన్‌షాపు దగ్గిర కూల్‌డ్రింక్సు తీసుకుందాం, రా!"

"అలాగే, పద" భుజాలెగరేసుకుంటూ ఆమెనీ అనుసరించాడు. అరుణ అతనివంకచూపి చిర్నవ్వు నవ్వుతుంటే, ఆ సమ్మోహనాస్త్రానికి చిత్తయిపోయి ఆమెవంక తదేకంగా చూస్తూన్నాడు ఆటోవాలా.

"నువ్వు ఆ ఫోటోలు తీసి పంపటం చాలా మేలైంది. మా ఆయనతో నాకు పూర్తిగా తెగతెంపులయిపోయింది. దాదాపు వదిలేసినట్టే!"

"చూపినావా, నేనెంత మేళ్ళేశానో నీకు!....పోతే పోనియ్యి, సంపాదనలేని వుడిసీ ఓ మడిసేనా?"

"బాగా చెప్పావు" అన్నది మెచ్చుకోలుగా అరుణ.

కూల్‌డ్రింక్సు తాగాక, "ఆటోలో దిగబెడతా రా, మీ మకాన్‌కు" అన్నాడు ఆటోవాలా.

"వద్దులే, మరోసారెప్పుడైనా వస్తాను! బస్ వచ్చింది,

వెళ్తాను!" అన్నది అరుణ.

ఆటోవాలా "మళ్ళీ రేపు ఇదే సమయాని కొస్తాను!" అంటూ ఆటోని సమీపించేసరికి ఒక్కసారిగా నలుగురు ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్లు ఆటోను చుట్టుముట్టారు.

"ఆటో నీదేనా?" అనడిగారు వాళ్ళు.

"అవునుసార్, నాదే!" అన్నాడు ఆటోవాలా అనుమానంగా చూస్తూ.

సీటు పైకితీసి సీటుకిందున్న చెక్కని తొలగించారు ఇన్స్పెక్టర్లు. లోపల అరలోనుంచి ఇంపోర్టెడ్ వాచీలు, టేప్‌రికార్డర్లు, హెరాయిన్ అనబడే మత్తుమందు, గంజాయి పైకితీశారు.

"ఇవన్నీ నీకెలా వచ్చాయి? స్మగ్లింగ్ చేస్తున్నావా?" అడిగాడు ఇన్స్పెక్టర్‌లలో ఒకడు.

"అబ్బే, నాకేం తెలీదుసాబ్! చాలా పరేషాన్‌గా వుందే!"

"స్టేషన్‌కి పద! పరేషాన్ వుండదు, ఏం వుండదు!" అన్నాడు ఇన్స్పెక్టర్.

ఆటోవాలా చేష్టలుడిగి చూస్తూండిపోయాడు.

అదేసమయంలో తన స్నేహితురాలితో కరచాలనం చేస్తోంది అరుణ బస్టాప్‌లో.

5

భర్తతో, స్నేహితురాలితో పోలీస్‌స్టేషన్‌లోవున్న సెల్ దగ్గరికి నడిచింది అరుణ. సెల్‌లోపల ఆటోవాలా దిగాలుగా కూచున్నాడు.

అరుణను చూడగానే అతని మొహం కోపంతో జేవురించింది.

"నాకు యిప్పుడర్థమయినాది. నన్ను నువ్వే అరెస్టు

చేయించినావు!" అన్నాడు అరుణతో.

అరుణ నవ్వింది. "నువ్వు చేసిన తప్పు ఒప్పుకో! నిన్ను విడుదల చేయిస్తాను" అన్నది.

ఆటోవాలా సూర్యంవంక, అరుణవంక మార్చి, చూపి "నిజంగా విడుదల చేయిస్తురా?" అన్నాడు.

"నిజంగానే!"

"అయితే సెప్పుతా. సూడుబాబూ, యీయమ్మ నిప్పు లాంటిది. ఆయాల ఆటోలో తీసుకొచ్చినోడ్ని నేనే! ఊరంతా తిప్పి ఎక్కువ కిరాయి వసూలుజేద్దా మనుకుంటే ఈమె నా ప్లాను కనిపెట్టేసినాది. ఆ కోపంలో నేను మీటరు ఛార్జికన్న అయిదురూపాయలు జ్యాదా ఇమ్మన్నాను. ఇంటి కెళ్ళాక యివ్వనన్నాది కసెట్టుకున్నాను.

ఈమె కాపరం పాడుజెయ్యాలనుకొన్నాను. నా దోస్త లతో కలిపి నాటకమాడాను. ఓ దోస్తని యీమెని పట్టుకో మని మరో దోస్తతో ఫిలింలాగాను. మీ ఇల్లు చూపినాను గదా, ఆ ఫోటోలు మీ యింటి కిటికీలోనించి లోపలికి పడే సాను... అంతే, జరిగింది. ఈమెకే పాపం తెలవదు."

సూర్యం ఆటోవాలాని చంపేసేటట్లు చూశాడు. తర్వాత అరుణవైపు తిరిగి క్షమించమన్నట్టు చూశాడు.

"చెప్పేసినానుగందా, నన్నొదిలేపిస్తువా?" అనడిగాడు ఆటోవాలా.

"అలాగే....నీ ఆటో సీటులోకి స్మగుల్డ్ వస్తువు లెలా వచ్చాయి?" అడిగింది సుశీల, అరుణ స్నేహితురాలు.

"అదే అరదంగావటల్లా ఎట్టాగొచ్చినయ్యి?" అడిగాడు ఆశ్చర్యంగా ఆటోవాలా.

అరుణ చెప్పింది. "ఈమె నా స్నేహితురాలు. ఈమె భర్త ఎక్సయిజు ఇన్స్పెక్టర్. నాకొచ్చిన కష్టం చెప్పాను.

బహుశా నాకోసం నువ్వు మళ్ళీ వస్తావని, పట్టుకొనే ఏర్పాటు చేయమనీ నా స్నేహితురాలితో చెప్పాను ఈమె, తన భర్తతోను, మరో ముగ్గురు ఇన్స్పెక్టర్‌లతోనూ సిద్ధంగా బస్టాపుదగ్గిర మాటువేసింది.

అనుకున్నట్టుగానే బస్టాపుదగ్గరకు నువ్వొచ్చావు కూల్ డ్రింక్స్ నెపంతో ఆటోనుండి నిన్ను దూరంగా తీసుకుపోయాను. ఆ సమయంలోనే నా స్నేహితురాలు ఆ స్మగుల్డ్ వాచీలు, గంజాయి, హెరాయిన్ మూటలు నీ ఆటో సీట్లో దాచింది. అవి అంతక్రితంరోజు వాళ్ళాయన, మిగతా సిబ్బంది—స్మగ్లర్స్‌నించి వశం చేసుకొన్నదే! వాళ్ళమీద కేసుపెట్టారు. వస్తువులు కోర్టులో హాజరుపరచే ముందు నీ సీట్లో ఓసారి ప్రదర్శించారు. నిన్ను అరెస్టుచేశారు.

పోలీసు మర్యాద చవిచూశాక నువ్వు నాకు చేసిన అన్యాయం గురించి చెప్పేశావు, అదే, వాళ్ళు చెప్పించారు. నీకు ఆ పనిలో సాయపడిన నీ దోస్తుల్నికూడా అరెస్టు చేశారు. నా కాపరం పాడుచేయాలని కుట్రపన్ని నువ్వే నాశనమయిపోయావు."

ఆటోవాలా నివ్వెరపోయి విన్నాడు. "ఇంత కుట్ర పన్నింద్రా నా ఎనక?" అన్నాడు.

"నీ కుట్రకంటేనా?" అన్నది సుశీల కోపంగా.

"అయితే యిక నన్నొదిలి పెట్టేస్తుంద్రా?" ఆశగా అడిగాడు ఆటోవాలా.

"అంత తేలిగ్గానా? నువ్వు చేసిన పాపానికి ఫలితం అనుభవించు. తక్కిన స్మగ్లర్స్‌తోబాటు నీమీద కూడా ఛార్జిషీటు దాఖలుచేశారు. రేపు కోర్టులో హాజరుపరుస్తారు. నీకు కనిసం ఏడేళ్ళ కఠినశిక్ష తప్పక పడి తీర్తుంది!" అన్నది అరుణ కసిగా. □

వేటరిజెంటు

వసుంధర



వాళ్ళిద్దరు స్మగ్లర్సు. ఒకడిపేరు రాజా, రెండోవాడిపేరు విక్టర్. ఇద్దరూ పెద్ద పనిమీదే నగరం వస్తున్నారు. వాళ్ళిద్దరి చేతుల్లోనూ చెరో బ్రీఫ్‌కేసూ వున్నాయి. వారి దగ్గర లక్షలు విలువచేసే మత్తుపదార్థాలున్నాయి. ఆ నగరంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త సదానంద్‌కు వారా మత్తుపదార్థాల నందజేయాలి.

రాజా, విక్టర్—ఇద్దరూ కూడా పోలీస్ రికార్డుల్లో వున్నారు. ఒకటి రెండుసార్లు జైలుకు కూడా వెళ్ళివచ్చారు. పెద్దల ప్రాపకంవల్ల జైల్లో ఎక్కువకాలం వుగకుండా బయట తిరగ్గలుగుతున్నారు. స్మగ్లింగ్ ఆపరేషన్స్లో వారికి వారేసాటి అని అంతా చెప్పుకుంటారు. అయితే వాళ్ళు స్వయంగా ఏ వ్యాపారమూ చేయడంలేదు. ఒక చోటి వస్తువును మరో చోటుకు చేర్చడం వారి బాధ్యత. అందువల్ల వచ్చే ప్రతిఫలంతో ఇద్దరి జీవితమూ సుఖంగా, దర్జాగా వెళ్ళిపోతోంది.

ట్రెయిన్ నగరం చేరుకుంటోంది. ఔటర్ సిగ్నల్ కోసం ఆగింది. రాజా, విక్టర్—ఇద్దరూ సిద్ధంగా వున్నారు.

తమపై పోలీసు నిఘా వుందని వారికి తెలుసు. ఎక్కడెవరు తమను గుర్తుపట్టినా—ఓసారి సోదాచేసికానీ వదలరు. ఇప్పుడు సోదా జరిగిందంటే తాము రెడ్ హేండెడ్‌గా పట్టుబడిపోతారు. తాము పట్టుబడిపోవడంవల్ల ప్రమాదం తమకేకాదు—పేరుపొందిన ఇద్దరు పారిశ్రామికవేత్తల బ్రతుకులు బయటపడతాయి. అందువల్ల వాళ్ళు కూడా తమను వేయికళ్ళతో కనిపెడుతూంటారు. తాము పోలీసులకు దొరికితే వాళ్ళు తమను ప్రాణాలతో బ్రతకనివ్వరు.

చేసేపని ప్రమాదకరమైనదని తెలిసినా కొందరికి ప్రమాదాల్లో జీవించడంలోనే మజావుంటుంది. ప్రస్తుతం రాజా శ్రీనివాసుణ్ణీ, విక్టర్ జీసస్‌నీ ప్రార్థించుకుంటున్నారు తాము తలపెట్టిన కార్యక్రమం జయప్రదంగా నెరవేరేలా చూడమంటున్నారు, తప్పితే తమకు వేరే జీవన విధానం ఏర్పాటుచేయమని వాళ్ళు భగవంతుణ్ణి వేడుకోవడం లేదు.

ప్రస్తుతానికిద్దరూ మారువేషాల్లో వున్నారు రాజా ముస్లింవేషంలో వున్నాడు. విక్టర్ పిలక బ్రాహ్మణుడు. తమనెవరైనా గుర్తిస్తారన్న భయం వారికి లేదు.

ట్రెయిన్ ఔటర్ సిగ్నల్లోంచి కదిలే సమయంలో ఓ వ్యక్తి వారి కంపార్టుమెంట్లో ప్రవేశించాడు. రాజా, విక్టర్-యిద్దరూ కూడా అతణ్ణి గుర్తుపట్టారు. అతడు డిటెక్టివ్ వెంకన్న. ఓసారి అతడే తామిద్దర్నీ పట్టుకున్నాడు.

ఇప్పుడు వెంకన్న కంపార్టుమెంట్లోకి ఎందుకొచ్చాడూ అని ఇద్దరూ ఆలోచనలో పడ్డారు. ఇద్దరికీ శరీరాల్లో సన్నని వణుకు ప్రారంభమైంది.

అది ఫస్టుక్లాస్ కూపే. అక్కడిప్పుడు వాళ్ళుముగ్గురే వున్నారు.

వెంకన్న తనుసీట్లో కూర్చుని ఇద్దరివంకా చూసి—"బండి ప్లాట్‌ఫారం మీదకు చేరడానికింక పదినిముషాలు పడుతుందనుకుంటాను—" అన్నాడు.

రాజా, విక్టర్—ఇద్దరూ ముఖ ముఖాలు చూసుకున్నారు. ఇద్దరూ వెంకన్నమాటలు విననట్లూరుకున్నారు.

"పదినిముషాలేనా అనుకుంటాంకానీ—ఆ కాసేపట్లో ఎన్నో ఘనకార్యాలు సాధించొచ్చు—" అన్నాడు వెంకన్న మళ్ళీ.

రాజా, విక్టర్—ఇద్దరూ కూడా ఆ మాటలు వినని వాళ్ళలా తమ తమ సీట్లకు జారబడ్డారు.

"పదినిముషాలుకాదు—రోజంతా టైమిచ్చినాసరే—సాధించలేని ఘనకార్యం ఒకటుంది. అదే నా నుంచి తప్పించుకోవడం!" అన్నాడు వెంకన్న మళ్ళీ.

ఇద్దరూ వులిక్కిపడ్డారు. అంటే వెంకన్న తమను గుర్తుపట్టాడన్నమాట. ఎప్పుడు పట్టాడో, ఎలా పట్టాడో-

ఇప్పుడేం చేస్తాదో?

డిటెక్టివ్ వెంకన్నకు ఎదురు తిరిగి పారిపోవడం ప్రాణాంతకమని చాలామంది నేరస్థులకు తెలుసు. అయితే అతడికి నేరస్థులపట్ల శత్రుభావం లేదనీ వారికి తెలుసు. మనిషిలోని నేరాన్నేకానీ మనిషిని శిక్షించకూడదన్నది వెంకన్న సిద్ధాంతం. ఆ కారణంగా అతడెన్నో నేరాలను పరిష్కరించినా నేరస్థులను వదిలిపెట్టేయడంవల్ల అతడి పరిశోధనల ఫలితాలు చాలావరకూ అపన పాఠకులకు మాత్రమే పరిమితమైనాయి.

"ప్రపంచంలో నేరస్థులున్నారు. వారిని పట్టుకునేవారున్నారు. తాము చాలా తెలివైనవారిమని నేరస్థులనుకుంటారు. కానీ, పట్టుకునేవారే ఎక్కువ తెలివైనవారు. అందువల్ల పట్టుబడని నేరస్థులు అరుదుగా వుంటారు...." అన్నాడు వెంకన్న.

"ఎవరు మీరు? ఇవన్నీ మాకెందుకు చెబుతున్నారు?" అన్నాడు రాజా చిరాకును ప్రదర్శిస్తూ.

"ట్రెయిన్ ప్లాట్‌ఫారం చేరడానికింక ఏడు నిముషాలే టయిముంది. నేనెవరో తెలియనట్లు నటించి మీరు మీ కాలాన్ని వృధాచేసుకోవద్దు. మీరిలా బయల్దేరినట్లు పోలీసులకు సమాచారం అందింది. నా తరపున నేనూ బయల్దేరి వచ్చాను. ఈ క్షణంలో మిమ్మల్నరెస్ట్ చేసి పోలీసుల కప్పగించగలను. కానీ అలా చేయదంలేదు. మీ బ్రీఫ్ కేసులు రెండూ నాకు అప్పగించండి. మిమ్మల్ని వదిలి పెట్టినందుకు ప్రతిఫలంగా చెరో వెయ్యి నాకు చెల్లించుకోండి. అటుపైన యింకెప్పుడూ యిలాంటి జీవితంపట్ల ఆకర్షితులంకామని నాకు మాటివ్వండి...." అన్నాడు వెంకన్న.

"మీరెవరో, ఎవరిగురించి మాట్లాడుతున్నారో నా కర్థం కావడంలేదు" అన్నాడు విక్టర్. కానీ అతడి మనసులో బెంగపట్టుకుంది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి అతడి మనసు దారులు వెతుకుతోంది.

"కాలం వృధాచేయొద్దు మీరు నేరాలకు పనికిరారు. మీ పద్ధతుల్లో చాల లోపాలున్నాయి కావాలంటే ఇప్పుడు మిమ్మల్ని వదిలిపెట్టి ఓరోజు టైమిచ్చి మిమ్మల్ని పట్టుకోగలను. కానీ...." అని ఆగాడు వెంకన్న.

"మీ కంత నమ్మకముంటే మమ్మల్ని వదిలిపెట్టి చూడండి-" అన్నాడు విక్టర్ తను బైటపడుతూ.

"మిమ్మల్ని వదుల్తాను కానీ మీ వద్దనున్న మత్తు పదార్థాలు తీసుకుంటాను. ఇద్దరివద్దా చెరో వెయ్యి తీసుకుంటాను. ఆ తర్వాత నా వేట ప్రారంభిస్తాను. ఒక్క-రోజులో తప్పించుకోలేక పోయారో—మీరు నేరాలు చేయడం మానేస్తానని నాకు మాటివ్వాలి—" అన్నాడు వెంకన్న.

"మిమ్మల్ని మీరు పట్టుకోలేకపోతే?"

"అప్పుడు మీ దగ్గర తీసుకున్నవన్నీ మీకు తిరిగి అప్పగిస్తాను...."

చటుక్కున విక్టర్ వెంకన్నమీద దెబ్బతీయాలని చూశాడు. వెంకన్న మెరుపువేగంతో అతడి భుజంమీద ఓ దెబ్బవేసి—"నా జోలికి రావడంవల్ల మీ రిద్దరూ స్పృహ లేకుండా ఈ ట్రెయిన్లో పడివుంటారు. ఆ విధంగా పోలీసుల పాల్పడడం మరింత సులభమవుతుంది—" అన్నాడు.

వాళ్ళకు తప్పలేదు. ఇద్దరూ వెంకన్నకు బ్రీఫ్ కేసులూ, చెరోవెయ్యి సమర్పించుకున్నారు. వెంకన్న క్షణాలమీద

అక్కణ్ణించీ మాయమయ్యాడు.

ట్రెయిన్ ప్లాట్‌ఫారంమీద ఆగింది.

2

రాజా, విక్టర్ ఇద్దరూ ఆటో ఎక్కారు. వెంకన్న అతి సులభంగా మత్తుపదార్థాలను వశపర్చుకోనడం వారికెంతో బాధనిపించింది. కానీ ఏంచేయగలరు? అంతా కన్నుమూసి తెరిచేలోగా జరిగిపోయింది. వెంకన్న తమను వదిలిపెట్టడం అదృష్టం. ఈ విధంగా తమ ప్రాణాలకు రక్షణ లభించింది. ఇప్పుడొక్కరోజు సమయంలో వెంకన్నకు దొరక్కపోతే అతడినుంచి మత్తుపదార్థాలు తిరిగి పొందగల అవకాశముంది. అది తాముపయోగించుకోవాలి. వెంకన్న అన్నమాట తప్పడంటారు.

ఇద్దరూ త్రిభువన్ హోటలుకు వెళ్ళారు. ఆ హోటల్లో పన్నెండో నంబరు గదివారికోసం ప్రత్యేకించబడింది. రిసెప్షనిస్టుకు చెప్పుకుని వాళ్ళు తాళం తీసుకుని తమ గదికి వెళ్ళారు. గదిలో కూర్చున్నాక ఇద్దరూ ఆలోచనల్లోపడ్డారు.

"మనం బాగా ఫూలయ్యాం? వెంకన్న మనని కనిపెట్టలేకపోయాడనుకో! అప్పుడు బ్రీఫ్‌కేసులకోసం వెదతాం గదా—అంటే పట్టుబడినట్లేకదా—" అన్నాడు రాజా.

"ఇలాంటి ఆలోచనలవల్ల మనకేమీ ప్రయోజనంలేదు. నా మాట విను. మనమిక్కడెక్కువసేపుండడం మంచిది కాదు. వెంకన్న మనని ఫాలో అవుతూనే వుండివుంటాడు. మనం వేషాలు మార్చుకుని ఈ ఊర్నించి వెళ్ళాలి.... అన్నాడు" విక్టర్.

ఆ గదిలో వారికి వేషాలు మార్చుకునేందుకు అన్ని సదుపాయాలూ ఉన్నాయి. ఇద్దరూ కాసేపు ఏ వేషాలు మార్చాలా అని ఆలోచించారు.

"మనలో ఒకరు స్త్రీగా మారాలి...." అన్నాడు రాజా.

"అంటే నేనే మారాలి! అన్నాడు విక్టర్."

ఇద్దరిలోకీ విక్టర్ కాస్త పొట్టి. బయట ఒక ఆడా మగా నడుస్తున్నప్పుడిద్దరిలో పురుషుడు పొట్టిగానూ, స్త్రీ పొడుగ్గానూ వుంటే చూపరులనాజంట ఆకర్షిస్తుంది. అది తమకంత మంచిదికాదు.

విక్టర్ చీరకట్టుకున్నాడు. అందు కనుగుణంగా తన రూపు రేఖలు దిద్దుకున్నాడు.

"ఆడపిల్లకంటే బాగున్నావు...." అన్నాడు రాజా.

రాజా ఫుల్ సూటు వేసుకున్నాడు. ఇప్పుడిద్దరూ చక్కని జంటలాగున్నారు. నిలువుటద్దంముందు పక్కపక్కన నిలబడి చూసుకుని ఆశ్చర్యపోయారు.

"ఈ వేషాల్లో మననింకెవ్వరూ గుర్తుపట్టలేరు. నువ్వేమో పెద్ద అయ్యే యస్సాఫీసర్లాగున్నావు. నేను నీ జంటకు తగ్గట్టే వున్నాను...." అన్నాడు విక్టర్.

"సహజంగా అందమైనవాళ్ళంగదా ..." అని—"నువ్వు ఎత్తుమడమల జోళ్ళు వేసుకో—మోడ్రన్‌గా వుంటుంది." అన్నాడు రాజా.

విక్టర్ పాదాలసైజు పెద్దది. అక్కడ అతడికి సూటయ్యే ఎత్తుమడమల జోడులేదు.

"మనం జోళ్ళు మార్చకతప్పదు. వెంకన్న అసాధ్యుడు. కాలిజోళ్ళను చూసైనా మనని గుర్తించగలడు...." అన్నాడు రాజా మళ్ళీ.

ఇద్దరూ కాసేపు కష్టపడ్డారు. రాజా వచ్చేటప్పుడు నల్లబూట్లు వేసుకున్నాడు. అతడు వాటికి బదులిక్కడ బ్రౌన్ కలర్‌బూట్లు వేసుకొన్నాడు. విక్టర్ తన ఆకు చెప్పులకు పైన కొంత రంగు పులిమాడు. అందువల్ల కొంతపని

జరిగింది.

"నడిచేటప్పుడు కాస్త జాగ్రత్తగా వుంటే చెప్పుల్ని చీరమాటున దాచుకోవచ్చు. వాటిగురించి కంగారుపడకు-" అన్నాడు రాజా.

ఆ తర్వాత ఇద్దరూ అక్కడ కాసేపు కలిపి నటన ప్రాక్టీసు చేశారు. అచ్చం భార్యాభర్తల్లా ప్రవర్తించగలగ డానికి వారికి కాసేప్పట్టింది. అప్పుడిద్దరూ హోటల్లోంచి బయటకు వచ్చారు. ఎవ్వరూ వారిని ప్రత్యేకంగా చూడ లేదు. రిసెప్షనిస్టు మాత్రం "జంట చాలా బాగుంది—" అనుకుంది.

రాజా అయిదడుగుల ఏడంగుళాలుంటాడు. విక్టర్ అయిదూ ఆరుంటాడు. నిజానికి వారు చక్కని జంటలాగే వున్నారు.

రోడ్డుమీదకు వచ్చేక ఏ టాక్సీనీ పిలవకుండా ఫుట్‌పాత్ మీద నడవసాగారు.

"నడవడం నాకు కష్టమనిపిస్తోంది దరిదాపుల్లో వెంకన్న వున్నాడంటే అనుమానించవచ్చు. టాక్సీ పిలుద్దాం-" అన్నాడు విక్టర్. అలవాటులేని వాళ్ళకు చీరతో నడవడం కష్టమైనవనే!

"టాక్సీలో ఎక్కడికి వెడదాం?" అన్నాడు రాజా.

"స్టేషనుకు పోదాం. ఈ వూరు వదిలిపెట్టేదాం—"

సరేనని రాజా రోడ్డుకేసి తిరిగాడు. సరిగ్గా అప్పుడే ఓ టాక్సీ వచ్చి వారిపక్కన ఆగింది.

ఇద్దరూ టాక్సీ ఎక్కి కూర్చున్నారు.

"రైల్వేస్టేషన్!" అన్నాడు రాజా.

"మిమ్మల్నిప్పుడే ఎలా పారిపోనిస్తాను మిస్టర్‌రాజా! మీ పద్ధతి మార్చుకుంటానని నాకింకా మాటివ్వలేదుకదా!"

అన్నాడు డ్రైవర్.

రాజా, విక్టర్ వులిక్కిపడ్డారు. ఆ డ్రైవర్ డిటెక్టివ్ వెంకన్నని వారికి అర్థమైపోయింది.

"మీ వేషాలు చాలా బాగున్నాయి. ఏ లోపమూ లేదని నేనే ఒప్పుకుంటాను. కానీ ఈ వెంకన్న కళ్ళు కప్పడం మీ వల్లకాదని ఈపాటికి అర్థమైవుండాలి మీకు. మర్యాదగా మీ అశక్తత ఒప్పేసుకోండి—" అన్నాడు వెంకన్న.

"మమ్మల్నెలా గుర్తుపట్టావు?" అన్నాడు విక్టర్ ఆశ్చర్యంగా.

"చాలా సింపుల్! మిమ్మల్నునుసరించి మీతో ఈ హోటలుకొచ్చాను. ఆ తర్వాత ఇక్కడే మాటువేశాను. మీరు బయటకు రాగానే గుర్తుపట్టాను...." అన్నాడు వెంకన్న తమాషాగా నవ్వుతూ.

"ఏలా?"

"మీరు నాకు లొంగిపోతానని మాటివ్వండి. నేను మిమ్మల్నెలాగుర్తుపట్టానో ఇప్పుడే చెప్పేస్తాను—" అన్నాడు వెంకన్న

"నువ్వు మాకు రేపటిదాకా గడువిచ్చావు. ఆ తర్వాతే మేము నీకు లొంగేది...." అన్నాడు రాజా.

"అయితే ఇంకా మీలో ఆశ చావలేదన్నమాట అంతా మీ భ్రమ. సరే మిమ్మల్ని పెద్దబజార్లో దిగబెడతాను. మీ ప్రయత్నం మీరు చేయండి...." అన్నాడు వెంకన్న.

3

పెద్దబజార్లో వెంకన్న టాక్సీలోంచి దిగేక రాజా, విక్టర్—యిద్దరూ కూడా తిన్నగా ఖాన్ టైలరింగ్ దుకాణానికి వెళ్ళారు ఆ వూళ్ళోకే చెప్పుకోదగ్గ పెద్ద దుకాణమది. అందులోనే పురుషులకీ స్త్రీలకీ వేర్వేరు విభాగా

లున్నాయి. ట్రయల్ గదులే డజనుదాకా వున్నాయి. ఆ షాపెప్పుడూ కోలాహలంగానూ, సందడిగానూ వుంటుంది.

రాజా ఖాన్‌తో ఏదో మాట్లాడాడు. ఖాన్ వెంటనే అతణ్ణి ఓ ట్రయల్‌గదిలోకి తీసుకునివెళ్ళి— "ఏమిటి సంగతి?" అనడిగాడు.

విక్టర్ బయటనే వుండిపోయాడు.

"మమ్మల్నో డిటెక్టివ్ వెంటాడుతున్నాడు. అతడు దుకాణం బయటే మాటువేశాడు. మేము వేషాలు మార్చుకుని తప్పించుపోవాలి—" అన్నాడు రాజా.

ఖాన్ ముక్తసరిగా—"నేనేం చేయాలో చెప్పు!" అన్నాడు.

రాజా వివరించాడు.

వెంకన్న చాలా తెలివైనవాడు. త్రిభువన్ హోటలుకు వెళ్ళినవారందర్నీ గమనించి బయటకు వచ్చేవాళ్ళలో కొత్తగా కనపడ్డ తమ జంటననుమానించి వుంటాడు. ఇప్పుడతణ్ణి తప్పుదారి పట్టించాలంటే మంచి మార్గముంది.

ముందుగా ఇద్దరు సర్దార్జీలను షాపులోకి రప్పించాలి. వాళ్ళను తమ వేషాలతో బయటకు పంపించాలి. ఆ తర్వాత తామిద్దరూ సర్దార్జీ వేషాల్లో బయటకుపోతారు.

"అయితే మనవాళ్ళకు ఫోన్ చేయనా?" అన్నాడు ఖాన్.

"ఊఁ....త్వరగా...." అన్నాడు రాజా.

తర్వాత ఖాన్ ట్రయల్ గదిలోంచి బయటకు వచ్చి గెస్ట్ రూంలోకి విక్టర్నీ, రాజానూ పంపాడు. అక్కడ వాళ్ళిద్దరూ తమ పాత వేషాలు మార్చేసుకొని శుభ్రంగా ముఖాలు కడిగేసుకున్నారు.

సరిగ్గా పావుగంటలో ఆ గదిలోకి సర్దార్జీలిద్దరు వచ్చారు. విక్టర్నీ రాజానూ చూస్తూనే సంతోషంగా పలకరించి తమ పెట్టుడు గెడ్డాలూ, మీసాలూ తీసేశారు. క్షణాలమీద వాళ్ళలో ఒకడు రాజాకులా తయారయ్యాడు. రెండోవాడు స్త్రీవేషం వేశాడు. కాసేపు రూపురేఖలు తీర్చిదిద్దేసరికి వాళ్ళు అచ్చం ఇందాకా రాజా, విక్టర్లున్నట్లే ఉన్నారు.

రాజా, విక్టర్—ఇద్దరూ వాళ్ళను అభినందించారు. అప్పుడా జంట బయటకు వెళ్ళిపోయింది. ఆ తర్వాత కొద్ది క్షణాల్లో రాజా, విక్టర్లిద్దరూ సర్దార్జీ వేషాల్లో బయటకు వచ్చారు.

"ఇంక బ్రహ్మదేవుడు గూడా మనని పట్టలేడు"— అన్నాడు విక్టర్.

"వెంకన్న ఆ జంట ననుసరించి పోయుంటాడు"— అన్నాడు రాజా.

"అది సరేలే—మనమిప్పుడు సర్దార్జీలంగదా—ఏ హోటలుకో పోయి కాస్త చాయ్ తాగుదాం—" అన్నాడు విక్టర్.

దగ్గర్లోనే ఓ చిన్న టీ దుకాణం ఉంది. ఇద్దరూ ఆ దుకాణంలో దూరి ఓ టేబిల్ దగ్గర కూర్చున్నారు.

సర్వరు వచ్చి—"ఏంకావాలి సార్!" అన్నాడు.

"చాయ్—దో...."

సర్వరు లోపలకి వెళ్ళాడు. అతడు టీ తేవడానికి ఆలస్యమైంది.

"టీ తేడానికింత ఆలస్యమా?" అన్నాడు రాజా కోపంగా.

"ఆలస్యం టీ గురించి కాదుసాబ్!" అన్నాడు సర్వరు.

"మరి? అన్నాడు విక్టర్.

"మీ రార్డరు చెప్పిన సర్వరు లోపలకు వచ్చేక నేనతడి

వేషం మార్చుకుందు కింతసేపు పట్టింది!" అన్నాడు సర్వరు.

"వేషం మార్చడమెందుకూ?" అని గతుక్కుమన్నాడు విక్టర్. అంటే ఈ సర్వర్ కొంపతీసి వెంకన్న కాదుగదా! కాదుగదా ఏమిటి.... అతడు వెంకన్నే!

"మీరు వేషాలు మార్చారుగదా—అందుకని నాకూ సరదా పుట్టింది. నా వేషం బాగుందా?" అన్నాడు వెంకన్న.

"మమ్మల్నెలా గుర్తుపట్టావ్?" అన్నాడు రాజా ఆశ్చర్యంగా.

"అది ట్రేడ్ సీక్రెట్. లొంగిపోతానంటే చెబుతాను.."

"ఇంకా ఇరవై నాలుగ్గంటలు టైముంది మాకు...." అన్నాడు విక్టర్.

"సుఖాన వున్న ప్రాణాన్ని దుఃఖపెట్టుకోవడమంటే యిదే ననుకుంటాను. పూర్ ఫెలోస్. నాకు మిమ్మల్ని చూస్తే జాలేస్తోంది. అసాధ్యమని తెలిసీ అనవసరంగా శ్రమపడుతున్నారు...." అన్నాడు వెంకన్న.

"ఇట్సాలైరైట్ — మా ప్రయత్నం మేం చేస్తాం!" అన్నాడు రాజా.

4

రాజా, విక్టర్ ఇద్దరూ కూడా అక్కణ్నుంచి తిన్నగా థియేటర్ కుసుమకు వెళ్ళారు. ముందు టికెట్లు కొనుక్కుని హాల్లోపలికే వెళ్ళారు. తర్వాత మేనేజర్ని కలుసుకుని తామెవరో చెప్పుకున్నారు.

"మీకేం సాయం కావాలో చెప్పండి—" అన్నాడు మేనేజర్.

"సినిమాహాల్లో మొత్తం అయిదు జంటలుండాలి. భర్తది ముస్లిం వేషం. భార్యకు బురఖా వుంటుంది.

మనుషులందరూ మాకులాగే భారీగా వుండాలి. సినిమా అయిపోయాక అన్ని జంటలూ తలోవైపు వెళ్ళిపోవాలి..." అన్నాడు రాజా.

మేనేజరు సరేనన్నాడు,

"ఈసారి తప్పించుకోగల మంటావా?" అన్నాడు విక్టర్ అనుమానంగా.

"తప్పించుకోలేకపోవడానికి ఆ వెంకన్నేమయినా దేవ దంటావా-ఒకటి కాదు రెండుకాదు-మొత్తం ఆరుజంటలు. వాటిలో ఏ జంట ననుమానిస్తాడు? అసలు సినిమా హాల్నించి బయటకు వచ్చే వాళ్ళలో మనని గుర్తించడమే అసాధ్యం. అటుపైన బురఖా యువతిని గుర్తించడం మరింత కష్టం. అలాంటి జంటలు ఆరుంటే యింక చెప్ప నక్కరలేదు...." అన్నాడు రాజా.

"అవుననుకో-కానీ యింతవరకూ జరిగింది చూస్తూంటే ఆ వెంకన్న మనిషేనా అని కూడా అనుమానం కలుగు తోంది" అన్నాడు విక్టర్.

"అతడు మన నెలా కనిపెడుతున్నాడో నాకూ మిస్టరీ గానే వుంది. కానీ ఈసారి అతడు మనని కనుక్కోలేడనే నా నమ్మకం...."

"కనుక్కుంటే ఏం చేద్దాం-లొంగిపోదామా?"

"లొంగిపోవద్దు. లొంగిపోయామని అబద్ధం చెబుదాం. అతడు మనుషుల మంచితనాన్ని నమ్ముతాడు. ఇంకెప్పుడూ నేరాల జోలికి వెళ్ళమని అతడికి మాట యిచ్చేస్తే - ఆ తర్వాత మనిష్టం...." అన్నాడు రాజా.

"అంత సులభమని నే ననుకోను. ఆ వెంకన్న అసా ధ్యుడు. ఏదో ట్రిక్ చేస్తాడు...." అన్నాడు విక్టర్.

"అలాగని ఎందుకనుకుంటున్నావు?"

"లేకపోతే మనమీద మనకెంత నమ్మక ముండేది! ఇప్పుడేమో పట్టుబడిపోతే ఏం చేయాలీ అని చర్చించు కుంటున్నాం."

వాళ్ళిద్దరూ మేనేజరు ప్రయివేటు గదిలో ఉండగా లోపలకు ఓ ముస్లిం జంట వచ్చింది. ఆ తర్వాత మరో జంట వచ్చింది. అటుపైన మరో జంట వచ్చింది. అలా మొత్తం ఆరు జంటలు వచ్చాయి. అప్పుడక్కడ ఓ జంట రాజా, విక్టర్లతో వేషాలు మార్చుకుంది. అనగా రాజా, విక్టర్లు ముస్లిం జంటగా మారిపోయారు. ఆ ముస్లిం జంట సర్దార్జీలుగా మారింది.

కొంతసేపట్లో ఆ గదిలోంచి ఆరు ముస్లిం జంటలూ ఇద్దరు సర్దార్జీలూ, మేనేజరూ బయటకు వచ్చారు. మేనేజరు వారందరికీ హాల్లో సగౌరవంగా జంటలు జంటలుగా సీట్లు చూపించాడు.

రాజా, విక్టర్ ఎక్కువ మాట్లాడకుండా మొత్తం సినిమా అంతా చూశారు. ట్రెయిన్లో తను ముస్లిం వేషంలో వుండగా వెంకన్న కళ్ళ బడ్డానని అతడికి గుర్తుంది. అప్పుడతడు మీసం లేకుండా గెడ్డంతో వున్నాడు. బట్టతల విగ్గులో వున్నాడు. ఇప్పుడందుకు భిన్నంగా పూర్తి వుంగరాల జుత్తు. ఆ పైన కుచ్చు టోపీ వుంచుకున్నాడు. ఈసారి గెడ్డం లేదు కానీ పెద్ద పెద్ద బుర్రమీసాలు తగిలించుకున్నాడు. అతడెలా వేషం మార్చుకున్నప్పటికీ మనసులో వెంకన్న గురించి భయపడుతూనే ఉన్నాడు.

సినిమా అయిపోయింది. రాజా, విక్టర్ ఏ హడావిడీ లేకుండా తాపీగా హాల్లోంచి కదిలారు.

మొత్తం ఆరు ముస్లిం జంటలూ సినిమా హాల్లోంచి బయటపడి రోడ్డుమీద కొచ్చాయి. ఆ తర్వాత అందరూ

తలోవయిపు ప్రయాణం కొనసాగించారు.

"బాబూ రిక్షాకావాలా?" అన్నాడో రిక్షావాలా.

రాజా, విక్టర్ ఆ రిక్షావాడిని అనుమానంగా చూశారు. వాడే వెంకన్న కాదు కదా అని వాళ్ళు భయపడుతూ - వద్దని చెప్పి ముందడుగు వేశారు. గమ్యం వారి మనసులో వుండనే వుంది.

సదానంద్ యిల్లు. అక్కడికే తాము చేరుకోవాలి. వెంకన్న విషయం చెప్పాలి. తమను పట్టుకోలేకపోతే వెంకన్న మత్తుపదార్థాలను తమకు తిరిగి అప్పగిస్తానని మాటిచ్చాడు. అతడు మాటమీద నిలబడతాడు. అందువల్ల సదానంద్‌కీ విషయం తెలియబరిస్తే అతడు వెంకన్న మీద దాడి చేసి ఆ మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకోగల్గుతాడు.

తాము సదానంద్‌ను కలుసుకోవాలంటే మామూలుగా సదానందుండే యిల్లు కాక-జనతా కాలనీలో ఉన్న రాజ్యలక్ష్మి నివాస్‌కు వెళ్ళాలి. అక్కడ సదానంద్ యింటికి రహస్యంగా ఫోన్ చేయడానికి సదుపాయముంది. రాజ్యలక్ష్మి నివాస్‌కూ సదానంద్‌కూ సంబంధ ముందని ఎవ్వరూ వూహించలేరు. ఆ యింటిలో మామూలు మధ్య తరగతి కుటుంబ మొకటి ఉంటోంది. వారిని సదానంద్ ఏజంట్లని ఎవ్వరూ అనుకోలేరు.

రాజా, విక్టర్ కొంత దూరం కాలి నడకన వెళ్ళాక రిక్షా ఎక్కి జనతా కాలనీకి వెళ్ళారు. రాజ్యలక్ష్మి నివాస్‌కు చేరుకున్నారు. ఆ యిల్లు తాళం పెట్టి ఉంది.

"ఇప్పుడేం చేయాలి?" అన్నాడు విక్టర్.

"తాళం పక్కింట్లో యిచ్చారేమో అడగాలి" అన్నాడు రాజా.

ఇద్దరూ పక్కింటికి వెళ్ళారు. ఓ ముసలాయన వచ్చి

తలుపు తీశాడు. విషయం తెలుసుకుని "వాళ్ళంతా చుట్టా లింట్లో పార్టీకి వెళ్ళారు. అయిన-వాళ్ళెవరయినా వస్తే తాళం ఇవ్వ న్నారు..." అన్నాడు

"మేము శంకర్రావు ఆఫీసు మట్టాలం—" అన్నాడు రాజా.

ముసలాయన మారు మాట్లాడకుండా వాళ్ళకు తాళం చెవి యిచ్చాడు.

ఇద్దరూ తాళంచెవి తీసుకుని రాజ్యలక్ష్మీనివాస్ తలుపులు తెరిచి లోపల చొరబడ్డారు.

వాళ్ళిద్దరికీ అది తెలియనిచోటేమీకాదు. ఓ గదిలోకి వెళ్ళి గోడకున్న శ్రీనివాసుడి పటం తొలగించారు. అక్కడో చిన్నగూడు, ఆ గూట్లో టెలిఫోను వున్నాయి.

రాజా హడావుడిగా ఓ నెంబరు తిప్పి—"హలో—సదానంద్‌గారున్నారా—?" అన్నాడు.

"ఏ సదానంద్?" అని అవతలనుంచి ప్రశ్న వినబడింది.

"ప్రముఖ పారిశ్రామికవేత్త...." అన్నాడు రాజా.

"ఊఁ ఏం చెబుతావో చెప్పు...."

రాజా క్లుప్తంగా—"మాదగ్గరున్న మత్తుపదార్థాలు డిటెక్టివ్ వెంకన్న చేతుల్లోపడ్డాయి. అతడిమీద దాడిచేస్తే అవి మనకు దక్కుతాయి...." అన్నాడు.

"ఊఁ సరే—లైన్లో వుండండి...." అంది అవతలి గొంతు.

రాజా తేలికగా నిట్టూర్చాడు. తాననుకున్నది సాధించానని అతడికెంతో సంతోషంగా వుంది.

అప్పుడు లైన్లోకి సదానందం వచ్చాడు. సరుకెలా పోయిందీ అడిగి తెలుసుకున్నాడు వెంకన్నచేతిలో దొరికిపోనందుకు మెచ్చుకుని మిగతా విషయం తను చూసు

కుంటానన్నాడు.

డిటెక్టివ్ వెంకన్న తమను దయతలచి వదిలిపెట్టాడనీ, తమ మధ్య సవాలు నడుస్తున్నదనీ మాత్రం వాళ్ళు సదానంద్ కు చెప్పలేదు.

"మొత్తంమీద అనుకున్న కార్యం సాధించాం—" అన్నాడు విక్టర్.

"ఇప్పుడేం చేద్దాం—ఇక్కడేవుండి విశ్రాంతి తీసుకుందామా—లేక ట్రెయినెక్కేద్దామా?" అన్నాడు రాజా.

"ఈవేళ్టికి ఏ ట్రెయిన్ గురించీ ఆలోచించవద్దు. ఆ వెంకన్న ఏ రైల్వేస్టేషన్లో కలిసినా ఆశ్చర్యంలేదు...." అన్నాడు విక్టర్.

"అవును—ఇరవై నాలుగ్గంటలు—అతణ్ణి తప్పించుకుని తిరగాలి—" అన్నాడు రాజా.

"అంత సమయం అవసరముంటుందనుకోను. సదానంద్ మనుషులు వెంకన్నను వేటాడ్డానికి బయల్దేరి వుంటారు...." అన్నాడు విక్టర్.

"మూడొంతులు వెంకన్న పని ఫినిష్...." అన్నాడు రాజా.

ఇద్దరూ వుత్సాహంగా యింట్లోంచి బయటకువచ్చి తలుపుకు తాళంవేసి పక్కింట్లో తాళంచెవి యిచ్చి వచ్చారు.

"ఏదైనా హోటలుకు పోయిపడుకుందాం—"అన్నాడు రాజా.

ఇద్దరూ రాజ్యలక్ష్మి నివాస్‌వున్న సందులోంచీ మెయిన్రోడ్డుమీదకు వచ్చారు. సరిగ్గా అక్కడ వెంకన్న నిలబడి వున్నాడు.

"సో—బాయ్స్....ఇంకా ఏమైనా ప్రయత్నాలు చేస్తారా?" అన్నాడతడు.

రాజా తెల్లబోయి—"ఎవర్నువ్వు?" అన్నాడు.

"ఇంకెవరు?" అన్నాడు వెంకన్న—"మిమ్మల్ని నీడలా వెంటాడుతున్న వెంకన్నను...."

"మమ్మల్నెలా కనిపెట్టావ్?" అన్నాడు బురఖాలో వున్న విక్టర్.

"లొంగిపోయామని ఒప్పుకోండి రహస్యం చేప్పే స్తాను...."

"లొంగిపోతే ఏం జరుగుతుంది?"

"మీరు సదానంద్‌కు చెప్పిన అబద్ధం అబద్ధంలాగే వుండిపోతుంది. ఒకవేళ మీరు నాకిచ్చిన మాటతప్పి ఘోర నేరాలకు దిగారంటే మీ అంతట మీరే నాకు బ్రీఫ్ కేసులు అప్పజెప్పి—సదానంద్‌కి సంబంధించిన రహస్యాలన్నీ చెప్పేశారని సదానంద్‌కు వార్త చేరవేస్తాను...."

"ఆయన నీ మాట నమ్మడు!"

"ఎందుకని?"

అనివార్య కారణాల వల్ల 'కాంచన శిఖరం' ధారావాహిక సీరియల్ యీ సంచికలో కూడా ప్రచురించలేకున్నం దుకు చింతిస్తున్నాం. వచ్చే సంచిక నుంచి యధావిధిగా ప్రచురించగలము.

—సంపాదకుడు

"మామీద ఆయనకున్న నమ్మకమలాంటిది...."

"అలాగా—అయితే నేనొకవేళ సదానంద్‌తో మీ స్మగ్లింగ్ కార్యకలాపాలకు త్రిభువన్‌హోటల్, ఖాన్ టైలరింగ్‌షాప్, థియేటర్ కుసుమ, జనతాకాలనీలోని రాజ్యలక్ష్మినివాస్ అని నాకు తెలిసిపోయిందని చెప్పాననుకోండి. అప్పుడాయన ఎవర్నుమానిస్తాడు?" అన్నాడు వెంకన్న.

"ఇవన్నీ మీ కెలా తెలిశాయ్?" అన్నాడు రాజా. వెంకన్ననుంచి తప్పించుకునేందుకు తమకున్న సదుపాయాలన్నీ తాముపయోగిస్తే జరిగిందేమిటి?

"స్మగ్లింగులో మీకున్న సదుపాయాలన్నీ తెలుసుకుందుకే మిమ్మల్ని తప్పుకు పోనిచ్చాను...." అన్నాడు వెంకన్న.

రాజా, విక్టర్ ఇద్దరూ వెంకన్నకు రెండు చేతులూ జోడించి నమస్కరించి—"హేట్సాఫ్ టూ యూ!" అన్నారు. అప్పుడు రాజా—"మాలో మార్పురావలన్న మీ ఆశయం తప్పక నెరవేరుతుంది. కానీ మీరు మమ్మల్నెలా కనుక్కోగలిగారో చెప్పండి...." అన్నాడు.

"మీ రిద్దరూ ఒకరినొకరు వదిలి వుండలేరు. మారు వేషాలు కూడా జంటగా వేసిన కారణంగా నా పని చాలా సులభమైంది....అది మొదటి పాయింటు—" అన్నాడు వెంకన్న.

"మరి రెండో పాయింటు?" అన్నాడు విక్టర్.

"దూరాన్నుంచే నేను ఎత్తులు అంగుళాలతో సహా అంచనా వేయగలను. అటుపైన ఏ మారువేషం వేసినా మీ యిద్దరి ఎత్తూ నా దగ్గరున్న బైనాక్యులర్స్ సాయంతో

చూసేవాణ్ణి. మీ యిద్దరికీ భుజాలదగ్గర సరిగ్గా అయిదంగుళాల తేడావుంది. మొత్తం ఎత్తులో నాలుగంగుళాలతేడావుంది. ఇద్దరూ ఎప్పుడూ ఇంచుమించు ఒకేరకం ఎత్తున్న జోళ్ళు ధరించారు. అందువల్ల మీకున్న ఆ తేడాయే మిమ్మల్ని నాకు సులభంగా పట్టిచ్చింది. ఇది రెండోపాయింటు—" అన్నాడు వెంకన్న.

"మరి మూడోపాయింటు?" అన్నాడు రాజా.

"అది ట్రేడ్ సీక్రెట్. చెప్పకూడదు. టాటా!" అన్నాడు వెంకన్న.

వెళ్ళిపోతున్న వెంకన్నను చూస్తూ—"ఇలాంటి డిటెక్టివులుండగా—మనం మన పద్ధతులు మార్చుకోవడమే మంచిదనిపిస్తోంది—" అన్నాడు రాజా.

విక్టర్ తలూపాడు. □

చిల్డ్రన్స్ స్పెషలిస్ట్!

దొంగల పెళ్లి

కాశీభట్ల భానుమూర్తి



“ఏమిటి! మమ్మల్నందరిని రమ్మని చెప్పి. నువ్వు మౌనంగా ఉన్నావేం. ఇంతకీ ఎందుకు మమ్మల్ని పిలిపించావు?” అని అడిగింది వాహిని.

“ఆ ఏదో పుచ్చు ప్లాను వేసివుంటాడు. మనల్ని

జైలుకి పంపే ప్లానులు తప్ప ఈ వెంకట్‌కి మరొక ప్లాను రాదు కదా" అన్నాడు ఈశ్వర్రావు.

"ఈసారి అలాంటి వెధవ ప్లానులకి నే నొప్పుకోను. క్రితంసారి జైల్లో కొట్టిన దెబ్బలే ఇప్పటికింకా సర్దుకో లేదు" అన్నాడు ఫణీంద్ర మెడ తడుముకుంటూ.

"డామిట్, నోరు మూయండి. పిచ్చి పిచ్చి వాగుళ్ళు వాగారంటే మీ నోర్లు కుట్టేసి కోనేట్లో పడేస్తాను" అన్నాడు వెంకట్ పళ్ళు కొరుకుతూ.

"ఏం? క్రితంసారి నువ్వేసిన ప్లాను ప్రకారం ఫాలో అవ్వబట్టే కదా పోలీసులు మనల్ని ఫాలో అయి అరెస్టు చేసి అత్తారింటికి తీసుకొనిపోయారు. మర్చిపోయావా వెంకట్?" అన్నాడు ఫణీంద్ర కోపంగా.

"ఎందుకు మరిచిపోతాడు? పోలీసుల చేతుల్లో మన కన్నా నాలుగు చపాతీలు ఎక్కువ తిన్నాడుగా" అంది వాహిని.

"ఛీ! ఛీ! మీకు విశ్వాసం లేదు. నిరుద్యోగులుగా బ్రతుకు తున్న మిమ్మల్ని చేరదీసి మీకు పని ఇచ్చి ఈ సంఘంలో దర్జాగా బ్రతకటానికి ఏర్పాట్లు చేసిన నన్ను, ఒకసారి ఏదో పొరపాటున జైలుకి వెళ్ళవలసి వచ్చిందన్న కోపంతో అనరాని మాటలు అంటారా, మిమ్మల్ని అందర్నీ కలుపు కొనేకన్నా నేను ఒక్కడ్నే నా పాట్లేవో పడితే ఈసారికి లక్షాధికారిని అయివుండేవాడిని. మిమ్మల్నందరినీ కలుపు కొని అగచాట్లు పడుతున్నాను" అన్నాడు వెంకట్.

"మంది ఎక్కువయితే మజ్జిగ పల్చబడుతుంది అన్నట్లు మేం అందరం ఉండబట్టే సామూహిక నేరానికి శిక్ష తక్కువ పడింది. అలా కాక నువ్వు ఒక్కడివే వున్న

ట్టయితే నువ్వు చెప్పినట్టు లక్షాధికారిని అవ్వటం కాదు, పోలీసుల చేతుల్లో లక్ష దెబ్బలు తినేవాడివి" అన్నాడు ఈశ్వరరావు.

"ఇంతకీ ఏమిటంటారు? నాతో కలుస్తారా, విడిపో తారా తేల్చి చెప్పండి" అని అడిగాడు వెంకట్ కోపంగా.

"కలుస్తాం. తప్పుతుందా" అంది వాహిని.

"అయినా నువ్వు ఒక్కడివే లక్షాధికారివి కావటం ఎందుకు. అయితే అందరం లక్షాధికార్లం అవుదాం, లేకుంటే అందరం అత్తవారింటికి పోదాం. సరేనా?" అన్నాడు ఫణీంద్ర సిగరెట్ వెలిగిస్తూ.

"ఆల్ రైట్, నేనూ కలుస్తాను. కాని ఈసారి జైల్‌కి వెళ్ళే మహత్తరమైన ప్లాను లేవి చెప్పకు" అన్నాడు ఈశ్వరరావు.

"ఇప్పుడు నేను చెప్పబోయేది ఆషామాషీ ప్లాన్ కాదు, అమోఘమైన ప్లాను. జాగ్రత్తగా వినండి" అన్నాడు వెంకట్ ముందుకి వంగుతూ.

వాహిని, ఫణీంద్ర, ఈశ్వర్రావులు ఆసక్తిగా ముందుకు ఒంగారు.

"ఇప్పుడు నేను వేసిన ప్లానువల్ల మనం చాలా ఎత్తు ఎదిగిపోతాం. అందుకోసం వాహినికి ఫణీంద్రకి వివాహం నిశ్చయించాను" అన్నాడు వెంకట్.

"ఏమిటి. నాకు ఈ ఫణీంద్రకీ పెళ్ళా. నీకు మతి ఉండి మాట్లాడుతున్నావా?" అని అరిచింది వాహిని కోపంగా.

"అయినా వున్నట్టుండి పెళ్ళిళ్ళ పేరయ్యలా మారావు, కమీషన్ కోసమా నీ ప్లాను?" అన్నాడు ఫణీంద్ర, వాహిని కేసి ఓరగా చూస్తూ వెంకట్‌తో.

"అయినా మనకీ దోపిడీలు, దొంగతనాలు ఎందుకు? నాలుగు పెళ్ళిళ్ళు చేసి మన వెంకట్ డబ్బు తెస్తాడుగా" అన్నాడు ఈశ్వర్రావు ఎగతాళిగా.

"అయిందా మీ వెధవ వాగుడు! పూర్తిగా చెప్పకుండానే పుచ్చు మాటలు మాటాడారంటే పుచ్చె విరిగిపోతుంది. వాహినికి ఫణీంద్రకి వివాహం జరిపిస్తానని నేనే ఆంజనేయస్వామికి మొక్కుకో లేదు. వారిద్దరికీ వివాహంచేసి తరించాలన్న కోరికా నాకు లేదు. అయితే ఆ వివాహంవల్ల మనం ధనవంతులవయ్యే ప్లాను మాత్రం వేసాను" అన్నాడు వెంకట్.

"అంటే వారిద్దరికీ పెళ్ళి చేసి వచ్చిన బహుమతుల్ని సెకండ్ హ్యాండ్ షాపులో అమ్మి ధనం సంపాదిద్దామనా నీ ఆలోచన?" అన్నాడు ఈశ్వర్రావు.

"అట్టే మాట్లాడావంటే ముందు నీకు చేస్తాను పెళ్ళి. నా ఆలోచన పూర్తిగా వినకుండా ఆవేశపడిపోతావేం. వాహినికి, ఫణీంద్రకి పెళ్ళి జరుగుతున్నట్టు కార్డులు ముద్రించి నగరంలో వున్న ధనవంతులకి వ్యాపారస్థులకి పంచిపెడదాం. ఒక కల్యాణమండపం బుక్‌చేసి అతి వైభవంగా వివాహం జరిపిద్దాం. వివాహం సరిగ్గా రసవత్తరంగా జరుగుతుండగా మన ఏర్పాట్లప్రకారం కరెంట్ పోతుంది. ఆ చీకటిలో, ఆ హడావుడిలో మన పని మనం ముగించుకొంటాం. పెళ్ళికి వచ్చిన అందరికీ విలువు దోపిడీ చేసి మరీ పంపుతాం. కటకటాలు లెక్కపెట్టుకోకుండా కాసులు లెక్కపెట్టడానికి ఇదే ఉత్తమమైన మార్గం. ఎలా వుంది నా ప్లాను" అన్నాడు వెంకట్ హుందాగా.

"నా మొహంలా ఉంది. ఆ తరువాత మనల్ని పట్టుకొన్నారంటే మన దగ్గర వున్న సొమ్ములు వూడలాక్కొని వాహినితోపాటు అత్తవారింటికి మనల్ని కూడా పంపుతారు" అన్నాడు ఈశ్వర్రావు.

"పెళ్ళి చేసుకొనేది మేమే కూడాను. ఆ తరువాత నగరంలో దొరికామంటే నంచుకొని తినేస్తారు పోలీసులు. ఈ ప్లాను వద్దు మరో ప్లాను వేయి బాబు" అంది వాహిని మొండిగా.

"అవును నిజమే. నాకూ ఇందులో లొసుగులు కనపడుతున్నాయి" అన్నాడు ఫణీంద్ర.

"మిమ్మల్ని బాగు చేయటం నావల్ల కాదు. నిక్షేపంలాంటి ప్లాను చెపితే అందులో వంకలు వెదుకుతారా? మీ కసలు బుద్ధుందా?" అన్నాడు వెంకట్.

"నీది నిక్షేపంలాంటి ప్లానా, నా పిండాకుడు. అసలు ఈ నగరంలో ధనవంతు లెవరితోనో మనకి పరిచయం లేదు. వ్యాపారస్తు లెవరో కూడా తెలియదు. అలాంటి మనం ధనవంతులకి వ్యాపారస్థులకి ఆహ్వానాలు పంపటం; వాళ్ళు రావటం, మనం దోచుకోవటం. ఇలాంటి ప్లానులు పగటికలలు కనడానికి పనికివస్తాయి గాని ఆచరణకి పనికిరావు" అన్నాడు ఈశ్వరరావు.

"అంటే మనం ఒక బ్యాంకు దోపడి చేద్దామనుకొన్నామనుకో, దానికి ఆ బ్యాంకు సిబ్బందితోను, ఆ బ్యాంకు కట్టిన కాంట్రాక్టర్‌తోను, ఇటికలు తయారుచేసిన ఇటుక బట్టీ వాళ్ళతోనూ పరిచయాలు వుండాలంటావా చెప్పు" అన్నాడు వెంకట్ కోపంగా.

"అది వేరు. ఇది వేరు" అన్నాడు ఈశ్వర్రావు

చిరాగ్గా.

"అదీ ఇదీ ఒకటే. అందరికీ వివాహం చేస్తున్నామని చెప్పి, ఆహ్వాన పత్రాలు పంపుదాం. పెళ్ళికి వచ్చినట్టు వస్తారు. ఎంతమంది వస్తే అంతమంది దగ్గరా నిలువు దోపిడీ చేద్దాం" అన్నాడు వెంకట్.

"మరి దీనికి పెట్టుబడి కావద్దూ. ఒకవేళ ప్లాను సక్సెస్ కాకపోతే పెట్టుబడిగా పెట్టిందంతా బూడిదలో పోసిన పన్నీ రవుతుంది. అదంతా ఎవరు భరిస్తారు" అన్నాడు ఫణీంద్ర రాజీకి వస్తూ.

"నేనే పెడతాను పెట్టుబడి. వ్యాపారానికి పెట్టుబడి ఎంత అవసరమో. ఈ రోజుల్లో దోపిడీలకి దొంగతనాలకీ కూడా పెట్టుబడి అవసరం అవుతోంది. ఒకవేళ మనం అనుకొన్నది సరిగ్గా జరగకపోతే ఆ నష్టంకూడా నేనే భరిస్తాను. సరా" అన్నాడు వెంకట్.

"ఆల్ రైట్. పెట్టుబడి నీది. ప్లాను నీది అయినప్పుడు పని చేయటానికి నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ఫణీంద్ర.

"నాకు కూడా ఏ అభ్యంతరమూ లేదు. డబ్బు సంపాదనకి ఏదో ఒక ప్లాను కావాలిగదా. నేనూ ఒప్పుకుంటున్నాను" అంది వాహిని.

"ఫణీంద్ర. వాహిని ఒప్పుకొన్నప్పుడు నేనుమాత్రం మొండికేయటం ఎందుకు. నేనుకూడా ఒప్పుకొంటున్నాను. ప్లానేమిటో వివరంగా చెప్పు. అందరం వింటాం" అన్నాడు ఈశ్వర్రావు.

"చెప్పటానికేం లేదు చేయటమే. ఇక పదిరోజులలో

పెళ్ళి వుంది. మనం ఇకనుంచి పెళ్ళిప్రయత్నాలలో పడాలి. ఎంతైనా పెళ్ళిపెద్దని కదా. నాకు చాలా పనులు" అన్నాడు వెంకట్ నవ్వుతూ.

2

విసురుగా వచ్చి ఆగింది పోలీసు జీపు. అందులోంచి అర డజను మంది పోలీసులతో పాటు ఇన్స్పెక్టర్ పాపారావు కూడా దిగాడు.

"అదిగో పోలీసులు వచ్చేసారు" అన్నాడు కళ్యాణ మంటపం దగ్గర ఉన్న వ్యక్తి. ఆ మాటలు పాపారావుకి వినపడ్డాయి. వెంటనే ఆ మనిషిని గట్టిగా పట్టుకొన్నాడు. దానితో ఆ మనిషి బెదిరిపోయి తెల్లబోయాడు.

"ఏమిటి. పోలీసులు వచ్చేశారని గావుకేకలు వేస్తున్నావు. నీ అనుచరులతో పారిపోదామనా" అన్నాడు పాపారావు కోపంగా.

"నేను పారిపోవటమేమిటండి నా బొంద. నేను ఈ కళ్యాణ మంటపం గుమాస్తాని. అసలు వాళ్ళెప్పుడో ఉడాయించారు" అన్నాడు.

"అసలు వాళ్ళు పారిపోయారా. అలా ఎలా వీలవుతుంది. నేను రాకుండా ఎలా పారిపోయారు." అని అరిచి ఒక్క ఉరుకుతో లోపలికి దూకాడు ఇన్స్పెక్టర్ పాపారావు. పోలీసులు అందర్నీ హడలగొడుతూ లోపలికి ఉరికారు. ఇన్స్పెక్టర్ పాపారావు రివాల్వర్ బయటకి తీసాడు.

"ఎవరూ కదలకండి. నానుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఎక్కడ హంతకులు. ఎక్కడ హతులు. నాకు

ఫోనుచేసిన ఆ ఉత్తమ పౌరుడెవరు?" అని అరిచి గాల్లోకి రివాల్వర్ పేల్చాడు పాపారావు.

"అయ్యా! ఇన్‌స్పెక్టర్‌గారూ, ఇక్కడ హత్యలూ జరగలేదు. హంతకులూ లేరు. ఇక్కడ దోపిడీ జరిగింది. జరిపిన దొంగలు పారిపోయారు. మీకు ఫోన్‌లో చెప్పింది నేనే" అని ముందుకి వచ్చాడొక మనిషి.

"దోపిడీ జరిగిందా? నాన్సెన్స్, ఈ ఇనస్పెక్టర్ పాపారావు వున్న పోలీసు స్టేషన్ పరిధిలో దోపిడీ జరుగుటా. ఇంపాజిబుల్. ఇంతకీ ఎవరా దొంగలు?" అన్నాడు పాపారావు అటూ ఇటూ చూస్తూ.

"అయ్యా! ఇన్‌స్పెక్టర్‌గారూ! మీరు కాస్త స్థిమితపడి సావధానంగా వింటేనే గాని మాకు చెప్పటం కుదరదు. ముందా చేతిలోని రివాల్వర్ జేబులో పెట్టుకోండి. ఇక్కడి వాళ్ళు ఖంగారు పడుతున్నారు. ఇందాకటి దొంగలే మమ్మల్ని రివాల్వర్లు చూపించి హడలగొట్టలేదు" అన్నాడు ఇందాకటి మనిషి.

ఇన్‌స్పెక్టర్ పాపారావు రివాల్వర్ జేబులో పెట్టేసుకొన్నాడు.

మిగిలిన పోలీసులు కళ్యాణమంటపం మెయిన్‌గేట్ దగ్గర ఇద్దరు, మిగిలిన రెండు గేట్లదగ్గరా ఇద్దరిద్దరూ సర్దుకొని నుంచున్నారు.

"ఆ! ఇప్పుడు చెప్పండి. అసలు ఏం జరిగింది, ఎలా జరిగింది, ఎప్పుడు జరిగింది వివరంగా చెబితే నేరస్థుల్ని త్వరగా పట్టుకొని త్వరగా శిక్షిస్తాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్ పాపారావు.

"మాకు జరిగింది తలుచుకొంటేనే ఆశ్చర్యంగా వుంది.

ఇక్కడ వున్న ఎవరికీ ఆ దొంగలెవరో తెలియదు. మేం అందరం కాస్తో కూస్తో వున్నవాళ్ళమే. మాకందరికీ ఎవరో వచ్చి ఆహ్వాన పత్రాలు యిచ్చారు వివాహానికి రమ్మని. మేం అందరం వివాహానికి వచ్చి కూర్చొన్నాం. పెళ్ళి సగం జరుగుతుండగా కరెంట్ పోయింది. మేం అందరం హడావుడిగా లేచాం. ఆ హడావుడిలో ఆ గందరగోళంలో మా దగ్గర వున్న చిన్న ఉంగరం దగ్గరనుంచి, మా ఆడ వాళ్ళ దగ్గర వున్న పెద్దపెద్ద వడ్డాణాలవరకూ మొత్తం కొల్లగొట్టుకొని పారిపోయారు. ఆ తరువాత ఈ కళ్యాణ మంటపం గుమాస్తా వచ్చి ఫ్యూజువైర్ వేసి కరెంట్ తెప్పించాక చూస్తే తెలిసింది మేం ఘోరంగా మోసపోయినట్టు. విచిత్ర మేమిటంటే పెళ్ళిపెద్దలుగా వున్న ఇద్దరు, పెళ్ళి చేసుకొనే ఇద్దరూ ఆ తరువాత కనిపించలేదు" అన్నాడు ఒక మనిషి వివరంగా చెబుతూ.

"ముక్కూ మొహం తెలియనివాళ్ళు పిలిస్తే మాత్రం ఎలా వచ్చారు మీరీ పెళ్ళికి" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్ పాపారావు.

"మాకున్న దౌర్భాగ్యం ఇదే. మా ఆడవాళ్ళకున్న నగా నట్రా ప్రదర్శించటానికి, మాకుండే హోదా తెలియచెప్ప టానికి ఇలాంటి పెళ్ళిళ్ళే మాకు ఉపయోగపడతాయి. ముక్కూ మొహమూ తెలియకపోయినా కూడా మా దాబూ దర్జా చూపించటానికి బుద్ధితక్కువై వచ్చాం" అన్నాడు వేరొక మనిషి.

"దీనినిబట్టి మీకు శుభలేఖలు ఇచ్చినవాళ్ళే ఈ పనిచేసి వుంటారు. కళ్యాణ మంటపం బుక్ చేసుకొని ఆ ముఠాలో వాళ్ళే ఇద్దరు పెళ్ళిచేసుకొంటున్నట్టు నటించి మీ అందర్నీ

అపరాధ పరిశోధన పోటీ-198

[ఫలితాలు]

జనవరి '85 నెల "అపరాధ పరిశోధన పోటీ-198" కి సరియైన సమాధానాలు:

1. చలిగాలి.
2. గడ్డాఫీ.
3. భూకంపాలు.
4. పంజాబ్.
5. ఖలిస్తాన్ ఉద్యమకారులు.

పై జవాబుల ప్రకారం ఒకే ఒక్కరు ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఏప్రిల్ '85 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

బహుమతి పొందిన విజేత :

శ్రీ ఎస్. సాయరెడ్డి,
శ్రీ రాజరాజేశ్వర స్వామి రైస్‌మిల్,
వీక్లీ బజార్,
నిజామాబాదు - 503 001.

మోసం చేసి నిలువుదోపిడీ చేసారు. ఆ తరువాత అందరూ పారిపోయారు. కాని ఎక్కడికి పోతారు. వాళ్ళు దొంగి లించిన సొమ్ముతో సహా నాకు దొరికితీరుతారు. మీరందరూ నాకు కంప్లయింట్ వ్రాసి ఇవ్వండి" అన్నాడు పాపారావు ధీమాగా.

అందరూ వివరంగా కంప్లయింట్ వ్రాసి, సంతకాలు చేసి మరీ పాపారావుకి ఇచ్చారు కళ్యాణమంటపం గుమ స్తాతో సహా.

"ఆల్‌రైట్. మిగిలినది నే చూసుకుంటాను, మీరు మీ మీ ఇళ్ళకి వెళ్ళిపొండి" అన్నాడు పాపారావు.

ఎందుకైనా మంచిదని అందర్నీ చెక్‌చేసి మరీ బయ టికి వదిలాడు పాపారావు.

3

"ఇంతకీ ఎంతవచ్చింది కలెక్షన్", అన్నాడు ఫణీంద్ర.

"క్యాష్ తక్కువేవచ్చింది. నాలుగువేలు. బంగారం మాత్రం ఎక్కువవచ్చింది. మొత్తం అంతా కలిపి నాలు గైదు లక్షలు వుంటుంది" అన్నాడు వెంకట్.

"పోనీలే కష్టానికి తగ్గ ఫలితందక్కింది. ఒక్కొక్కరికి ఒక్కొక్క లకారందాకా వస్తుంది." అంది వాహిని ఆనందంగా.

"మరి నా పెట్టుబడి. పదివేలు అయింది పెట్టుబడి. పక డ్బందీగా పెళ్ళి ఏర్పాట్లు చేసినందుకు ఆడపిల్లతండ్రికి అయినట్టే నాకూ ఖర్చుఅయింది. పైగా ప్లాను నాది కనుక న్యాయంగా నావాటా ఎక్కువ" అన్నాడు వెంకట్.

"ఏదోఒకటి చేయి. కాని ఏదిచేసినా నా వాటామాత్రం నాకు త్వరగా పంచేయి. నాకు చాలా అవసరాలున్నాయి." అన్నాడు ఈశ్వర్రావు.

ఫారము - 4

1. ప్రచురణ స్థలము	:	హైద్రాబాదు-29.
2. ప్రచురణ కాలము	:	మాస పత్రిక.
3. ముద్రాపకుని పేరు	:	శ్యామ దామోదర రెడ్డి.
జాతీయత	:	భారతీయుడు.
చిరునామా	:	హైద్రాబాదు-29.
4. ప్రచురణ కర్త పేరు	:	-డిటో-
జాతీయత	:	
చిరునామా		
5. సంపాదకుని పేరు	:	-డిటో-
జాతీయత		
చిరునామా		
6. వార్తాపత్రికపై యాజమాన్యము గల వ్యక్తులు, భాగస్తులు పేర్లు, చిరునామాలు	:	శ్యామ దామోదర రెడ్డి 3-4-554, నారాయణగూడ, హైద్రాబాదు-29. (సోల్ ప్రొప్రయిటరు)

శ్యామ దామోదర రెడ్డి అయిన నేను, పై తెలిపిన వివరములు నాకు తెలిపినంత వరకు, నేను విశ్వసించినంత మేరకు సత్యమైనవని, ఇందు మూలముగా ప్రకటించు చున్నాను.

తేది :

1-3-85.

శ్యామ దామోదర రెడ్డి

(ప్రచురణకర్త సంతకం)

"ఎవరికీలేవు. కాని ఈ గొడవ సద్దుమణిగేదాకా వాటాల పంపకం కుదరదు. ఒకవారం పదిరోజులాగాక ఎవరి వాటాలు వాళ్ళు పంచుకొని ఈ రూమ్ ఖాళీచేసి ఎవరి కిష్ట మొచ్చినచోటుకి వాళ్ళుపోదాం. ఆ తరువాత ఈ డబ్బు అయిపోయాక మళ్ళీ భారీఎత్తున మరొకప్లాను వేస్తాను." అన్నాడు వెంకట్.

ఫణీంద్ర ఏదో అనబోయాడు. ఇంతలో "పోస్టు"అన్న కేక వినపడి ఈశ్వర్రావు పరుగునవెళ్ళి పోస్టుమేన్ దగ్గర నుంచి ఒక ఉత్తరం తీసుకొచ్చాడు.

ఆ వుత్తరం వెంకట్‌కి వచ్చింది. వెంకట్ ఆత్రుతగా ఆ లెటర్ విప్పి చదివాడు. పళ్ళు కొరుకుతూ ఆ ఉత్తరాన్ని ఫణీంద్రకిచ్చాడు.

"ఒరే వెంకట్! దగాచేసే పెళ్ళిపెద్ద. నువ్వు ఆడిన పెళ్ళినాటకం అంతా నేను చూసాను నీ ముఠాలోవున్న ఇద్దరికి నువ్వు వివాహం జరిపించి, వచ్చిన ఆహ్వానితుల దగ్గర నిలువుదోపిడి చేసావు. ఈ రహస్యం పోలీసులకి చెప్పకుండా ఉండాలంటే నువ్వు ఒక లక్షరూపాయలు నాకు సమర్పించుకోవాలి. డబ్బు ఎక్కడ ఇవ్వాలి. ఎప్పుడు ఇవ్వాలి అన్నది తరువాత ఫోన్‌చేస్తాను. ఈలోపున దొంగి లించిన నగలని అమ్మి డబ్బు రెడీగాపెట్టుకో. ఇట్లు అవకాశ వాది."

ఫణీంద్ర దగ్గరనుంచి ఆ లెటర్ తీసుకొని వాహిని ఈశ్వర్రావులు చదివారు. వారికీ ఈ విషయం అయోమయంగా వుంది.

"ఎవడయి వుంటాడు ఈ అవకాశవాది. అసలు వాడికి మన ప్లాను ఎలా తెలిసింది. అంతా అయోమయంగావుంది."

శ్రీ వెంకటేశ్వరా వారి

సూపర్ థ్రిల్లర్స్

ఫిబ్రవరి 25 విడుదల!

1. టెర్రర్! టెర్రర్!! — శ్యాంబాబు
2. మృత్యు దీపం — N.S. నాగిరెడ్డి

సంక్రాంతికి విడుదలైనవి!!

1. లవ్ మాజిక్ — శ్యాంబాబు రు. 15-00
2. రుద్రనేత్రం — N.S నాగిరెడ్డి రు. 15-00
3. మరో ప్రేమబంధం — ఎస్. భారతీదేవి రు. 14-00

మీ ఆర్డరుతో పాటు

అడ్వాన్సు పంపగలరు.

వివరాలకు :

శ్రీ వెంకటేశ్వర పబ్లికేషన్స్

మాజేటివారి వీధి, గాంధీనగర్,

విజయవాడ - 520 003.

అన్నాడు ఈశ్వరరావు.

"వాడెవడో తెలుసుకొని వాడు తిరిగి తలెత్తకుండా నేలరాసేయనూ. నాతోనే బ్లాక్ మెయిల్ ఆటలు ఆడతాడా. చూపిస్తా నా తడాఖా." అన్నాడు వెంకట్ చిందులు తొక్కుతూ కోపంగా.

"వాడితో ఎందుకు. వాడు అడిగింది ఇచ్చేస్తే గొడవ వదిలిపోతుందిగదా." అంది వాహిని బెదురుగా.

"అలాంటి వెధవలకి అడిగింది ఇచ్చేస్తే ఒళ్ళు బలిసి మళ్ళీ మళ్ళీ బెదిరిస్తారు. ఆదిలోనే ఈ వ్యవహారాన్ని అంతం చేయకపోతే మనం అందరం చాలా చిక్కుల్లో పడతాం." అన్నాడు వెంకట్ తీవ్రంగా.

"అలా అని వాడిగురించి మనం కలిగించుకొంటే వాడు రెచ్చిపోయి మన విషయం పోలీసులకి చెబితే మనం అందరం కటకటాలు లెక్కపెట్టాలి. దానికన్నా వాడు అడిగింది ఇచ్చేసి ఒక నమస్కారం పడేస్తే గొడవ వదిలిపోతుందిగదా. లేనిపోని గొడవతెచ్చుకొనేకన్నా." అన్నాడు ఫణీంద్ర.

"నిజమే. వాడు అడిగింది ఇచ్చేస్తే మిగిలినది పంచుకొందాం. వాడూ మన వాటాదారుడే అనుకొంటేసరి." అంది వాహిని.

"ఏం అక్కరలేదు. వాడెవడో, వాడి సంగతేమిటో త్వరలోనే తేల్చుకొంటాను. నన్ను బ్లాకుమెయిల్ చేసేవాడు ఇప్పటిదాకా పుట్టలేదు. మీరు ఈ విషయం నాకు వదిలేసి మీ దారిన మీరుపొండి. హాయిగా ఈ వారంరోజులూ గడిపేసిరండి. ఆ తరువాత వాటాలు పంచుకొందాం." అన్నాడు వెంకట్.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, మీకు ప్రతి పత్రికపైన ఒకరూపాయి తగ్గింపు లభిస్తుంది. పైగా వాటిని పంపుటకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

3. మీరు సభ్యత్వము తీసుకోగానే మొదటినెల కాపీలు, ఆటుతర్వాత ప్రతి జనవరి నెల కాపీలు వి.పి. ద్వారా పంపబడుతాయి. డిసెంబరు నెల వరకు వచ్చే అన్ని సంచికలకు సెట్టుకు రు. 10/-లు చొప్పున లెక్కకట్టి, ఆ మొత్తానికి ఒకేసారి వి.పి. పంపుతాము. మిగతా నెలల కాపీలు మీకు బుక్ పోస్ట్ లేదా రిజిష్టరు పోస్టులో అందజేయబడుతాయి.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మొత్తం మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా ఖచ్చితంగా అందజేయబడతాయి. ఆ బాధ్యత మాది.

6. మీ చిరునామా మారినప్పుడు, మరియు జనవరి నెలలోను మీ సభ్యత్వపు నెంబరు మారే అవకాశం వుంటుంది. కావున మీ పాకెట్ పై మీ పేరుకు ముందు వుండే కొత్త నెంబరును గుర్తించ కోర్తాము.

7. ఏ కారణంగానైనా 25వ తేదీలోపల మీకు పత్రికలు చేరకపోతే, ఆ విషయం మాకు తెలుపండి. వాటి బాధ్యత మేము తీసుకుంటాము. ఉత్తర ప్రత్యుత్తరాలలో మీ నెంబరు వ్రాయటం మాత్రం మరచిపోవద్దు. మీ నెంబరు వ్రాయకున్నా 25 తేదీలోపల తెలిపినా—అవి పరిశీలనకు తీసుకోబడవు.

ప్రతినెలా V.P. కావాలనేవారికి
V.P. రు. 15/లకు పంపబడుతుంది.

చేసేదిలేక వెంకట్‌కి చెప్పి వాహిని, ఫణీంద్ర బయటకి వెళ్ళిపోయారు ఈశ్వరరావు అక్కడే ఆగిపోయాడు.

వెంకట్ తీవ్రంగా ఆలోచిస్తూ అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

4

తలుపు చప్పుడుకి వెంకట్ ఉలిక్కిపడ్డాడు. ఈశ్వరరావు కంగారుపడుతూ వెళ్ళి తలుపుతీసాడు.

తలుపు తీపిన ఈశ్వరరావుని తోసుకుంటూ ఈగలా ఎగురుకుంటూ లోపలికి వచ్చాడు ఇనస్పెక్టర్ పాపారావు. ఆ వెనకే ఎస్సై పుణ్యారావు, మరికొంతమంది పోలీసులు టోపీలు సర్దుకొంటూ లోపలకి దూకారు.

వెంకట్‌కి, ఈశ్వరరావుకి ఏమీ అర్థంకాక పోలీసులకేసి తెల్లబోయి చూడసాగారు.

"మిస్టర్ వెంకట్. కాసేపు తెల్లబోయే నీ నటనని ఆపేసి ఈ సంకెళ్ళు తగిలించుకో. నీకు సాయంగా ఈ ఈశ్వరరావు కూడా వస్తాడు." అని జేబులోంచి రివాల్వర్ తీసి గాల్లోకి పేల్చబోయి మానేసాడు పాపారావు.

"మేమా, మేమేం నేరం చేసాం." అని అడిగాడు వెంకట్ ఆదుర్దాగా. అప్పటికే ఆ చుట్టుప్రక్కల జనం అంతా అక్కడికి చేరుకొన్నారు.

"మిత్రుడు, నీ దొంగబతుకులో పార్టనర్ అయిన ఫణీంద్రని నిర్దాక్షిణ్యంగా చంపినందుకు నీకు, దొంగతనంలోను హత్యలోను సహకరించినందుకు నీ మిత్రుడు ఈశ్వరరావుకి శిక్ష తప్పదు. మాట్లాడకుండా పోలీసు స్టేషన్‌కి నడు." అని గర్జించాడు పాపారావు కోపంగా.

అక్కడ మూగినజనం ఆవేశం పట్టలేక "ఇనస్పెక్టర్

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలల పాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-3-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు మే '85 నెల సంచికలో ప్రకటిస్తాము.

జనవరి పోటీ ఫలితాలు

(1) జనవరి '85 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

రక్తం తాగే రాకాసికి,
పగ్గం వేసే మొనగాడు!

పంపినవారు: శ్రీ వి. కె. రావ్, ఎల్. ఐ. సి. ఆఫ్ ఇండియా, బ్రాంచ్ ఆఫీసు, తుని—533 401 (తూ. గో. జిల్లా).

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

అరణ్య రోదనం!
అశ్వాల గమనం!!

పంపినవారు: శ్రీ వి శ్రీనివాస్, ఎల్. ఐ. సి. ఆఫ్ ఇండియా, హన్మకొండ - 506 101.

జిందాబాద్. పోలీసులు జిందాబాద్. నేరస్థులు నశించాలి."
అని అరవసాగారు.

ఇనస్పెక్టర్ పాపారావు ఛాతీ మైలు దూరం విస్తరించింది.

"మేమా హత్య చేయలేదు. అసలు మేమా హత్య చేసామని మీ కెవరు చెప్పారు?" అన్నాడు వెంకట్ వణుకుతున్న స్వరంతో.

"నేనే చెప్పాను. నీ పాపం బద్దలవ్వబట్టి పోలీసులకి చెప్పవలసి వచ్చింది." అంది వాహిని జనాన్నితోసుకుంటూ ముందుకివచ్చి.

"నువ్వు చెప్పావా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు వెంకట్.

"అవును. నేను వద్దంటున్నా వినకుండా ఫణీంద్ర నీ దగ్గరనుంచి ఎక్కువ డబ్బు రాబట్టుకోవటానికి లెటర్ వ్రాసాడు. దానితో నువ్వు ఫణీంద్రని చంపేసావు. నేను

ఇప్పుడెలా?



శ్రీ మహాలక్ష్మి వారి
నూతన ప్రచురణలు

ఫిబ్రవరి విడుదల

1. రెండు రెళ్ళు ఆరు మల్లాది వెంకట కృష్ణమూర్తి
(ఆంధ్రజ్యోతి సీరియల్)

2. పారిపోయిన ఖైదీలు ,, ,,
(ఆవన సీరియల్)

3. గుడ్‌బై దేవీ గుడ్‌బై N.R. నంది
(ఆంధ్రజ్యోతి సీరియల్)

4. శిక్ష మాదిరెడ్డి సులోచన

5. మల్లెలు - మందారాలు వసుంధర
(ఆవన సీరియల్ - రక్తపుజేర్లు)

6. అనురాగ తరంగాలు జి. భవానీ కృష్ణమూర్తి

అడ్వాన్సుతో పాటు నేడే
మీ ఆర్డరు పంపండి

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ - 2.

పోలీసులకి చెప్పేసాను." అంది వాహిని కోపంగా.

"మిస్టర్ వెంకట్. ఇప్పటికైనా నీ నేరం ఒప్పుకో. నీకు శిక్ష ఎలాగూ తప్పదు" అని హెచ్చరించాడు ఇనస్పెక్టర్ పాపారావు.

"ఆల్‌రైట్ నేను, ఫణీంద్ర, ఈశ్వరరావు, వాహిని కలసి పెళ్ళినాటకం ఆడి, వచ్చినవాళ్ళని నిలువుదోపిడి చేసి డబ్బు సంపాదించాం. అయితే ఫణీంద్ర తనకి ఎక్కువ సొమ్ము రావటంకోసం బ్లాక్ మెయిల్ చేసాడు. ఆ రూమ్ అడ్రస్సు మా నలుగురుకీ తప్ప మరెవరికీ తెలియదు. అదీ కాక ఆ వ్రాత ఫణీంద్ర చేతివ్రాతలానే వుంది. అందుకని ఫణీంద్రని అనుమానించితే అతడే బ్లాకుమెయిల్ చేసాడని తెలిసింది. వెంటనే హత్యచేసాను" అన్నాడు వెంకట్.

"నువ్వు వెంటనే హత్యచేసావు. నేను వెంటనే అరెస్టు చేసాను. నడు పోలీసుస్టేషన్‌కి" అన్నాడు ఇనస్పెక్టర్ పాపారావు.

"వంచకీ, వాహిని. ఎందుకు పోలీసులకి నిజం చెప్పావు." అని అరిచాడు ఈశ్వరరావు ఆవేశం పట్టలేక.

"ఎందుకు చెప్పానా. ఏనాడైతే ఫణీంద్ర నా మెడలో మూడుముళ్ళు వేసాడో ఆనాడే అతను నాకు దైవం అయ్యాడు. అది దొంగపెళ్ళి అవుగాక, కాని నాకు అతనే భర్త. అతన్ని హత్యచేస్తే ఊరుకొంటానా. అందుకే నా భర్త చావుకి ప్రతీకారంగా మిమ్మల్ని జైలుకి పంపిస్తున్నాను." అంది వాహిని. □

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.


Regd.no:H/HD-48
PRABHAKAR

Regd.no:H/HD-48
'+' PRABHAKAR!